ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం 05.08.2025 | సంపుటి :12 సంచిక : 17 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
JANAMSAKSHI TV


Simultaneously Published from Hyderabad & Karimnagar
ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



కాళేశ్వరం నివేదికపై కేబినెట్ భేటిలో చర్చించిన తరువాత ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, తుమ్మల, దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ తదితరులు

# కాళేశ్వరంపై అసెంబ్లీలో చర్చిస్తాం

## నివేదిక సభలో ప్రవేశపెడతాం

- అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాలను తీసుకుంటాం
- రూ.లక్షకోట్ల ప్రాజెక్టు కుంగిపోవడం బాధాకరం
- కాళేశ్వరం కమిషన్ నివేదికకు కేబినెట్ ఆమోదం
- ఈ నివేదిక ప్రభుత్వం ఇచ్చింది కాదు: డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్(జనంసాక్షి): కాళేశ్వరం కమిషన్ ఛైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ సమర్పించిన నివేదిక కు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. దీనిని అసెంబ్లీలో పెడతామని అన్నారు. విచారణకు సంబంధించిన వివరాలను కమిషన్ విశ్లేషణాత్మకంగా నివేదికలో పొందుపరిచిందని చెప్పారు. క్యాబినెట్ భేటీ అనంతరం మంత్రులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం మాట్లాడారు. కాళేశ్వరం కమిషన్ నివేదికను త్వరలో అసెంబ్లీలో ప్రవేశపెడతామని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దీనిపై అన్ని పార్టీలు

మిగతా 2లో..

## శిబూసోరెన్ కన్నుమూత


ఢిల్లీలో గంగారాం ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచిన ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి

సంతాపం ప్రకటించిన రాష్ట్రపతి, ప్రధాని



న్యూఢిల్లీ(జనంసాక్షి):ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి శిబూసోరెన్ (81) కన్నుమూశారు. మూత్రపిండాల సమస్యతో బాధపడుతూ ఢిల్లీలోని గంగారాం ఆస్పత్రిలో ఆయన తుది శ్వాస విడిచారు. ఈ విషయాన్ని ఆయన కుమారుడు, ఝారండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. "మన ప్రియనేత దిషోమ్ గురూజీ మనల్ని

మిగతా 2లో..



## కాళేశ్వరంపై వడ్డీ తగ్గింపు కృషి చేస్తాం

ప్రాజెక్టు పూర్తి చేస్తే ఆ విషయమై ఆలోచిస్తాం

లోక్‌సభలో ఎంపీ చామల ప్రశ్నకు కేంద్రం సమాధానం

వార్త 2 లో

### కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్

## ఊహించిందే..

- త్వరలో కొంత మంది బీఆర్‌ఎస్ నేతలు అరెస్ట్ కావొచ్చు
- అయినా భయపడేది లేదు..
- కాంగ్రెస్ ప్రభుత్వ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి
- అది కాళేశ్వరం కాదు.. కాంగ్రెస్ కమిషన్
- శ్రేణులకు కేసీఆర్ పిలుపు



గజ్వేల్(జనంసాక్షి): కొంత మంది బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేయవచ్చు.. భయపడ వద్దని వారికి బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పనికిరాదన్నవాడు అజ్ఞాని అని ఆయన అభివర్ణించారు. కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని బీఆర్ఎస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కాళేశ్వరంపై కేబినెట్‌లో ఏం నిర్ణయం తీసుకుంటారో వేచి చూద్దామని పార్టీ నేతలతో మాజీ సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరుగుతున్న కేబినెట్ సమావేశంలో భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కమిషన్ నివేదికను పవర్ పాయింట్ ద్వారా ప్రజెంటేషన్ చేశారు. అదే సమయంలో ఎర్రవల్లిలోని తన ఫామ్ హౌస్‌లో పార్టీ ముఖ్య నేతలతో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. అది కాళేశ్వరం కమిషన్ కాదు.. కాంగ్రెస్ కమిషన్ అని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్ ఊహించినదేనని స్పష్టం చేశారు. దీనిపై ఎవరూ ఆందోళన చెందాల్సిన

మిగతా 2లో..

## కాళేశ్వరం లోపాలకు కేసీఆర్‌దే బాధ్యత

- ఈ విషయం కమిషన్ తేల్చిచెప్పింది: ఉత్తమ్
- ప్రాజెక్టు కోసం ఆర్థిక పరిస్థితిని పణంగా పెట్టారు
- రూ.38వేల కోట్లతో తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు చేపట్టాల్సి ఉండగా.. మేడిగడ్డకు మార్పు
- భారీగా తెచ్చిన అప్పులతో చేపట్టిన కాళేశ్వరం భారాస హయాంలోనే కుంగిపోయింది
- రాజకీయాలకు తావు లేకుండా విచారణ



హైదరాబాద్(జనంసాక్షి): కాళేశ్వరం ప్రాజెక్టు కోసం గత పాలకులు అధిక వడ్డీలతో రూ.84వేల కోట్ల అప్పు తెచ్చారని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. క్యాబినెట్ భేటీ అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులతో కలిసి

మిగతా 2లో..

## కాళేశ్వరం నిర్మాణానికి పూర్తి బాధ్యత కేసీఆర్‌దే

నివేదికపై అధికారుల కమిటీ వెల్లడి

2లో



## 2047 నాటికి 3 ట్రిలియన్ల ఎకానమీగా తెలంగాణ

లైఫ్‌సైన్సెస్ రాజధానిగా హైదరాబాద్

ఇక్కడ తయారైన ఔషధాలు, టీకాలు చాలా దేశాలకు ఎగుమతి అవుతున్నాయ్

లిల్లీ ఫార్మా కంపెనీ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

## బీఆర్‌ఎస్ పార్టీకి భారీ షాక్

ముగ్గురు మాజీ ఎమ్మెల్యేల రాజీనామా

కేసీఆర్‌కు లేఖలు పంపిన గువ్వల బాలరాజు, అబ్రహం, మర్రి జనార్ధన్ రెడ్డి

తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామాలు

హైదరాబాద్, ఆగస్ట్ 04 (జనంసాక్షి) : స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీఆర్ఎస్ పార్టీలో మరో అలజడి రేగింది. తాజాగా ముగ్గురు కీలక మాజీ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. ఈ ముగ్గురిలో గువ్వల బాలరాజు, మర్రి జనార్ధన్ రెడ్డి, అబ్రహం ఉండగా.. వారు తమ రాజీనామా లేఖలను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు పంపించారు. ఈ పరిణామాలతో బీఆర్ఎస్‌లో తీవ్ర అలజడి నెలకొంది. నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు త్వరలో బీజేపీలో చేరనున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇప్పటికే ఆయన

మిగతా 2లో..

భారత్, పాక్ సంబంధాలు మెరుగుపడేవరకు

## కాశ్మీర్‌లో మిలిటెన్సీ అంతం కాదు

ఫరూక్ అబ్దుల్లా కీలక వ్యాఖ్యలు

2లో



## చలో ఢిల్లీకి కదిలిన రైలు

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం దేశ రాజధానికి తరలిన కాంగ్రెస్ నేతలు

ప్రత్యేక రైలులో బయలుదేరిన ఏఐసీసీ తెలంగాణ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం, వాకిటి శ్రీహరి తదితరులు

చర్లపల్లి(జనంసాక్షి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం కాంగ్రెస్ పార్టీ 'చలో దిల్లీ' కార్యక్రమం చేపట్టింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నేతలు చర్లపల్లి నుంచి ప్రత్యేక రైలులో దిల్లీ బయలుదేరారు. చర్లపల్లి రైల్వేస్టేషన్‌లో ఏఐసీసీ తెలంగాణ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి జెండా ఊపి రైలును ప్రారంభించారు. వీరితో పాటు కాంగ్రెస్ శ్రేణులంతా దిల్లీకి బయల్దేరి వెళ్లారు. బీసీ రిజర్వేషన్ల బిల్లును రాష్ట్రపతి ఆమోదించాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. బిల్లు ఆమోదించాలనే డిమాండ్‌తో ఈనెల 6న దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేపట్టనున్నారు. ప్రతి జిల్లా నుంచి 25 మంది చొప్పున రైలులో వెళ్లారు. మరోవైపు బీసీ రిజర్వేషన్ పెంపుపై చర్చ కోరుతూ మంగళవారం పార్లమెంటులో కాంగ్రెస్ ఎంపీలు వాయిదా తీర్మానం ఇవ్వనున్నారు. ఈ నెల 7న ఆ పార్టీ నేతలు రాష్ట్రపతిని కలిసి వినతి పత్రం ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించినా కేంద్రం మోకాలడ్డుతోందని విమర్శించారు.

## కవిత భూక్ హడ్తాల్..

బీసీలకు 42 % రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా ఇందిరాపార్క్ వద్ద ఎమ్మెల్సీ దీక్ష

కోర్టు అనుమతి నిరాకరణతో విరమణ



హైదరాబాద్,ఆగస్ట్4(జనంసాక్షి): ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా చేపట్టిన 72 గంటల నిరాహార దీక్షను విరమిస్తున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సోమవారం హైదరాబాద్‌లో ప్రకటించారు. ఈ నిరాహార దీక్షకు కోర్టు అనుమతి నిరాకరించిందని చెప్పారు. దీంతో తాను చేపట్టిన ఈ దీక్షను విరమిస్తున్నట్లు– తెలిపారు. కోర్టులను ధిక్కరించే పరిస్థితి లేదని పేర్కొన్నారు. కోర్టుల పట్ల తనకు గౌరవం ఉందన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తప్పులు ఎత్తి చూపుతూ.. బీసీల తరఫున పోరాటం చేస్తున్నామని చెప్పారు. మేము ఒక్క అడుగు వెనక్కి వేస్తే.. 10 అడుగులు ముందుకు వేస్తామని కవిత చెప్పారు. కోర్టు తీర్పును గౌరవించి ఈ దీక్షను ఇంతటితో ముగిస్తున్నామన్నారు. ఈ పోరాటం ఆగదని.. అనేక రూపాల్లో చేస్తామని ఈ సందర్భంగా ఆమె ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ ధర్నాలతో సాధించేది ఏం లేదన్నారు. మీరు రాష్ట్రపతి వద్దకు వెళ్లండంటూ తెలంగాణ ప్రభుత్వంలోని పెద్దలకు ఆమె

మిగతా 2లో..

## కవితది నాటకమే

తప్పుపట్టిన భాజపా..

2లో..

కవిత బీసీ రిజర్వేషన్ల ధర్నా

## ఓ జోక్

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వ్యాఖ్య



## వామ్మో.. నగరంలో వాన..

హైదరాబాద్‌లో దంచికొట్టిన వాన

నాలాలు పొంగి పొర్లడంతో భారీగా ట్రాఫిక్ జామ్

అవసరమైతే తప్ప బయటకు రావద్దని అధికారుల హెచ్చరిక

హైదరాబాద్ ,ఆగస్ట్4(జనంసాక్షి):కొన్నిరోజులుగా వర్షాలు లేక పంటలు ఎండుతున్న రైతులకు వాతావరణం చల్లటి జల్లులకబురు చెప్పింది. సోమవారం తెలంగాణ వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. హైదరాబాద్‌లో కుండపోత వాన కురవటంతో రాష్ట్రం అంతటా విస్తరించే అవకాశం ఉందని ముందుగా వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. అనుకున్నట్లుగానే వర్షాలు రాష్ట్రం అంతటా విస్తరించాయి. పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురుస్తుంటే.. మరికొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తుండటం రైతులకు కాస్త ఊరటనిచ్చు అశమని చెప్పవచ్చు. రంగారెడ్డి, వికారదాబాద్, నల్గొండ జిల్లాల్లో కొన్ని ఏరియాల్లో వరాషాలు కురుస్తున్నాయి. ఆదిలాబాద్, జగిత్యాల, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, కామారెడ్డి, కరీంనగర్, మహబూబ్ నగర్, మంచిర్యాలు, మెదక్, నాగర్ కర్నూల్, నల్గొండ, నారాయణపేట, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, వనపర్తి, జిల్లాలలో

మిగతా 2లో..



## భారత్‌పై మరిన్ని సుంకాలు విధిస్తాం

మళ్లీ ఆక్రోశం వెల్లగక్కిన ట్రంప్

రష్యా నుంచి చమురు కొనుగోలు చేసి మళ్లీ బహిరంగ మార్కెట్‌లో విక్రయించి సొమ్ముచేసుకుంటోందని ఆరోపణ

వాషింగ్టన్(జనంసాక్షి):అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై మరోసారి తన ఆక్రోశాన్ని వెల్లగక్కారు. ఇటీవల భారత్‌పై 25 శాతం ప్రతీకార సుంకం విధిస్తున్నట్లు ప్రకటించిన ట్రంప్.. తాజాగా మరిన్ని సుంకాలు విధిస్తానని హెచ్చరించారు. రష్యా నుంచి భారత్ భారీగా చమురు కొనుగోలు చేస్తోందని, ఆ చమురును మళ్లీ విక్రయిస్తోందన్నారు. బహిరంగ మార్కెట్‌లో చమురు విక్రయించి భారత్ లాభం గడిస్తోందంటూ ఆక్షేపించారు. భారత్ పెద్ద మొత్తంలో చమురు కొనుగోలు చేయడం వల్ల రష్యాకు భారీగా ఆర్థిక వనరులు చేకూరుతున్నాయని, అందుకే ఉక్రెయిన్‌తో యుద్ధం

మిగతా 3లో..

## గాజా ప్రజల ఆకలి తీరుస్తాం

అది కేవలం అమెరికాతోనే సాధ్యం: ట్రంప్

వాషింగ్టన్(జనంసాక్షి):గాజాలో పరిస్థితులు రోజు రోజు కూ దుర్భరంగా మారుతున్నాయి. ఆహారం దొరక్క అకలి కేకలు వినిపిస్తున్నాయి. అక్కడి చిన్నారుల్లో పౌష్టికాహార లోపం స్పష్టంగా కనిపిస్తోంది. మరోవైపు హమాస్ చెరలో ఉన్న ఇజ్రాయెల్ పౌరుల పరిస్థితీ అంతే. ఇటీవల అక్కడి బందీలకు సంబంధించిన పలు దృశ్యాలు, వీడియోలు బ యటకు వచ్చాయి.

మిగతా 3లో..



## 68 యెమెన్ తీరంలో.. మంది జలసమాధి

74 మంది గల్లంతు..

ఆఫ్రికన్ వలసదారులతో వెళుతున్న పడవ బోల్తా

సనా(జనంసాక్షి):దక్షిణ యెమెన్ తీరంలో ఘోర దుర్ఘటన చోటు చేసుకుంది. పడవ బోల్తా పడి 68 మంది ఆఫ్రికన్ వలసదారులు మృతి చెందారు. 74 మంది గల్లంతయ్యారు. ఈ విషయాన్ని ఐక్యరాజ్యసమితి వలస ఏజెన్సీ మీడియాకు తెలిపింది. అబ్యాన్ ప్రావిన్స్ సమీపంలో 154 మంది ఆఫ్రికన్ వలసదారులతో వెళుతున్న పడవ బోల్తా పడింది. సమాచారం అందుకున్న వెంటనే సహాయక చర్యలు ప్రారంభమయ్యాయి. యెమెన్‌లోని ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్

మిగతా 2లో..


## చైనాకు ఎందుకు క్లీన్‌చిట్ ఇచ్చారు?



కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ విమర్శలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. జూన్ 15, 2020న గల్వాన్‌లో మన సైనికులు దేశం కోసం వీరోచితంగా పోరాడి ప్రాణాలను త్యాగం చేసిన తర్వాత మాట్లాడిన ప్రధా ని..మన భూభాగంలోకి ఎవరూ చొరబడలేదని చైనాకు ఎందుకు క్లీన్ చిట్ ఇచ్చా రని ఆయన ప్రశ్నించారు. మన సైనికులు అమరులైనప్పటి నుంచి.. దేశభక్తి కలిగిన ప్రతి భారతీయుడు అనేక ప్రశ్నలు లేవనెత్తినప్పటికీ.. సమాధానాలు ఇవ్వడానికి బదులుగా, మోదీ ప్రభుత్వం గత ఐదేళ్లుగా 'తిరస్కరించు, దృష్టి మరల్చు, అబద్ధం చెప్పు, సమర్థించు'అనే విధానాన్ని అనుసరిస్తూ వస్తోందంటూ ధ్వజమెత్తారు. జవాబుదారీతనం నుంచి తప్పించుకోవడానికి మోదీ ప్రభుత్వం ఎటు వంటి పరిస్థితులైనా సృష్టించగదని

మిగతా 2లో..



## చైనా మన భూభాగం ఆక్రమించిందని నిజమైన భారతీయుడు చెప్పడట!

సుప్రీం వ్యాఖ్యలకు విస్తుపోయిన రాహుల్



న్యూఢిల్లీ(జనంసాక్షి):రాహుల్ గాంధీపై సుప్రీంకోర్టు ఆగ్ర హం వ్యక్తంచేసింది. 2 వేల కిలోమీటర్ల మేర భారత భూభా గాన్ని చైనా ఆక్రమించుకుందని రాహుల్ చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టింది. చైనా

మిగతా 2లో..

## కవిత భూక్ హర్తాళ్..

సూచించారు. అంతకుముందు ఆమె ఇందిరాపార్క్ వద్ద దీక్షకు దిగారు. తెలంగాణ జాగృతి ఈరోజు చేసే పోరాటం చరిత్రలో నిలిచిపోతుందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన కోసం భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్సీ కవిత ధర్నాచౌక్ వద్ద 72 గంటల నిరాహార దీక్షను చేపట్టారు. బీఆర్ అంబేద్కర్, ఫులే, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలకు ఆమె నివాళి అర్పించారు. కార్యక్రమానికి పెద్దఎత్తున కార్యకర్తలు, తెలంగాణ జాగృతి శ్రేణులు తరలివచ్చి ఆమెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రతి ఒక్కరికీ రాజ్యాధికారంలో వాటా కావాలి, ఆర్థిక అవకాశాలు రావాలి. సమాజంలో సగ భాగం బీసీలు ఉన్నారు. వాళ్లకు రాజకీయంగా సమ ప్రాధాన్యం దక్కాలనే ఉక్కు సంకల్పంతో ఈ దీక్ష చేపట్టాం. కామారెడ్డి డిక్లరేషన్‌లో చెప్పినట్లు బీసీలకు న్యాయం చేయాలని గత కొన్ని నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం వెంట పడుతున్నాం. అందరి ఆకాంక్ష ఒకటే.. స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి. కానీ రాష్ట్ర ప్రభుత్వం భాజపా మీద నెపం పెట్టి తప్పించు కోవాలని చూస్తోంది. బీసీ బిల్లుపై భాజపా లేవనెత్తిన అనుమానాలను సీఎం నివృత్తి చేయాలి. ముస్లింలకు అదనంగా 10 శాతం రిజర్వేషన్లు ఇస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇవ్వాలి. ముస్లింలను మినహాయించి బీసీలకే 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని చెప్పాలి. అప్పుడు భాజపా ఎందుకు ఒప్పుకోదో మేమూ చూస్తాం. ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్‌కు ప్రత్యేకంగా పార్లమెంటులో బిల్లు పెట్టాలి. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఇందుకు కృషి చేయాలని కవిత అన్నారు.

## కవిత బీసీ రిజర్వేషన్ల ధర్నా ఓ జోక్

**నల్లగొండ,ఆగస్ట్4(జనంసాక్షి):**బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఎవరో తనకు తెలియదు అంటూ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కవిత బీసీ ధర్నా జోక్ అని ఎద్దేవా చేశారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల కోసం కేంద్రంతో కొట్లాడుతాం అని తెలిపారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ఎమ్మెల్సీ కవిత ధర్నాచౌక్ వద్ద 72 గంటల నిరాహార దీక్షను చేపట్టారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే వరకు పోరాటం చేస్తా అని కవిత తెలిపారు. ఈ నేపథ్యంలో మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.నల్లగొండ జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రారంభించారు. మినిస్టర్ క్యాంప్ ఆఫీస్‌కు ఇందిరా భవన్‌గా నామకరణం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడారు. 'క్యాంప్ ఆఫీస్‌కు ఇందిరా భవన్‌గా నామకరణం చేశాం. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభం కాకపోవడంతో మొదటి ఏడాది నేను బాధపడ్డాను. ఇప్పుడు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతుంటే ఆనందంగా ఉంది. కాంగ్రెస్ పార్టీలో అందరూ సమానమే. నల్లగొండ జిల్లాలోని అన్ని సాగునీటి ప్రాజెక్ట్ లను ఏడాదిలో పూర్తి చేస్తాం' అని మంత్రి చెప్పారు

## కవితది నాటకమే

**హైదరాబాద్,ఆగస్ట్4(జనంసాక్షి):**కేవలం బీసీలకే 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామంటే భాజపా పూర్తి మద్దతిస్తుందని తెలంగాణ బిజెపి అధ్యక్షుడు రామచందర్‌రావు తెలిపారు. ఇందులో ముస్లిం రిజర్వేషన్లను అంగీకరించబోమని అన్నారు. సోమవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. దిల్లీలో కాంగ్రెస్ ధర్నాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో చేసినట్లే దిల్లీకి వెళ్లి నాటకాలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వానికి బీసీ రిజర్వేషన్లు ఇవ్వడం ఇష్టం లేదు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు పెట్టినపుడు ముస్లింలకు 10శాతం ఇస్తామని చెప్పలేదు. బీసీలకే 42 శాతం అమలు చేస్తామంటే పూర్తి మద్దతిస్తాం. ముస్లింలకు 10 శాతం ఇస్తే.. 10 శాతం బీసీలకు అన్యాయం జరుగుతుంది. రిజర్వేషన్లను భాజపా అడ్డుకుంటోందని ప్రచారం చేస్తోన్న కాంగ్రెస్‌ను బీసీలు నమ్మరని అన్నారు. బిసిల పేరు చెప్పి ముస్లింలకు ఇచ్చే కుట్రలను అడ్డుకుంటామని అన్నారు. ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టే ఉద్దేశం లేదని రామచందర్‌రావు అన్నారు. ముస్లింలకు 10 శాతం ఇస్తే, పదిశాతం బిసిలకు అన్యాయం జరుగుతుందని ఆవేదనను వ్యక్తం చేశారు. స్థానిక ఎన్నికలు నిర్వహిస్తే పాత రిజర్వేషన్లే కొనసాగించాలనేది ఉద్దేశం అని రామచందర్ రావు పేర్కొన్నారు.

## కాళేశ్వరంపై వడ్డీ తగ్గింపుకు కృషి చేస్తాం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి చేస్తే అప్పులపై వడ్డీ తగ్గించే అంశాన్ని పరిశీలిస్తామని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. రుణాల చెల్లింపు, రీ షెడ్యూల్ మార్పు చేస్తే ఆర్బీఐ నిబంధనల మేరకు కాళేశ్వరం ప్రాజెక్టు ఖాతా స్టాండర్డ్ నుంచి సబ్ స్టాండర్డ్‌కు డౌన్ గ్రేడ్ అవుతుందని కేంద్ర ఆర్థికశాఖ పేర్కొంది. తెలంగాణకు చెందిన కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు లోక్‌సభలో కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు రుణాల పునర్ వ్యవస్థీకరణ చేయాలని తెలంగాణ ప్రభుత్వం నుంచి వినతులు వచ్చాయి. ప్రాజెక్టు స్పెషల్ పర్పస్ వెహికల్‌కు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ రుణాలు ఇచ్చాయి. పీఎఫ్‌సీ, ఆర్ఈసీ లాంటి నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ సంస్థలు.. వివిధ మార్గాల్లో నిధులను సేకరిస్తాయి. వాటికయ్యే ఖర్చుల ఆధారంగా వడ్డీ రేట్లను నిర్ణయిస్తారు. ప్రాజెక్టు పూర్తయ్యే సమయాన్ని ఇప్పటికే డిసెంబర్ 2024కు ఆర్ఈసీ పొడిగించింది. ప్రాజెక్టు పూర్తయిన తర్వాతే రుణాలపై వడ్డీ రేట్ల తగ్గింపును పరిశీలిస్తాం అని కేంద్ర ఆర్థికశాఖ పేర్కొంది.కాళేశ్వరం ప్రాజెక్టు రుణాల రిస్ట్రక్చర్‌కు తెలంగాణ ప్రభుత్వం నుంచి వినతులు వచ్చాయని కేంద్రమంత్రి పంకజ్ చౌదరి గుర్తుచేశారు.కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయ్యే సమయాన్ని ఇప్పటికే డిసెంబర్ 2024కు ఆర్ఈసీ పొడిగించిందని గుర్తుచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయిన తర్వాత రుణాలపై వడ్డీ రేట్ల తగ్గింపు పరిశీలిస్తామని చెప్పుకొచ్చారు.

## చైనాకు ఎందుకు క్లీన్‌చిట్ ఇచ్చారు?

జైరాం రమేశ్ ఎద్దేవా చేశారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో చైనా పాకిస్థాన్‌కు బహిరంగంగా మద్దతు ప్రకటించినప్పటికీ మోదీ నుంచి ఎటువంటి స్పందన లేదన్నారు. చైనా మన భూ భాగాన్ని ఆక్రమించిందని రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన కొన్ని గంటల తర్వాత జైరాం రమేశ్ ఈ వ్యాఖ్యలు చేశారు. 2 వేల కిలోమీటర్ల మేర భారత భూభాగాన్ని చైనా ఆక్రమించుకుందని రాహుల్ చేసిన వ్యాఖ్యలను సోమవారం సుప్రీం కోర్టు తప్పుబట్టింది. చైనా ఆక్రమించిందనే విషయం మీకెలా తెలుసని కాంగ్రెస్ నేతను ప్రశ్నించిన సర్వోన్నత న్యాయస్థానం.. నిజమైన భారతీయులెవరూ అలా మాట్లాడరంటూ వ్యాఖ్యానించింది.

## యమెన్ తీరంలో.. 68 మంది జలసమాధి

ఫర్ మైగ్రేషన్ (ఐఓఎం) తెలిపిన వివరాల ప్రకారం 54 మంది వలసదారుల మృతదేహాలు ఒడ్డుకు కొట్టుకువచ్చాయి. మరో పద్నాలుగు మంది మృతి చెందారు. ఈ మృతదేహాలను యెమెన్ దక్షిణ తీరంలోని అబ్యాన్ ప్రావిన్షియల్ రాజధాని జింజిబార్‌లోని ఆస్పత్రి శవాగారానికి తరలించారు. ఈ ఓడ ప్రమాదంలో 12 మంది వలసదారులు మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు. మిగిలిన ప్రయాణికులంతా గల్లంతయ్యారు. వీరంతా మృతిచెంది ఉంటారని అధికారులు భావిస్తున్నారు.పడవ ప్రమాదంలో అధిక సంఖ్యలో ప్రాణనష్టం సంభవించడంతో పెద్ద ఎత్తున సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్ కొనసాగిస్తున్నట్లు అబ్యాన్ భద్రతా డైరెక్టరేట్ ఒక ప్రకటనలో తెలిపింది. తీరప్రాంతంలో చెల్లాచెదురుగా పలు మృతదేహాలు పడివున్నాయని అధికారులు చెబుతున్నారు. కాగా పడవ ప్రమాదాల్లో వలసదారులు మృతిచెందుతున్న ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. గత మార్చిలో యెమెన్, జిబౌటి తీరాలలో వలసదారులను తీసుకెళ్తున్న నాలుగు పడవలు బోల్తా పడ్డాయి. ఈ దుర్ఘటనలో ఇద్దరు మృతిచెందగా, 186 మంది గల్లంతయ్యారు.

# కాళేశ్వరంపై అసెంబ్లీలో చర్చిస్తాం



తమ అభిప్రాయాలను చెప్పేందుకు అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్లు- తెలిపారు. అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నాక భవిష్యత్తు కార్యాచరణతో పాటు- కమిషన్ సూచనలను అమలు చేసేందుకు ముందు కెళ్తామని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. ఎవరిపైనా కక్ష సాధింపులు, వ్యక్తిగత ద్వేషం తమ ఉద్దేశం కాదనే అన్ని వివరాలనూ మీడియా ముందు ఉంచామని తెలిపారు. జలవనరుల కోసం కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో దాదాపు రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం మేడిగడ్డ కుంగిపోయే ప్రమాదంలో పడింది. అందుకే రాష్ట్ర ప్రభుత్వం ప్రజాధనం దుర్వినియోగాన్ని దృష్టిలో పెట్టు-కొని న్యాయ విచారణ కోసం జస్టిస్ పీసీ ఘోష్‌ను నియమించాం. ఘోష్ కమిషన్ అందరితో మాట్లాడి ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. ఇందులో రాజకీయ ఆరోపణలు లేవు. ఇది ప్రభుత్వం ఇచ్చిన రిపోర్టు కాదు.. స్వతంత్ర న్యాయ విచారణ కమిషన్ ఇచ్చిన రిపోర్టు. కాళేశ్వరం నిర్మాణం, నిర్వహణ అవకతవకలు అన్నింటికీ బాధ్యుడు, జవాబుదారీ అప్పటి సీఎం కేసీఆరే అని నివేదికలో పేర్కొన్నారు. నిపుణుల కమిటీ- సూచనలకు కాకుండా సొంత నిర్ణయంతోనే మేడిగడ్డ వద్ద బ్యారేజీని నిర్మించారు. రాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరించారు. అవినీతి, ఆశ్రిత పక్షపాతంతో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని ఆరోపించారు. కాళేశ్వరం అవకతవకలపై విచారణ చేయిస్తామని మేనిఫెస్టోలో చెప్పామని, కమిషన్ చైర్మన్‌గా వ్యవహరించిన పీసీ ఘోష్ నిబద్ధత ఉన్న వ్యక్తి అని రేవంత్ చెప్పారు. కేసీఆర్, హరీష్ రావు సహా అనేక మందిని ఘోష్ విచారించారని, 16 నెలల విచారణ తరువాత 665 పేజీల నివేదిక ఇచ్చారని సీఎం తెలిపారు. ఊరు, పేరు, అంచనాలు మార్చి అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని..అలా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ వారి హయాంలోనే కూలిపోయిందని సీఎం విమర్శించారు. వైఎస్ఆర్ సీఎంగా ఉన్నప్పుడు ప్రాణహిత చేవెళ్లను ప్రారంభించారని, రీడిజైనింగ్ పేరుతో కేసీఆర్ డిజైన్లను మార్చారని ఆరోపించారు. ప్రాజెక్ట్ నిర్మించిన మూడేళ్ల లోపే మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిందని సీఎం గుర్తు చేశారు. అన్నారం, సుందిళ్లలో కూడా లోపాలున్నాయని రిపోర్ట్ ఇచ్చిందని సీఎం రేవంత్ చెప్పారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపై అసెంబ్లీలో చర్చిస్తామని, త్వరలోనే అసెంబ్లీకి నివేదికను రిపోర్ట్ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అన్ని పార్టీల సూచనలు, అభిప్రాయాలు తీసుకుంటామని సీఎం తెలిపారు. అందరి ఆమోదం మేరకు ఏం చేయాలో నిర్ణయిస్తామని రేవంత్ చెప్పారు. ప్రజాప్రతినిధులకు కమిషన్ నివేదిక ఇస్తామని, అందరూ స్వేచ్ఛగా అభిప్రాయాలు చెప్పొచ్చని సీఎం రేవంత్ వెల్లడించారు. ఎవరి పైనా వ్యక్తిగత ద్వేషంతో నిర్ణయాలు తీసుకోవడం లేదని, కమిషన్ రిపోర్ట్‌పై ఎవరు ఏ రకంగా మాట్లాడతారనేది వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

## కాళేశ్వరం లోపాలకు కేసీఆర్‌దే బాధ్యత

మీడియాతో ఆయన మాట్లాడారు. రూ.38వేల కోట్లతో తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు చేపట్టాల్సి ఉండగా.. మేడిగడ్డకు మార్చారని చెప్పారు. భారీగా తెచ్చిన అప్పులతో చేపట్టిన కాళేశ్వరం.. భారత రాష్ట్ర సమితి హయాంలోనే కూలిపోయిందన్నారు. "మేడిగడ్డ బ్యారేజ్‌పై న్యాయ విచారణ చేయిస్తామని గతంలోనే హామీ ఇచ్చాం. అధికారంలోకి వచ్చాక జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో న్యాయ విచారణ చేపట్టాం. రాజకీయ అంశాలు జోడించకుండా విచారణ జరపాలని కోరాం. 660 పేజీలతో నివేదికను కమిషన్ నీటిపారుదల శాఖకు ఇచ్చింది. నివేదికను ముగ్గురు అధికారుల కమిటీ 25 పేజీలతో సంక్షిప్తం చేసింది. 2016లో మేడిగడ్డ ప్రాజెక్టు అగ్రిమెంట్ జరిగింది. 2019లో కాళేశ్వరం ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. 2023లో మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోయింది. బ్యారేజ్ కుంగుబాటుపై ఎన్‌డీఎస్ఏ (నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ) నివేదిక ఇచ్చింది. మేడిగడ్డ నిర్మాణంలో ప్లానింగ్, డిజైన్‌లో లోపాలున్నాయని తేలింది. మేడిగడ్డతోపాటు అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులోనూ ఇదే సమస్య ఉందని కమిటీ వెల్లడించింది. మూడు బ్యారేజీల్లో నీటి నిల్వకు అవకాశం లేదని తెలిపింది. తుమ్మిడిహట్టి వద్ద నీళ్లు లేవన్న కేసీఆర్ నిర్ణయం నిజాయతీతో కూడింది కాదని జస్టిస్ పీసీ ఘోష్ కమిటీ పేర్కొంది. అక్కడ తగినంత నీరు ఉందని అప్పటి కేంద్రమంత్రి ఉమాభారతి చెప్పారు. 70శాతం నికర నీటి లభ్యత ఆధారంగా హైడ్రాలజీ క్లియరెన్స్ ఇచ్చినట్లు కేంద్రం లేఖ రాసింది. కేంద్రం నిర్ణయాన్ని కాదని నీటి లభ్యత లేదని గత ప్రభుత్వం లేఖ రాసింది. ఆ లేఖ వెనుక దురుద్దేశాలు ఉన్నాయని అర్థం అవుతోంది. కేసీఆర్ వేసిన నిపుణుల కమిటీ మేడిగడ్డ వద్ద బ్యారేజ్ వద్దని చెప్పింది. ప్రాణహిత మీద బ్యారేజ్ కట్టొచ్చని సూచించింది. నిపుణుల కమిటీ నివేదికను పక్కనపెట్టి, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పణంగా పెట్టి మేడిగడ్డ వద్ద బ్యారేజ్ కట్టాలని నిర్ణయించారు. ప్రాజెక్టుపై అప్పటి క్యాబినెట్ భేటీలో చర్చించలేదు. సీఎం నోటిమాట మేరకు కాంట్రాక్టులు ఇచ్చారు. ప్రజాధనం కాంట్రాక్టర్లకు ఇచ్చేందుకు విలువలను రివైజ్ చేశారు. మేడిగడ్డ నిర్మాణంపై అప్పటి నీటిపారుదల మంత్రి నిర్ణయం చట్టబద్ధం కాదు. మేడిగడ్డ నిర్మాణానికి ఇచ్చిన జీవోను క్యాబినెట్ సమావేశంలో పెట్టలేదు. ఇంతపెద్ద ప్రాజెక్టుకు క్యాబినెట్ ఆమోదం అవసరం.. తప్పనిసరి కూడా. క్యాబినెట్ ఆమోదం లేకుండా ప్రాజెక్టు నిర్మాణం చేయకూడదు. మేడిగడ్డ నిర్మాణానికి ఇచ్చిన జీవోలు 230, 231, నిర్మాణ అనుమతులు చట్ట వ్యతిరేకం. కాళేశ్వరం రూపకల్పన, నిర్మాణం, నిర్వహణ అన్నింటికీ కేసీఆర్ వ్యక్తిగతంగా బాధ్యుడని కమిటీ పేర్కొంది"అని మంత్రి వివరించారు.

## కాళేశ్వరం నిర్మాణానికి పూర్తి బాధ్యత కేసీఆర్‌దే

### నివేదికపై అధికారుల కమిటీ వెల్లడి

**హైదరాబాద్(జనంసాక్షి):**

కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీలపై జస్టిస్ పీసీ ఘోష్ నివేదికను అధికారుల కమిటీ అధ్యయనం చేసింది. దీని సారాంశాన్ని సిద్ధం చేసింది. అందులోని వివరాల ప్రకారం.. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల నిర్మాణ నిర్ణయం అప్పటి సీఎం కేసీఆర్‌దేనని నిర్ధారించారు. నిపుణుల కమిటీ- నివేదికను అప్పటి సీఎం కేసీఆర్, నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు పక్కకు పెట్టారు. తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత లేదన్నది సహేతుక కారణం కాదు. బ్యారేజీల నిర్మాణానికి మంత్రివర్గ ఆమోదం జరగలేదు. వ్యాప్కోస్ నివేదిక, డీపీఆర్ కంటే ముందే బ్యారేజీలకు సిద్ధం అయ్యారు. టెండర్లు, ఓ అండ్ ఎం డిజైన్, నాణ్యతలో లోపాలున్నాయి. బ్యారేజీల నిర్మాణానికి పూర్తి బాధ్యత అప్పటి సీఎం కేసీఆర్‌దే. జవాబుదారీతనం, పాలనాపరమైన విధానాలు పాటించలేదు. పాలనా విధానాలు అనుసరించకుండా హరీశ్‌రావు ఆదేశాలు ఇచ్చారు. ఆర్థిక జవాబుదారీ తనాన్ని అప్పటి ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ పాటించలేదు. కాళేశ్వరం బోర్డులో అధికారులు ఉన్నా వారికి సంబంధం లేదని ఈటల చెప్పారు.

## కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్ ఊహించిందే..

అవసరం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం, సుందిళ్ల, మేడిగడ్డ బ్యారేజీలను నిర్మించారు. అయితే 2023 అక్టోబర్‌లో మేడిగడ్డ బ్యారేజీలోని పిల్లర్లు కుంగాయి. ఇంతలో అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. దీంతో రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం ఏర్పాటైంది. అనంతరం ఈ ప్రాజెక్ట్‌లో చోటు-చేసుకున్న అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది.దాదాపు 15 నెలలపాటు ఈ కమిషన్ విచారణ జరిపింది. చివరకు జులై 31వ తేదీన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్.. తన నివేదికను నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాకు అందజేసింది. ఆగస్టు 1వ తేదీన పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు ఈ నివేదికను సీఎం రేవంత్ రెడ్డికి అందజేశారు. ఈ నివేదికపై ముగ్గురు అధికారులతో ఒక కమిటీని ప్రభుత్వం ఏర్పాటు- చేసింది. ఈ కమిటీ- ఆదివారం సమావేశమై.. చర్చింది. ఈ కమిటీ- అందించిన నివేదికపై తెలంగాణ సచివాలయంలో సోమవారం జరిగిన కేబినెట్ భేటీ-లో ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. అదీకాక లక్షల కోట్ల రూపాయిలతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించారని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ స్పష్టం చేసింది. ఇంకా చెప్పాలంటే.. ఈ ప్రాజెక్ట్‌కు కర్మ, కర్త, క్రియ అంతా కేసీఆర్ అని చెప్పకనే చెప్పింది. ఇదిఆవుంటే కేసీఆర్ యాగం చేయనున్నారంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు.

## బీఆర్ఎస్ పార్టీకి భారీ షాక్

రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడితో సంప్రదింపులు జరిపినట్లు తెలుస్తోంది. ఈ నెల 9న ఆయన అధికారికంగా కమలం పార్టీలో చేరే అవకాశముంది. ఇటీవల ఓ పార్టీ కార్యకర్తతో గువ్వల బాలరాజు చేసిన ఫోన్ కాల్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఆ ఫోన్ సంభాషణలో, బీఆర్ఎస్ పార్టీ బీజేపీతో పొత్తు పెట్టుకుంటే తన అభ్యర్థిత్వం ప్రమాదంలో పడే అవకాశం ఉందని ఆయన అన్నారు. గతంలో తాను బీజేపీకి వ్యతిరేకంగా పోరాడినప్పటికీ, ఇప్పుడు తన భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కమలం పార్టీ వైపు అడుగులు వేయడం ఉత్తమమని అభిప్రాయపడ్డారు. తనను పక్కనపెట్టి నాగర్‌కర్నూల్ పార్లమెంట్ టికెట్‌ను ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్‌కు ఇవ్వడంపై కూడా ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే ఆయన బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెబుతూ బీజేపీలో చేరాలని నిర్ణయించినట్లు కనిపిస్తోంది. ఆలంపూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అబ్రహం కూడా రాజకీయంగా కీలక నిర్ణయం తీసుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన ఆయన, ఇప్పుడు కాంగ్రెస్‌కు కూడా రాజీనామా చేశారు. త్వరలో ఆయన బీజేపీలో చేరే అవకాశముందని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. నాగర్ కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్న విషయాన్ని వెల్లడించారు. ప్రస్తుతం ఏ పార్టీలో చేరతానన్న విషయంపై తాను త్వరలో క్లారిటీ ఇస్తానని చెప్పారు. అయితే, ఆయన కూడా బీజేపీలో చేరతారని ప్రచారం జరుగుతోంది.

## తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన ఉపాసన

**హైదరాబాద్(జనంసాక్షి):**

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి ఉపాసన కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ స్పోర్ట్స్ హబ్‌కు కో-చైర్మన్‌గా ఉపాసనను నియమించిన విషయం తెలిసిందే.తనకు ఈ బాధ్యతను అప్పగించినందుకు సీఎంకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.క్రీడా రంగంలోనూ తెలంగాణ అభివృద్ధి సాధించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం 'తెలంగాణ స్పోర్ట్స్ పాలసీ 2025'ను తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. 'స్పోర్ట్స్ హబ్ ఆఫ్ తెలంగాణ'ను రూపొందించింది. ఇక ఈ సంస్థకు చైర్మన్‌గా సంజీవ్ గోయెంకాను, కో-చైర్మన్‌గా ఉపాసన కామినేనిలను నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నియామకం తనకెంతో గౌరవాన్నిచ్చిందని ఉపాసన పేర్కొన్నారు. ఎక్స్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ పోస్ట్ పెట్టారు. సంజీవ్ గోయెంకాతో కలిసి పనిచేసే అవకాశం రావడం మరింత గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా తెలంగాణ ఒలింపిక్ సంఘం ఉపాధ్యక్షుడు వేణుగోపాలాచారి, క్రీడలు, యువజన సర్వీసుల ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

## భారత్‌పై మరిన్ని సుంకాలు విధిస్తాం

ఆపడం లేదని విమర్శించారు.ఈ మేరకు ఆయన సొంత సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. "రష్యాతో యుద్ధం వల్ల ఉక్రెయిన్‌లో ఎంత మంది ప్రాణాలు కోల్పోతున్నారో వాళ్లకు అవసరం లేదు. అందుకే భారత్‌పై సుంకాలను మరింత పెంచబోతున్నాం" అని ట్రంప్ పేర్కొన్నారు. భారత్‌పై విధించిన 25 శాతం ప్రతీకార సుంకాలు ఆగస్టు 1 నుంచి అమల్లోకి వచ్చిన సంగతి తెలిసిందే.

## వామ్మో.. నగరంలో వాన..

తదుపరి 2-3 గంటల్లో తేలికపాటి వర్షం కురిసే ఛాన్స్ ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. గాలి వేగం గరిష్టంగా గంటకు 40 కి.మీ కంటే తక్కువ (గాలులలో) ఉండగా.. తేలికపాటి ఉరుములతో కూడిన వర్షాలు వచ్చే అవకాశం వుందని తెలిపారు.

మరోవైపు హైదరాబాద్, కొమరం భీమ్ ఆసిఫాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, జిల్లాలలో తదుపరి 2-3 గంటల్లో మోస్తరు వర్షం వచ్చే అవకాశం వుంది.హైదరాబాద్ లో వాన బీభత్సం సృష్టించింది. సోమవారం మధ్యాహ్నం మొదలైన వాన నాన్ స్టాప్ గా కురుస్తూ నగరాన్ని ముంచేసింది. కుండపోత అనే పదం కూడా తక్కువే అన్నట్లుగా కురిసిన వానకు నగరంలో ఎక్కడ చూసినా నీళ్లతో వాగులు, చెరువులను తలపించాయి.

# 2047 నాటికి 3 ట్రిలియన్ల ఎకానమీగా తెలంగాణ




**హైదరాబాద్(జనంసాక్షి):**లైఫ్ సైన్సెస్ కేపిటల్‌గా హైదరాబాద్ కు గుర్తింపు లభించిందని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ లో ఫార్మా కంపెనీలకు జినోమ్ వ్యాలీ ప్రత్యేకమైనది అన్నారు. అమెరికాకు చెందిన ఫార్మా కంపెనీని, గచ్చిబౌలిలో ప్రముఖ లిల్లీ ఫార్మా కంపెనీని సిఎం ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా రేవంత్ మీడియాతో మాట్లాడుతూ. .2047 నాటికి 3 ట్రిలియన్ల ఎకానమిగా తెలంగాణ ఉంటుందని తెలియజేశారు. దేశ ఆర్థిక వ్యవస్థలో 10 శాతం తెలంగాణ నుంచే అందిస్తామని, హైదరాబాద్ నుంచే 40 శాతం ఫార్మా ఉత్పత్తులు, అత్యధిక వ్యాక్సిన్లు తయారవుతున్నాయని అన్నారు. పరిశ్రమలకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని, అభివృద్ధి, ఆవిష్కరణలకు అనువైన వాతావరణం కల్పిస్తామని చెప్పారు. హైదరాబాద్‌ను భవిష్యత్ గ్లోబల్ హెల్త్ కేర్ హబ్ గా మారుస్తామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ లైఫ్ సైన్సెస్ రంగంలో ఈరోజు చరిత్రక మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. 2000లకు పైగా లైఫ్ సెన్సెస్ కంపెనీలు హైదరాబాద్ లో ఉన్నాయని చెప్పారు. 200కి పైగా ప్రఖ్యాత అంతర్జాతీయ సంస్థలు హైదరాబాద్ నగరం నుంచి తమ కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయని తెలిపారు. హైదరాబాద్ లైఫ్ సైన్సెస్ ఆఫ్ ఇండియాగా మారుతోందన్నారు. 2047 నాటికి తెలంగాణను ట్రిలియన్ డాలర్ ఎకానమిగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ఎలీ లిల్లీ సంస్థ లీడర్ షిప్ ను, ఉద్యోగులను హైదరాబాద్ నగరానికి సాదరంగా ఆహ్వానం పలుకుతున్నాను. ఈ రోజు ప్రారంభమైన ఎలీ లిల్లీ నూతన కేంద్రం... ఆ సంస్థ గ్లోబల్ కార్యకలాపాలను మరింత వేగవంతం చేయడానికి ఉపయోగపడుతుంది. ఈ టెక్నాలజీ, ఇన్నొవేషన్ సెంటర్, ప్రపంచవ్యాప్తంగా రోగులకు పరిష్కారాల కోసం పరిశోధనలో కీలక పాత్ర పోషిస్తుంది. ఎలీ లిల్లీ సంస్థను హైదరాబాద్ నగరంలో ఏర్పాటు- చేయడమంటే ఈ నగరం ఘనతను మీరు ప్రపంచానికి చాటి చెప్పినట్లే. హైదరాబాద్ నగరంలో టాలెంట్ ఉంది, లీడర్‌షిప్ ఉంది, విజన్ ఉంది, మంచి పాలసీ ఉంది, మౌలిక సదుపాయాలు ఉన్నాయి. అందుకే ఎలీ లిల్లీ లాంటి గ్లోబల్ లీడర్‌కు ఇది అనుకూలమైన కేంద్రంగా మారింది. భారతదేశ లైఫ్ సైన్సెస్ రాజధానిగా హైదరాబాద్ ఇప్పటికే గుర్తింపు పొందిందని అన్నారు. భారత్‌లో ఫార్మాస్యూటికల్ ఉత్పత్తిలో సుమారు 40 శాతం తెలంగాణలోనే జరుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న ప్రతి 3 టీ-కాలలో ఒకటి హైదరాబాద్‌లో అభివృద్ధి చేయడం లేదా తయారవుతుండటం మాకు గర్వకారణం. హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీ, భారత దేశంలోని అతిపెద్ద లైఫ్ సైన్సెస్ పరిశోధన- అభివృద్ధి సముదాయంగా నిలిచింది. ప్రపంచంలోని అగ్రశ్రేణి ఫార్మాస్యూటికల్, బయో-టెక్నాలజీ సంస్థల కోసం హైదరాబాద్ అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రపంచ గమ్యస్థానంగా మారింది. ఈరోజు, ఎలీ లిల్లీ సంస్థ రాకతో, లైఫ్ సైన్సెస్ రంగంలో మేము మరో మెట్టు-కు చేరుకున్నాం. మధుమేహం, ఆంకాలజీ, ఇమ్యునాలజీ, న్యూరోసైన్స్ రంగాలలో ఎలీ లిల్లీ సంస్థ కృషి ఒక గేమ్‌ఛేంజర్ గా నిలిచిపోతుందని అన్నారు.

## శిబూసోరెన్ కన్నుమూత

విడిచివెళ్లిపోయారు. నాకు సర్వం కోల్పోయినట్టుగా ఉంది" అని ఉద్వేగపూరితంగా రాసుకొచ్చారు.ప్రస్తుతం బిహార్‌లో భాగమైన రామ్‌గఢ్ జిల్లాలో శిబూసోరెన్ జన్మించారు. ఆయన సతీమణి పేరు రూపీ సోరెన్. ఆయనకు నలుగురు సంతానం. ముగ్గురు కుమారులు హేమంత్, బసంత్, దుర్గా సోరెన్. కుమార్తె పేరు అంజలి. 2009లో దుర్గా సోరెన్ మృతి చెందారు. బసంత్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. సంతాల్ కమ్యూనిటీకి చెందిన శిబు సోరెన్... వామపక్ష నేత ఏకే రాయ్, కుర్మి మహతో బినోద్ బిహారీ మహతోతో కలిసి 1972లో ఝార?ండ్ ముక్తి మోర్చాను ఏర్పాటు చేశారు. తర్వాత ప్రత్యేక రాష్ట్రం కోసం చేసిన పోరాటంలో కీలక నేతగా ఎదిగారు. ఆ పోరాట ఫలితంగా 2000లో ఝారండ్ రాష్ట్రంగా ఏర్పడింది. 2005లో ఆయన తొలిసారి సీఎం అయ్యారు.ఆయన మూడు సార్లు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పటికీ.. ఒక్కసారి కూడా పూర్తికాలం పదవిని నిర్వహించలేకపోయారు. 2004లో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ క్యాబినెట్‌లో మంత్రిగా బాధ్యతలు స్వీకరించినా.. అక్కడా అదే పరిస్థితి. 1974 నాటి కేసు కారణంగా రాజీనామా చేయాల్సి వచ్చింది. తన మాజీ కార్యదర్శి హత్య కేసులో దోషిగా తేలడంతో మరోసారి కేంద్రమంత్రి పదవిని కోల్పోయారు. ఒక హత్యకేసులో కేంద్రమంత్రి దోషిగా తేలడం అదే తొలిసారి. అయితే దిల్లీ హైకోర్టు తర్వాత ఆయన్ను నిర్దోషిగా తేల్చింది. శిబూ సోరెన్‌కు నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఉంది. ఆయన ఎనిమిది సార్లు లోక్‌సభ, రెండు సార్లు రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించారు.ఆయన మృతిపట్ల రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం తెలియజేశారు. "శిబూసోరెన్‌జీ అట్టడుగు స్థాయి నుంచి ప్రజాజీవితంలో ఉన్నతస్థాయికి ఎదిగారు. ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేశారు. గిరిజనులు, పేదలు, అణగారిన వర్గాలకు సాధికారత కల్పించడం కోసం కృషి చేశారు. ఆయన మరణం బాధాకరం. ఇప్పుడు ఆయన కుటుంబం, అభిమానుల గురించే నా ఆలోచనంతా. ఇప్పటికే హేమంత్ సోరెన్‌జీతో మాట్లాడాను. ఓం శాంతి" అని మోదీ ఎక్స్

## భారత్, పాక్ సంబంధాలు మెరుగుపడేవరకు కాశ్మీర్‌లో మిలిటెన్సీ అంతం కాదు..

### ఫరూక్ అబ్దుల్లా కీలక వ్యాఖ్యలు



జనంసాక్షి:జమ్మూకశ్మీర్‌లో ఉగ్ర, వేర్పాటువాద కార్యకలాపాల విషయంలో నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్, పాకిస్థాన్‌ల మధ్య సంబంధాలు మెరుగుపడేవరకు జమ్మూకశ్మీ ర్‌లో ఈ సమస్య పరిష్కారం కాదని అభిప్రాయపడ్డారు. స్థానికంగా మిలిటెన్సీ అంతమైందనే వాదనలపై షోపియాన్ జిల్లాలో మీడియాతో ఆయన మాట్లాడారు. "జమ్మూకశ్మీర్‌లో మిలిటెన్సీ ఇంకా అంతం కాలేదు. కాబోదు కూడా. పొరుగుదేశంతో సంబంధాలు మెరుగుపడేవరకు దీనికి పరిష్కారం దొరకదు. స్థానికంగా ఉగ్రస్థావరాలను నిర్మూలించామని కేంద్రం గతంలో ప్రకటించింది. మరి అటువంటప్పుడు ప్రస్తుతం కుల్గాం ఎన్‌కౌంటర్ ఎందుకు జరుగుతోంది? ఇటువంటి పరిస్థితుల్లో ఈ సమస్య లేదని ఎలా చెప్పగలరు?" అని ఫరూక్ అబ్దుల్లా ప్రశ్నించారు. మిలిటెన్సీ ముగిసిందని తానెప్పుడూ చెప్పలేదన్నారు.జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దుకు మంగళవారంతో ఆరేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో.. రాష్ట్ర హోదా ఎప్పుడు పునరుద్ధరిస్తారంటూ కేంద్రాన్ని ఫరూక్ అబ్దుల్లా ప్రశ్నించారు. ఈ ఆరేళ్లలో ఈ ప్రాంత అభివృద్ధికి ఏం చేశారన్నారు.

## 'సృష్టి' కేసులో కీలక పరిణామం

### పోలీసులకు వరుస ఫిర్యాదులు .. మరో నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదు

**హైదరాబాద్(జనంసాక్షి):**సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ సంస్థ నిర్వాహకులు ఐవీఎఫ్ చికిత్సకు వచ్చిన వారిని సరోగసి పేరిట మోసం చేసి డబ్బులు తీసుకున్నారని ఫిర్యాదులు అందాయి. పలువురు ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో ఈ మేరకు గోపాలపురం పోలీసులు మరో 4 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. తమకు అందించిన మెడికల్ రిపోర్టులు తీసుకొచ్చి బాధితులు ఫిర్యాదు చేస్తున్నారు. నల్గొండకు చెందిన దంపతుల నుంచి ఫెర్టిలిటీ నిర్వాహకురాలు నమ్రత రూ.44 లక్షలు కాజేసింది. బాధితుల ఫిర్యాదు మేరకు నమ్రత, సదానందం, చెన్నారావు, అర్చన, సురేఖపై కేసు నమోదైంది. హైదరాబాద్‌కు చెందిన బాధితురాలి ఫిర్యాదు మేరకు మరో కేసు నమోదైంది. సరోగసి చేస్తామని బాధితురాలికి నమ్రత హార్మోన్ ఇంజక్షన్‌లు ఇచ్చింది. కొన్ని రోజుల తర్వాత కల్యాణి గ్యాంగ్ విశాఖకు పిలిచి స్పెర్మ్ తీసుకొని పంపింది. ఈ వ్యవహారంలో సరోగసి పేరుతో రూ.18 లక్షలు కాజేశారు. ఈ ఘటనకు సంబంధించి నమ్రత, డా.విద్యులత, కల్యాణి, శేషగిరి, శ్రీనివాసరెడ్డిపై కేసు నమోదైంది. ఎన్నారైలను కూడా నమ్రత గ్యాంగ్ మోసం చేసినట్లు-ఫిర్యాదు అందింది. బాధితుల నుంచి రూ.25 లక్షలు కాజేశారు. దీంతో నమ్రతపై పోలీసులు కేసు నమోదు చేశారు. హైదరాబాద్‌కు చెందిన బాధితుల నుంచి ఈ గ్యాంగ్ రూ.50 లక్షలు కాజేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు నమ్రత, చెన్నారావు, సురేఖపై కేసు నమోదు చేశారు.

# తెలంగాణకు ఐఐఎం ఏర్పాటు చేయాలి

### వనరులు ఉన్నా నిర్లక్ష్యం చేస్తోందన్న వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 4 (జనంసాక్షి) :** తెలంగాణలో భారతీయ నిర్వహణ సంస్థ (ఐఐఎం) ఏర్పాటు చేయాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో కేంద్రాన్ని డిమాండ్ చేశారు. దేశంలో ఇప్పటికే 21 ఐఐఎంలు ఉన్నా, తెలంగాణలో ఒక్కటి కూడా లేకపోవడం అన్యాయమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి డా. సుకాంత మజుందార్ బదులిచ్చారు. ప్రస్తుతానికి హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు చేయాలనే ఏ ప్రస్తావన తమ పరిధిలో లేదని స్పష్టం చేశారు. 2015–16లో స్థాపితమైన 7 కొత్తతరం ఐఐఎంలతో కలిపి దేశంలో 21 ఐఐఎంలు ఉన్నాయని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వానికి తగిన భూములు, మౌలిక సదుపాయాలు ఉన్నా కేంద్రం ఈ విషయంలో సరైన స్పందన ఇవ్వకపోవడం పట్ల డా. కావ్య ఆక్షేపణ వ్యక్తం చేశారు. దేశంలో ప్రముఖ విద్యాసంస్థలుగా పేరొందిన ఐఐటీ–హైదరాబాద్, ఐఎస్‌బీ వంటి సంస్థలకు కేంద్రంగా ఉన్న హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం చేయడం దురదృష్టకరమన్నారు. 'తెలంగాణ యువతకి ప్రఖ్యాత మేనేజ్‌మెంట్ విద్యాసంస్థల్లో చదివే అవకాశం కలగాలి. ఇది రాష్ట్రానికి న్యాయమైన హక్కు. కేంద్రం వెంటనే దృష్టి సారించి చర్యలు తీసుకోవాలి' అని ఆమె వ్యాఖ్యానించారు. కేంద్రం నుండి వచ్చిన ఈ సమాధానం రాష్ట్ర విద్యా వర్గాలలో నిరాశకు గురిచేయగా, తెలంగాణలో ఐఐఎం కోసం రాష్ట్ర స్థాయిలో పార్లమెంటరీ స్థాయిలో మరింత ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉందని భావిస్తున్నారు.

# జర్నలిజంలో నైపుణ్యాలకే ప్రాధాన్యం

### మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి



**హైదరాబాద్, ఆగస్ట్ 4 (జనంసాక్షి) :** నైపుణ్యంతో కూడిన జర్నలిజాన్ని సమాజానికి అందించాలని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం నాడు నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమీ భవనంలో గిరిజన జర్నలిస్టులకు రెండు రోజులపాటు శిక్షణ తరగతుల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జర్నలిస్టులు వృత్తితోపాటు తమని తాము తీర్చిదిద్దుకుంటూ జర్నలిజంపట్ల ఆసక్తి కనబరిచేలా వార్తలు రాయాలన్నారు. అందులోభాగంగానే గిరిజన జర్నలిస్టులకు రెండు రోజుల శిక్షణా తరగతులు ఏర్పాటు చేశామన్నారు. అదే విధంగా విడతల వారీగా ఈ జర్నలిస్టుల శిక్షణా తరగతులు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. సమాచార శాఖ అదనపు సంచాలకులు డి.ఎస్. జగన్ మాట్లాడుతూ, గిరిజన జర్నలిస్టులకు మీడియా అకాడమీ శిక్షణా తరగతులు నిర్వహించడం గర్వించదగ్గ విషయం అన్నారు. నేను కూడా గిరిజన బిడ్డనే కాబట్టి ఈ విధంగా మిమ్మలను కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. అదే విధంగా శిక్షణలో పాల్గొంటున్న గిరిజన విలేకరులు మన గిరిజన జాతి ఔన్నత్యాన్ని చాటేలా కృషి చేయాలని కోరారు. శిక్షణా తరగతులలో ప్రముఖ సంపాదకులు కే శ్రీనివాస్ మాట్లాడుతూ, తెలంగాణ జర్నలిజం గతం, వర్తమానం, భవిష్యత్తు – మీడియా ధోరణులు, ఆధునిక యుగంలో మీడియాలో వస్తున్న మార్పుల గురించి వివరించారు. సోషల్ మీడియా యూట్యూబ్ లో వస్తున్న వార్తల గురించి వివరించారు. దిశ ఎడిటర్ మార్కండేయ వార్తా కథనాలు – ప్రత్యేక కథనాలు ఎలా రాయాలో తెలియజేశారు. గిరిజన జర్నలిస్టులు అడవి బిడ్డలు కాబట్టి వారు ప్రత్యేక వ్యాసాలు రాయాలన్నారు. సీనియర్ జర్నలిస్ట్ గోవింద్ రెడ్డి నేర వార్తల సేకరణలో తీసుకోవలసిన జాగ్రత్తలు, చట్టాలపై అవగాహన ఉండాలని, వార్తలు సేకరించే ముందు నిజనిర్ధారణ చేసుకొని చేసుకుని వ్రాయాలని ఆయన సూచించారు, అలాగే నేర వార్తలు లలో చేయాల్సినవి చేయకూడనివి అంశాలపై క్లుప్తంగా వివరించారు. సీనియర్ జర్నలిస్ట్ దిలీప్ రెడ్డి సమాచార హక్కు చట్టం– 2005 గురించి సమగ్రంగా వివరించి జర్నలిస్టుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మీడియా అకాడమీ కార్యదర్శి ఎన్. వెంకటేశ్వర రావు, గిరిజన జర్నలిస్టులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రవెల్లిలో కేసీఆర్ చండీయాగం చేస్తున్నారని దుష్ప్రచారం

### ఖండించిన పీఆర్వో

**గజ్వేల్, (జనంసాక్షి) :** సిద్దిపేట జిల్లా ఎర్రవెల్లిలోని తన నివాసంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చండీయాగం నిర్వహిస్తున్నారని జరుగుతున్న దుష్ప్రచారాన్ని కేసీఆర్ పీఆర్వో రమేశ్ హజారి ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఈ చండీయాగం గురించి కేసీఆర్ కార్యాలయం నుంచి గానీ, బీఆర్ఎస్ కార్యాలయాల నుంచి ఎటువంటి అధికారిక ప్రకటన వెలువడలేదని తెలిపారు. అయినప్పటికీ కనీస సమాచారం తెలుసుకోకుండా తమకు ఇష్టం వచ్చినట్లు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

## పార్టీ మార్పు వార్తలను ఖండించిన బీరం హర్షవర్ధన్ రెడ్డి

**హైదరాబాద్ (జనంసాక్షి) :** పార్టీ మారుతున్నట్లు వస్తున్న వార్తలను కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. తనపై కొంతమంది పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. పార్టీ మారబోతున్నట్లు వార్తలు వస్తుండటంతో బీరం హర్షవర్ధన్ రెడ్డి ట్విట్టర్(ఎక్స్) వేదికగా స్పందించారు. బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆశీస్సులతో పార్టీ పటిష్టత కోసం పనిచేస్తానని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల కోసం, నియోజకవర్గ ప్రజల అభివృద్ధి కోసం బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని మనస్ఫూర్తిగా తెలియజేస్తున్నాని అన్నారు. అంతకుముందు నాగర్‌కర్నూలు మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి కూడా పార్టీ మారుతున్నట్లు వస్తున్న వార్తలను తీవ్రంగా ఖండించారు. తన చివరి శ్వాస వరకు కూడా.. కేసీఆర్, కేటీఆర్ ఆశీస్సులతో బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతానని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ పటిష్టత కోసం పనిచేస్తానని తెలిపారు. నా పార్టీ కార్యకర్తల కోసం, నా నియోజకవర్గ ప్రజల అభివృద్ధి కోసం బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతానని మనస్ఫూర్తిగా తెలియజేస్తున్నానని అన్నారు.

# గాజా ప్రజల ఆకలి తీరుస్తాం

### అది కేవలం అమెరికాతోనే సాధ్యం

కేటాయిస్తున్నాం. గాజాలోని సామాన్య ప్రజలకు ఇజ్రాయెల్ అధికారులే నేరుగా ఆహారం అందించాలని కోరుకుంటున్నాం. లేదంటే పరిస్థితులు మరింత విషమించే అవకాశం ఉంది. అప్పుడప్పుడూ కొన్ని దుర్ఘటనలు జరుగుతుంటాయి. అలాగని ఎవరూ ఆకలితో అలమటించడం మాకిష్టం లేదు" అని ట్రంప్ పేర్కొన్నారు. మరోవైపు గాజా మానవతా నిధి (జీహెచ్ఎఫ్) తీరును ఐక్యరాజ్యసమితి (ఐరాస) తప్పుబట్టింది. జీహెచ్ఎఫ్ చేపట్టిన సహాయక చర్యలు గాజా ప్రజలను ప్రమాదంలోకి నెట్టివేస్తున్నాయని మండిపడిరది. జీహెచ్ఎఫ్ ఆధ్వర్యంలోని ఆహార పంపిణీ కేంద్రాల వద్ద జరిగిన తొక్కిసలాటలు, అక్కడికి వచ్చిన వారిని లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయెల్ దళాలు జరిపిన కాల్పుల్లో మే నుంచి ఇప్పటి వరకు 1000 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ఐరాస పేర్కొంది.

### ఇజ్రాయెల్ బందీల దీనస్థితి.. మానవతా సాయంపై మెత్తబడిన హమాస్

ఇజ్రాయెల్ భీకర దాడులతో గాజాలో దుర్భర పరిస్థితులు తలెత్తాయి. అక్కడి ప్రజల పరిస్థితి అత్యంతదారుణంగా మారిపోయింది. మరోవైపు హమాస్ చెరలో ఉన్న ఇజ్రాయెల్ బందీలు ఆకలితో అలమటిస్తున్నారు. ఇటీవల అక్కడి బందీలకు సంబంధించిన పలు దృశ్యాలు, వీడియోలు బయటకు వచ్చాయి. వాటిలో ఇజ్రాయెలీలు ఎముకల గూళ్లుగా మారిన శరీరాలతో దారుణస్థితిలో కనిపించడంపై ఆ దేశ ప్రధాని నెతన్యాహు తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు. హమాస్ చెరలోని తమ బందీలకు మానవతా సాయం అందేలా చూడాలని రెడ్‌క్రాస్ సంస్థను కోరారు. ఇన్నాళ్లు ఇజ్రాయెల్ బందీల ను తీవ్ర హింసలకు గురిచేసిన హమాస్ సైతం ఈ విషయంలో కొంతమేరకు మనసు మార్చుకున్నట్లు తెలుస్తోంది. ఇజ్రాయెల్ తమ షరతులకు అనుగుణంగా వ్యవహరిస్తే.. తమ వద్ద ఉన్న ఇజ్రాయెల్ బందీలకు సాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటన విడుదల చేసింది. అయితే ఈ సహాయాన్ని అందించడానికి కేవలం అంతర్జాతీయ రెడ్‌క్రాస్ కమిటీని మాత్రమే అనుమతిస్తామని వెల్లడిరచింది. అయితే దీనిని కొనసాగించాలా, వద్దా అనే విషయం ఇజ్రాయెల్ మానవతా కారిడార్లను తెరవడం, గాజా ప్రజలకు మానవతా సాయం అందిస్తున్న సమయంలో వైమానిక దాడులను ఆపడం వంటి వాటిపై ఆధారపడు తుందని తెలిపింది. ఇజ్రాయెల్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రస్తుతం 50 మంది పౌరులు హమాస్ వద్ద బందీలుగా ఉన్నారు. వీరిలో 20 మంది మాత్రమే ప్రాణాలతో ఉన్నట్లు భావిస్తున్నారు. ఇజ్రాయెల్ పౌరులను బందీలుగా చేసుకున్న నాటి నుంచి నేటివరకు మానవతా సంస్థలు వారిని సంప్రదించకుండా హమాస్ నిషేధించింది. దీంతో వారి పరిస్థితి గురించి అధికారులకు గానీ, కుటుంబసభ్యులకు గానీ ఎటువంటి సమాచారం లేదు. ఈనేపథ్యంలో నిర్బంధంలో ఉన్న బందీల పరిస్థితిని వివరిస్తూ హమాస్ ఇటీవల కొన్ని వీడియోలు విడుదల చేసింది. ఓ భూగర్భ సొరంగంలో బందీగా ఉన్న యువకుడు ఎవ్యతార్ డేవిడ్ (24) బక్కచిక్కిన శరీరం, మాట్లాడేందుకు ఇబ్బందిపడుతున్నట్లు ఓ వీడియోలో కనిపించింది. తాను ఎదుర్కొంటున్న దీనస్థితిని వివరిస్తూ.. "రోజురోజుకు నా శరీరం క్షీణిస్తోంది. కుటుంబంతో గడిపే పరిస్థితి కనిపించడం లేదు. విడుదలకు సమయం మించిపోతోంది. నా సమాధిని నేనే తవ్వుకుంటున్నా" అని పేర్కొన్నాడు. ఈ వీడియోపై ఫ్రాన్స్, జర్మనీ, యూకే, అమెరికా వంటి దేశాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశాయి. గాజాలో బందీల పరిస్థితిపై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి మంగళవారం ఉదయం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనుందని ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రకటించింది.

# అమెరికా మధ్యవర్తిత్వంలోనే సుదీర్ఘ చర్చల తరువాత కాల్పుల విరమణకు అంగీకరించాయి

### పాడిన పాటే పాడుతున్న ట్రంప్

న్యూయార్క్/వాషింగ్టన్(జనంసాక్షి): భారత్–పాక్‌ల మధ్య యుద్ధ విరమణకు సయోధ్య కుదిర్చారని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోమారు పాడినపాటే పాడారు. భారత్–పాకిస్తాన్‌లతో పాటు ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల మధ్య తలెత్తిన ఘర్షణలను ఆపానని ట్రంప్ మళ్లీ ప్రస్తావించారు. మే 10న వాషింగ్టన్ మధ్యవర్తిత్వంలో జరిగిన సుదీర్ఘ చర్చల తర్వాత భారత్–పాక్‌లు సంపూర్ణ, తక్షణ కాల్పుల విరమణకు అంగీకరించాయని ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫారం ట్రూత్‌లో ప్రకటించారు. ఆ తరువాత కూడా ట్రంప్ పలు సందర్భాల్లో తన వాదనను పునరావృతం చేస్తూ వస్తున్నారు. భారతదేశం– పాకిస్తాన్ మధ్య జరిగిన ఘర్షణతో సహా ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల మధ్య వివాదాలను ముగించినందుకు ట్రంప్‌కు నోబెల్ శాంతి బహుమతిని ఇవ్వాలని వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ ?కోరిన దరిమిలా ట్రంప్ మళ్లీ ఇదే వాదన చేశారు. తాజాగా ట్రంప్ తన ట్రూత్ సోషల్‌లో ఒక పోస్ట్‌లో భారత్–పాకిస్తాన్ మధ్య యుద్ధాన్ని ముగింపజేయడం, ఇరాన్ అణు సామర్థ్యాలను తుడిచిపెట్టడం, గొప్ప ఆర్థిక వ్యవస్థను సృష్టించడం లాంటి ఘనమైన పనులను చేశానని పేర్కొన్నారు. న్యూస్‌మాక్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ తాను చాలా యుద్ధాలను పరిష్కరించానని అన్నారు. వాటిలో భారత్–పాక్ మధ్య జరగబోయే అణు యుద్ధం ఒకటని పేర్కొన్నారు. థాయిలాండ్– కంబోడియా, కాంగో –రువాండా మధ్య నెలకొన్న వివాదాలను కూడా తానే పరిష్కరించానని చెప్పుకొచ్చారు. ఈ యుద్ధాలను వాణిజ్యంతో పరిష్కరించానని, నెలకు సగటున ఒక యుద్ధాన్ని ఆపానని ట్రంప్ పేర్కొన్నారు. యుద్ధాలను ముగింపజేస్తూ, లక్షలాది మంది ప్రాణాలను కాపాడుతున్నానన్నారు. కాగా ఆగస్టు ఒకటి నుండి భారతదేశం నుండి వచ్చే అన్ని వస్తువులపై 25 శాతం సుంకం విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. అలాగే రష్యన్ ముడి చమురు, సైనిక పరికరాలను భారత్ కొనుగోలు చేసినందుకు వెల్లడిరచని జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో 26 మందిని బలిగొన్న ఉగ్ర దాడి తర్వాత అందుకు ప్రతీకారంగా భారతదేశం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను నిలిపివేయాలని ఏ దేశ నాయకుడూ భారతదేశాన్ని కోరలేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవల పార్లమెంట్‌లో స్పష్టం చేశారు. అలాగే రాజ్యసభలో ఆపరేషన్ సిందూర్‌పై జరిగిన ప్రత్యేక చర్చలో జోక్యం చేసుకున్న విదేశాంగ మంత్రి జైశంకర్.. ఉగ్రదాడి జరిగిన ఏప్రిల్ 22 మొదలు జూన్ 16 మధ్యకాలంలో ప్రధాని మోదీ, అధ్యక్షుడు ట్రంప్ మధ్య ఎలాంటి ఫోన్ సంభాషణలు జరగలేదని పేర్కొన్నారు.

# మహిళా వ్యాపారవృద్ధికి వీ హబ్ దోహదం

### మంత్రి కొండా సురేఖ



**హైదరాబాద్ (జనంసాక్షి) :** మహిళా వ్యాపారవృద్ధికి వీ–హబ్ దోహదపడుతుందని తెలంగాణ అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వెల్లడించారు. మంత్రి కొండా సురేఖతో సోమవారం తెలంగాణ సెక్రటేరియట్‌లో వీ–హబ్ సీఈఓ సీత పల్లచొల్ల భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వరంగల్ తూర్పు నియోజకవర్గంలో స్వయం సహాయ సంఘాల మహిళలకు శిక్షణ, మార్కెట్ సాయం, జీవనోపాధి అవకాశాలు, సహకార కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ.. స్వయం సహాయ సంఘాల మహిళల సాధికారత అనేది కేవలం ఉపాధి విషయంలోనే కాకుండా నాయకత్వం, సృజనాత్మకత, సమగ్ర అభివృద్ధికి మార్గం అని తెలిపారు. అందుకోసం ప్రభుత్వంలోని వివిధ శాఖల సమన్వయం కూడా అవసరమని చెప్పారు. మహిళా వ్యాపారవృద్ధికి వీ–హబ్ దోహదపడుతుందని చెప్పుకొచ్చారు. ఈ భాగస్వామ్యం వలన కొత్త ఉపాధి అవకాశాలు, మార్కెట్ పోటీ సామర్థ్యం, వరంగల్ తూర్పు అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. రాబోయే మౌలిక సదుపాయాల పనులకూ మానవ వనరుల ప్రణాళికలో మెరుగుదల రావచ్చని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమాల ద్వారా గ్రామీణ మహిళలు ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వీ–హబ్ కృషి చేస్తోందని మంత్రి ప్రశంసించారు. అలాగే వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని ఐదు ఎస్‌హెచ్‌జీల కోసం వీహబ్ సహకారం అందించాలని మంత్రి సురేఖ సూచించారు. ప్రధానంగా నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమలకు అనుగుణమైన శిక్షణ, ఉత్పత్తుల నాణ్యత మెరుగుదల, మార్కెటింగ్, బ్రాండ్ ప్రమోషన్, డిజిటల్, ఆర్థిక విజ్ఞానం, వరంగల్ విమానాశ్రయానికి అవసరమైన సిబ్బందికి శిక్షణ వంటి కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని మంత్రి సురేఖ చెప్పారు. ఈ సమావేశంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గుండు సుధారాణి, మంత్రి ఓఎస్డీ సుమంత్, పి.ఎస్ సోమరాజు, ప్రత్యేక అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# వీఎస్ అచ్యుతానందన్ అసాధారణ కమ్యూనిస్టు

### సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు




**హైదరాబాద్ (జనంసాక్షి) :** సీపీఐ(ఎం) మాజీ పొలిట్ బ్యూరో సభ్యులు, కేరళ మాజీ ముఖ్యమంత్రి విఎస్ అచ్యుతానందన్ అసాధారణ కమ్యూనిస్టు అని పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు చెప్పారు. ఆయన ఎనిమిదో తరగతి వరకే చదివినా పార్టీ పొలిట్ బ్యూరో స్థాయికి ఎదిగారనీ, ముఖ్యమంత్రి పదవిని చేపట్టారని అన్నారు. ప్రజలను చదవడంలో, వారి సమస్యను అర్థం చేసుకోవడంలో, పోరాటాలను నిర్మించడంలో కీలక భూమిక పోషించారని వివరించారు. ఆయన నిరాడంబర జీవితం అందరికీ ఆదర్శమని చెప్పారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో విఎస్ అచ్యుతానందన్ సంస్మరణ సభ సోమవారం హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి రాఘవులు, సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు టి జ్యోతి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బండారు రవికుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ ప్రజల పట్ల, ఉద్యమం పట్ల అకుంఠిత దీక్షతో పనిచేశారని చెప్పారు. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీని విభేదించి 32 బయటకు వచ్చారని గుర్తు చేశారు. వారిలో చివరి వ్యక్తి అచ్యుతానందన్ కూడా మరణించారని వివరించారు. 17 ఏండ్ల వయస్సులోనే కమ్యూనిస్టు పార్టీలో చేరారని అన్నారు. కమ్యూనిస్టు ఉద్యమంలో ఎక్కువ కాలం పనిచేసిన వారిలో ఆయనొకరని చెప్పారు. సిద్ధాంతం, ఆశయం పట్ల జీవితాంతం నిరాశకు గురికాలేదన్నారు. పోరాటం ఆయన జీవితంలో అంతర్భాగంగా మారిందని అన్నారు. ప్రజల్లో మమేకమై పనిచేశారనీ, అందుకే ఆయన మరణించినపుడు అన్ని వర్గాల వారూ నివాళు లర్పించేందుకు వచ్చారని గుర్తు చేశారు. కుట్టనాడులో వ్యవసాయ కార్మికులను ఐక్యం చేయడంలో విశేష కృషి చేశారని చెప్పారు. ఆయన సీఎంగా ఉన్నపుడు అధికార వికేంద్రీకరణను ప్రణాళికాబద్ధంగా చేపట్టారని అన్నారు. గ్రామాలను స్వతంత్ర ప్రభుత్వాలుగా మార్చారని వివరించారు. ఇది దేశానికే ఆదర్శమని చెప్పారు. ఫ్రీసాఫ్ట్వేర్ను అన్ని పాఠశాలల్లో అమలు చేశారన్నారు. కంప్యూటర్ విజ్ఞానం ప్రజలంతా వినియోగించుకుంటున్నారని వివరించారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా పోరాటమే చేశారని అన్నారు. డ్రగ్స్ మాఫియా, అవినీతికి వ్యతిరేకంగా పోరాడారని గుర్తు చేశారు. ప్రజల కష్టాలను తొందరగా పసిగట్టి అక్కడికి వెళ్లేవారని చెప్పారు. ఏ నిర్ణయమైనా కష్టజీవులకు ఉపయోగమా?, దోపిడీదారులకు ఉపయోగమా? అనే కోణంలో ఆలోచించే వారని అన్నారు. మార్క్సిస్టు దృక్పథంతో ఆలోచించే వారనీ, సైద్ధాంతిక నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు అని వివరించారు. ఇప్పుడు కమ్యూనిస్టు ఉద్యమం సవాళ్లను ఎదుర్కొంటోందని చెప్పారు. దేశంలో హిందూత్వ రాజ్య స్థాపన కోసం బీజేపీ మత విద్వేషాలను రెచ్చగొడుతూ పాలన సాగిస్తున్నదని విమర్శించారు. ప్రతికూల పరిస్థితులున్నా నిరుత్సాహపడొద్దని కోరారు. అమెరికా అల్లకల్లోలం అవుతుందనే ట్రంప్ బాధపడుతున్నారనీ, అందుకే వివిధ దేశాలపై సుంకాలు విధిస్తున్నారని విమర్శించారు. నిరాశ వాతావరణాన్ని అధిగమించాలనీ, అచ్యుతానందన్ స్ఫూర్తితో పోరాడాలని కోరారు. సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు టి జ్యోతి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బండారు రవికుమార్ పాల్గొన్నారు.

# కొండబాలది దశాబ్దాల ప్రజా జీవితం

### ప్రజల అవసరాలు తీర్చేందుకు చేయి చేయి కలిపి పని చేద్దాం

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్ (జనంసాక్షి) :** మాజీ ఎమ్మెల్యేగా, టిడిపి జిల్లా అధ్యక్షునిగా సర్పంచి స్థాయి నుంచి మొదలుకొని ఎమ్మెల్యేగా దశాబ్దాల కాలాలపాటు రాజకీయ అనుభవం కలిగిన కొండబాల కోటేశ్వరరావు కాంగ్రెస్ పార్టీలో చేరాలని నిర్ణయించుకోవడాన్ని హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నానని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. స్థానిక సంస్థలు, సెంట్రల్ బ్యాంక్ చైర్మన్ గా, టిఆర్ఎస్ హయాంలో కార్పొరేషన్ చైర్మన్ గా ఆయనకు చట్టసభలపై చక్కని అవగాహన ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు. అందరం కలిసి సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆదేశాలను ప్రజా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను ప్రజల వద్దకు తీసుకువెళ్దామని అన్నారు. ప్రజల అవసరాలు తెలుసుకొని తీర్చేందుకు చేయి చేయి కలిపి పని చేద్దామని డిప్యూటీ సీఎం అన్నారు.

### సొంత ఇంటికి వచ్చిన కొండబాలకు స్వాగతం: పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

సొంత ఇంటికి తిరిగి వచ్చిన కొండబాల కోటేశ్వరరావుకు స్వాగతం తెలియజేస్తున్నానని, వారి చేరికతో ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మరింత పుంజుకుంటుందని డిప్యూటీ సీఎం తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కల ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్ కండువా కప్పుకుంటున్న వాటిలో చేర్చుకుంటున్నట్టు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు.

### దేశ, రాష్ట్ర రాజకీయ పరిస్థితులు దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్లో చేరుతున్నాను: మాజీ ఎమ్మెల్యే,కొండ బాల కోటేశ్వరావు

దేశ రాష్ట్ర రాజకీయ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ఆ పార్టీలో చేరుతున్నట్టు మాజీ ఎమ్మెల్యే కొండ బాల కోటేశ్వరావు ప్రకటించారు. సుదీర్ఘకాలంగా ఖమ్మం జిల్లాలో అనేక హోదాల్లో కాంగ్రెస్ పార్టీలో పనిచేసి జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులతో సంబంధాలు కలిగి ఉన్నానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో జిల్లా జనరల్ సెక్రెటరీ స్థాయి వరకు వెళ్లానని, కాంగ్రెస్ అభ్యర్థిగా సమితికి సైతం పోటీ చేశానని కొండబాల తెలిపారు. పేద వర్గాల సంక్షేమం కోసం పండిట్ జవహర్లాల్ నెహ్రూ గ్రామీణ వ్యవస్థను బలోపేతం చేసేందుకు అమెరికా ప్రభుత్వం లో పనిచేస్తున్న ఎస్కే డే ను భారతదేశానికి రప్పించి గ్రామీణ వ్యవస్థను బలోపేతం చేశారని కొండబాల గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారు, ఈ దేశాన్ని బలోపేతం చేసేందుకు ఈ కార్యక్రమాలు ఉపయోగపడతాయి ఈ నేపథ్యంలో తాను కూడా కాంగ్రెస్ పార్టీలో చేరి అభివృద్ధికి తన వంతు పాత్ర ఉండాలనే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్టు కొండబాల ప్రకటించారు. తనతో పాటు ప్రస్తుతం కొంతమంది వచ్చారని రాబోయే రోజుల్లో పెద్ద సంఖ్యలో ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీలో చేరుతారని కొండబాల తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
5 ఆగస్టు 2025

## విద్యాధికారుల నిర్లక్ష్యం
# అనుమతులేని పాఠశాలల జోరు



విద్యా వ్యవస్థలో నాణ్యత, నియమ నిబంధనల పటిష్ఠత కీలకం అయినప్పటికీ, విద్యాధికారుల నిర్లక్ష్యం కారణంగా దేశవ్యాప్తంగా, ముఖ్యంగా తెలంగాణలో అనుమతులేని పాఠశాలలు నడుస్తున్నాయి. ఈ పాఠశాలలు విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తూ, తల్లిదండ్రులను ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. తెలంగాణలో 2025లో 300కు పైగా అనధికారిక పాఠశాలలు గుర్తించబడ్డాయి, వీటిలో చాలా వరకు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ఉన్నాయి. నిబంధనలు ఉల్లంఘిస్తూ, సరైన సౌకర్యాలు, గుర్తింపు లేకుండా నడిచే ఈ సంస్థలు విద్యార్థుల భద్రత, విద్య నాణ్యతను దెబ్బతీస్తు న్నాయి. విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం ఈ సమస్యను మరింత తీవ్రతరం చేస్తోంది. కఠిన చర్యలు, సమర్థవంతమైన నియంత్రణ వ్యవస్థ లేకపోవడం వల్ల తల్లిదండ్రులు మోసపోతున్నారు. విద్యా వ్యవస్థలో సంస్కరణలు, బాధ్యతాయుత పర్యవేక్షణ అవసరం.

విద్య అనేది సమాజంలో పురోగతికి, భవిష్యత్తు తరాల శ్రేయస్సుకు పునాది. అయితే, విద్యాధికారుల నిర్లక్ష్యం కారణంగా అనుమతులేని పాఠశాలలు దేశవ్యాప్తంగా, ముఖ్యంగా తెలంగాణలో జోరుగా నడుస్తున్నాయి. ఈ పాఠశాలలు విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టడమే కాకుండా, తల్లిదండ్రులను ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. తెలంగాణలో 2025లో 300కు పైగా అనధికారిక పాఠశాలలు గుర్తించబడ్డాయి, వీటిలో హైదరాబాద్‌లో 120, రంగారెడ్డి జిల్లాలో 80 కేసులు నమోదయ్యాయి. ఈ సంస్థలు సరైన గుర్తింపు, మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయుల అర్హత లేకుండా నడుస్తున్నాయి. విద్యాశాఖ నిబంధనలను ఉల్లంఘిస్తూ, తల్లిదండ్రుల నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని ఈ పాఠశాలలు లాభాపేక్షతో నడుస్తున్నాయి.

అనుమతులేని పాఠశాలల సమస్య వెనుక విద్యాధికారుల నిర్లక్ష్యం ప్రధాన కారణం. విద్యా సంస్థల గుర్తింపు, పర్యవేక్షణ కోసం రూపొందించిన నిబంధనలు ఉన్నప్పటికీ, వాటి అమలులో తీవ్ర లోపాలు కనిపిస్తున్నాయి. ఉదాహరణకు, హైదరాబాద్‌లోని ఒక అనధికారిక పాఠశాల 2024లో గుర్తించబడినప్పటికీ, ఎటువంటి చర్యలు తీసుకోకుండా 2025లో కూడా నడుస్తూ ఉంది. ఈ పాఠశాలలో అర్హత లేని ఉపాధ్యాయులు, అసురక్షిత భవనాలు, పాఠ్యాంశాలలో నాణ్యత లేకపోవడం వంటి సమస్యలు ఉన్నాయి. రంగారెడ్డి జిల్లాలో ఒక పాఠశాలలో అగ్నిప్రమాద భద్రతా చర్యలు లేకపోవడంతో 2025 జనవరిలో ఒక చిన్న ప్రమాదం సంభవించింది, దీనివల్ల విద్యార్థుల భద్రతపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమయ్యాయి.

విద్యాశాఖ అధికారులు ఈ సమస్యను పరిష్కరించడంలో విఫలమవుతు న్నారు. పాఠశాలల గుర్తింపు ప్రక్రియలో పారదర్శకత లేకపోవడం, ఆకస్మిక తనిఖీలు లేకపోవడం, అధికారుల అవినీతి వంటివి ఈ సమస్యను మరింత తీవ్రతరం చేస్తున్నాయి. తెలంగాణలో 2024లో నమోదైన 150 అనధికారిక పాఠశాలలపై కేవలం 20% కేసుల్లోనే చర్యలు తీసుకోబడ్డాయి. దీనివల్ల తల్లిదండ్రులు అధిక ఫీజులు చెల్లించి, తమ పిల్లల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టివేస్తున్నారు. ఉదాహరణకు, వరంగల్‌లో ఒక తల్లిదండ్రుల జంట తమ పిల్లలను అనధికారిక పాఠశాలలో చేర్చి, రూ.2 లక్షల ఫీజు చెల్లించారు, కానీ ఆ పాఠశాలకు గుర్తింపు లేని విషయం తర్వాత తెలిసింది. ఈ అనుమతులేని పాఠశాలలు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో విఫలమవుతున్నాయి. అర్హత లేని ఉపాధ్యాయులు, పాఠ్యాంశాలలో లోపాలు, మౌలిక సదుపాయాల కొరత వంటివి విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయి. ఖమ్మంలో ఒక అనధికారిక పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు బోర్డు పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేకపోయారు, దీనివల్ల వారి విద్యా జీవితం ప్రశ్నార్థకంగా మారింది. అదే విధంగా, నిజామాబాద్‌లో ఒక పాఠశాలలో అసురక్షిత భవనంలో తరగతులు నిర్వహించడం వల్ల విద్యార్థుల భద్రతపై ఆందోళనలు వ్యక్తమయ్యాయి.

విద్యాధికారులు ఈ సమస్యను పరిష్కరించడానికి కఠిన చర్యలు తీసుకోవాలి. పాఠశాలల గుర్తింపు ప్రక్రియలో పారదర్శకత, ఆకస్మిక తనిఖీలు, అనధికారిక సంస్థలపై కఠిన శిక్షలు అవసరం. తెలంగాణ విద్యాశాఖ 2025లో అనధికారిక పాఠశాలలను గుర్తించడానికి ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినప్పటికీ, దాని పనితీరు సంతృప్తికరంగా లేదు. అధికారులు, స్థానిక పరిపాలన సంస్థలు సమన్వయంతో పనిచేసి, ఈ సమస్యను అరికట్టాలి. తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం, పాఠశాలల గుర్తింపు స్థితిని తనిఖీ చేసే విధానాలను సులభతరం చేయడం కూడా అవసరం.

విద్యా వ్యవస్థలో సమతుల్యత, నాణ్యత కాపాడాలంటే, అధికారుల బాధ్యతాయుత పర్యవేక్షణ, చట్టాల ఖచ్చితమైన అమలు అవసరం. అనుమతులేని పాఠశాలల సమస్యను పరిష్కరించడం ద్వారా విద్యార్థుల భవిష్యత్తును, తల్లిదండ్రుల నమ్మకాన్ని కాపాడవచ్చు. సమాజంలో విద్య ఒక హక్కుగా, నాణ్యమైన సేవగా అందుబాటులో ఉండాలంటే, విద్యాధికారులు తమ నిర్లక్ష్యాన్ని వీడి, బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. ఈ దిశగా చర్యలు తీసుకుంటేనే విద్యా వ్యవస్థలో సమానత్వం, నాణ్యత సాధ్యమవుతాయి.


**సంధ్యారాణి**
సీనియర్ జర్నలిస్ట్, ఖమ్మం

### రక్తచందనవాణి

కదిలింది కదిలింది
కష్టజీవుల దండు
కష్టానికి కాసులని
రెక్కల కష్టానికి రొక్కమని
ఉద్దర మాటలు కావని
నగదు మాటలని
చెప్పినారు కదిలినారు
నలుగురిని నడవమన్నారు...
కదులుతుంది కష్టజీవుల దండు
హక్కులకై దండు
నెత్తుటి లో తడిసి
ఎరుపు కాంతి పరిచి
అస్తిత్వక్రాంతి స్వరపరిచి
కదులు తుంది దండు...
స్వేదం చిందిన చోట
నెత్తురు పారిన చోట
కండలు కరిగిన చోట
ఫలితాల ఆనవాళ్లు...
పని లేదా ఫలితం లేదు
ఆకలి తీర్చే పని పాట
జీవికను నిల్పే పని బాట
పనిలో దైవత్వం
సోమరితనం లో దైత్యత్వం...
అందరు కోరుకునేది
అందరు నమ్మేది
సర్వసమానత్వం
ఆకలి చావులు లేని విశ్వానికై

**రేడియమ్**
9291527757

# వాళ్లు బలైతున్నారు..



ప్రేమ, పెళ్లి అనే పదాలు సమాజంలో అత్యంత పవిత్రమైన, భావోద్వేగ పూరితమైన భావనలుగా పరిగణించబడతాయి. ఈ రెండు భావనలు మానవ సంబంధాలను బలపరిచే శక్తిగా పనిచేస్తాయి. అయితే, ఈ రెండు సందర్భాల్లోనూ పురుషులు అనేక సవాళ్లను, ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నారు. సమాజం స్త్రీల రక్షణ, హక్కుల గురించి ఎక్కువగా చర్చించినప్పటికీ, పురుషులు ఎదుర్కొనే సమస్యలు, వారికి అవసరమైన రక్షణ గురించి తగినంత దృష్టి సారించడం లేదు. రోజురోజుకూ ప్రేమ, పెళ్లి పేరిట పురుషులపై అఘాయిత్యాలు పెరుగుతున్నాయి. ప్రేమ ముసుగులో ట్రాప్ చేసి, ఆన్‌లైన్ స్నేహాలు, పెళ్లి హామీల పేరుతో మోసం చేస్తున్న ఘటనలు దేశవ్యాప్తంగా, ముఖ్యంగా తెలంగాణలో అధికమవుతున్నాయి. గత రెండేళ్లతో (2023, 2024) పోలిస్తే, 2025లో ఈ సంఘటనలు గణనీయం గా పెరిగాయి. దేశవ్యాప్తంగా 2023లో ఆన్‌లైన్ మోసాలు 1,200 కేసులుగా నమోదు కాగా, 2025లో ఇవి 1,800కి పైగా నమోదయ్యాయి. తెలంగాణలో 2024లో హైదరాబాద్‌లో 150 మోసపూరిత ప్రేమ కేసులు నమోదు కాగా, 2025లో ఇవి 200కి పైగా నమోదయ్యాయి. ప్రతి రోజూ ఎక్కడో ఒకచోట పురుషులపై లైంగిక దాడులు, హత్యలు, స్నేహం లేదా ఆన్‌లైన్ ఫ్రెండ్‌షిప్ పేరుతో మోసాలు జరుగుతున్నాయి.

ప్రేమలో పురుషులు తరచూ భావోద్వేగ ఒత్తిడికి గురవుతారు. సమాజం పురుషులను బలమైన వ్యక్తులుగా, ఆధిపత్యం వహించే వ్యక్తులుగా చూస్తుం ది. ఈ అంచనాలు అనవసర ఒత్తిడిని తెస్తాయి. ప్రేమలో నిజాయితీగా ప్రవర్తించే పురుషులు మోసపోయే సందర్భాలు ఉన్నాయి. ఉదాహరణకు, 2025 జనవరిలో వరంగల్‌లో ఒక యువకుడు ఆన్‌లైన్ డేటింగ్ యాప్ ద్వారా తెలిసిన వ్యక్తి చేత మోసపోయాడు. పెళ్లి హామీ ఇచ్చి, ఆ యువకుడి నుంచి రూ.5 లక్షలు కాజేశారు. అలాగే, ఖమ్మంలో ఒక వ్యక్తి స్నేహం ముసుగులో తన సోదరి భర్త చేత ఆర్థికంగా వంచనకు గురయ్యాడు. భావోద్వేగ దుర్వినియోగం, మానసిక ఒత్తిడి వంటివి పురుషులు ఎదుర్కొనే సమస్యలలో కొన్ని. ఈ సమస్యలను బహిర్గతం చేయడానికి సరైన వేదిక లేకపోవడం వల్ల, పురుషులు నిశ్శబ్దంగా బాధపడుతున్నారు. సమాజంలో పురుషుల బలహీనతలను వ్యక్తపరచడం బలహీనతగా భావించే సంప్రదాయ ఆలోచనలు ఇంకా కొనసాగుతున్నాయి, ఇది వారిని ఒంటరితనంలోకి, మానసిక ఒత్తిడిలోకి నెట్టివేస్తోంది.

పెళ్లి సందర్భంలో పురుషులు అనేక సవాళ్లను ఎదుర్కొంటారు. సాంప్రదాయ విలువలు, సామాజిక ఒత్తిళ్లు, ఆర్థిక బాధ్యతలు భారంగా మారతాయి. భారతదేశంలో కట్నం డిమాండ్లు, వివాహ వ్యవస్థలో అసమానతలు, చట్టపరమైన దుర్వినియోగం పురుషులను ఆర్థికంగా, మానసికంగా దెబ్బతీస్తాయి. తెలంగాణలో 2025లో సెక్షన్ 498A కింద నమోదైన కేసుల్లో 12% అబద్ధపు ఫిర్యాదులుగా గుర్తించబడ్డాయి. హైదరాబాద్‌లో ఒక వ్యక్తి తన భార్య చేసిన అబద్ధపు కట్నం ఫిర్యాదు వల్ల కుటుంబంతో సహా జైలు శిక్ష అనుభవించాడు, తర్వాత అతను నిరపరాధిగా తేలినప్పటికీ సామాజిక ఒత్తిడిని ఎదుర్కొన్నాడు. అలాగే, రంగారెడ్డి జిల్లాలో ఒక వివాహితుడు భార్య అక్రమ సంబంధం కారణంగా హత్యకు గురయ్యాడు, ఈ ఘటనలో భార్య, ఆమె స్నేహితుడు కలిసి హత్యకు పాల్పడినట్టు పోలీసులు గుర్తించారు. విడాకుల సందర్భంలో భరణం చెల్లింపులు, పిల్లల సంరక్షణ బాధ్యతలు పురుషులపై ఆర్థిక భారాన్ని మోపుతాయి. నిజామాబాద్‌లో ఒక వ్యక్తి తన ఆదాయంలో 50% భరణంగా చెల్లించాలని కోర్టు ఆదేశించడంతో ఆర్థిక ఇబ్బందుల్లో పడ్డాడు. దేశవ్యాప్తంగా 2024లో విడాకుల కేసుల్లో 30% కేసులు పురుషులపై అధిక భరణం భారాన్ని విధించాయి.

పురుషులకు రక్షణ కేవలం చట్టపరమైన అంశంతో సీమితం కాదు. సమాజంలో మనస్తత్వం లో మార్పు అవసరం. పురుషులు కూడా భావో ద్వేగ బలహీనతలను కలిగి ఉంటారని, వారికి మానసిక మద్దతు అవసరమని సమాజం గుర్తించాలి. స్త్రీ–పురుష సమానత్వం నిజంగా అమలు కావాలంటే, ఈ సమా నత్వం పురుషులకు కూడా వర్తిం చాలి. కౌన్సెలింగ్ సేవలు, చట్టప రమైన సహాయం, సామాజిక అవగాహన కార్యక్రమాలు పురు షులకు రక్షణగా నిలవాలి. ఆన్ లైన్ మోసాలను అరికట్టడానికి సైబర్ సెక్యూరిటీ చర్యలు బలో పేతం కావాలి. ఉదాహరణకు, డేటింగ్ యాప్‌లలో గుర్తింపు ధృవీకరణ చర్యలు తీసుకుంటే మోసాలు తగ్గుతాయి. తెలంగాణ లో సైబర్ క్రైమ్ విభాగం 2025లో 300కి పైగా ఆన్‌లైన్ మోసం కేసులను ఛేదించింది, కానీ ఇంకా చాలా కేసులు నమోదు కాకుండా ఉంటున్నాయి.

సమాజంలో పురుషుల బాధలను అర్థం చేసుకునే సంస్కృతి అవసరం. పురుషులు మానసిక వేధింపులకు గురైనప్పుడు, వారి గొంతును వినిపించే వ్యవస్థ లేకపోవడం ఒక పెద్ద లోపం. స్త్రీల మాదిరిగానే పురుషులు కూడా గౌరవంగా, సమానంగా చూడబడాలి. ప్రేమ, పెళ్లి సందర్భాల్లో జరిగే దుర్వినియోగం, మోసం, ఒత్తిడి నుంచి పురుషులను రక్షించడానికి సమాజం ముందుకు రావాలి. చట్టపరమైన సంస్కరణలు, సామాజిక అవగాహన కార్యక్రమాలు, మానసిక ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండాలి. ప్రేమ, పెళ్లి ఇద్దరి మధ్య పరస్పర అవగాహన, గౌరవం, విశ్వాసం మీద ఆధారపడతాయి. ఈ సంబంధాలు ఆరోగ్యకరంగా ఉండాలంటే, స్త్రీలతో పాటు పురుషులకు కూడా రక్షణ, మద్దతు అవసరం. ఈ అంశంపై ఓపెన్ చర్చ జరిగితే, పురుషుల సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. చట్టపరమైన సంస్కరణలు, సామాజిక మార్పులు, మానసిక ఆరోగ్య సేవలు కలిసి పురుషులకు రక్షణగా నిలిస్తాయి. ప్రేమ, పెళ్లి పేరిట పురుషులకు రక్షణ కేవలం చట్టంతోనే కాదు, సామాజిక సమతుల్యతతో, అవగాహనతో, సమానత్వంతో సాధ్యమవుతుంది. ఈ దిశగా అడుగులు వేస్తే, సమాజంలో స్త్రీ–పురుష సమానత్వం నిజంగా సాకారమవుతుంది.

**రాములు,**
ఉపాధ్యాయుడు
కరీంనగర్

# కగార్ హత్యాకాండ కాదు కాల్పుల విరమణ జరగాలి



ప్రజాస్వామ్య రాజ్యాంగ విఫలత్వంలోంచే ప్రజా ఉద్యమాలు పుడతాయి. అవి ప్రజాస్వామికంగా కొనసాగినప్పటికి ప్రభుత్వాలు రాజ్యాంగబద్ధంగా పరిష్కరించలేక, వాటిని సాయుధంగా అప్రజాస్వామికంగా అణచివేయాలనే ప్రయత్నం చేసే క్రమంలోనే సాయుధ పోరాటాలు ఆవిర్భవించాయి. సాయుధ పోరాటమనేది ప్రజలకు ఇష్టమైన విధానం కాదు. వారికి తెలుసు అది ప్రాణ త్యాగంతో కూడిన ఆచరణ అని. అయినప్పటికి ఉద్యమకారులు ఐదు దశాబ్దాలుగా సాయుధ పోరాట పంథాలోనే ప్రజలకు స్వేచ్ఛా, సమానత్వం, దోపిడీ లేని సమాజాన్ని సాధించగలమనే విశ్వాసంతో ఇప్పటికే పది వేల ఎన్‌కౌంటర్ హత్యలతో తమ విలువైన ప్రాణాలను త్యాగం చేసిన చరిత్ర ఉంది. ఈ ఉద్యమాలు ఎక్కడైతే అణచివేత దోపిడి దౌర్జన్యాలున్నాయో అక్కడి నుంచే ఆరంభించబడింది. అందులో భాగంగానే నక్సల్బరీ శ్రీకాకుల ఉత్తర తెలంగాణ జగిత్యాల సిరిసిల్లా రైతాంగ పోరాటాల నుంచి సింగరేణి కార్మికోద్యమం పోరాటం కూడా మార్పు కోసం జరిగిన ఉద్యమంలో ప్రముఖ పాత్ర నిర్వహించారు. కానీ అన్ని కూడా అణచివేతనే సమాధానంగా నిర్బంధ చట్టాలు బూటకపు ఎన్‌కౌంటర్ హత్యలతో ఉద్యమాలను అణచివేసే ప్రక్రియలో ఏ ప్రభుత్వం కూడా వెనక్కి పోకుండా ఒకదానికి మించి మరొకటి ఎన్‌కౌంటర్ హత్యాకాండలను కొనసాగించారు. ఆ నేపథ్యం నుంచే 2004 చర్చలు, అవి విఫలమైన నేపథ్యం నుంచే ఆపరేషన్ గ్రీన్ హంట్ ఆపరేషన్ సమాధాన్ ఆపరేషన్ అనకొండ ఆపరేషన్ ప్రహార్ 2004 నుంచి ఆపరేషన్ కగార్ పేరుతో విప్లవోద్యమంపై హత్యాకాండ ఆదివాసీల హననం పోటీపడుతూ నడుస్తున్నాయి. ఏ ప్రభుత్వం కూడా ఉద్యమం మూలాల్లోకి ప్రజా సమస్యల అడుగుల్లోకి వెళ్ళకుండా నిర్బంధాలను అణచివేతలను నమ్ముకొని పాలన చేస్తున్నారు. రెండు దశాబ్దాల క్రితం జరిగిన చర్చలనైనా దృష్టిలో పెట్టుకోకుండా ఇప్పుడు అధికారంలో ఉన్న ప్రభుత్వాలు పూర్తి నియంతృత్వంగా అప్రజాస్వామికంగా వ్యవహరిస్తూ ఉద్యమించడమే నేరంగా భావిస్తూ ఉద్యమకారులను ఎన్‌కౌంటర్ పేరుతో హత్య గావిస్తున్నారు. బుద్ధిజీవులుగా ఉన్న మనం ఈ ఎన్‌కౌంటర్‌ను నిరోధించడంలో విఫలమవుతున్నాం. ఒక వైపు పౌరహక్కుల సంఘం న్యాయస్థానంలో పోరాటం చేసి బలమైన తీర్పును సాధించగలిగినప్పటికి చంద్రబాబు నేతృత్వంలో ఆ తీర్పును కాదని ఒక బలహీనమైన తీర్పును అమలులోకి తేవడంతో మళ్ళీ ఎన్‌కౌంటర్లు పుంజుకున్నాయి. అందులో భాగంగా మధ్యభారతం బస్తర్‌లో సాగుతున్నవే కగార్ ఎన్‌కౌంటర్ హత్యాకాండలు.

6 నెలల మంగ్లీ సోడితో మొదలైన కగార్ హత్యాకాండ మారెడుమిల్లి ఎన్‌కౌంటర్‌లో గాజర్ల రవి, అరుణ, అంజులను చంపే వరకు కొనసాగింది. చరిత్రలోకి వెళితే ఇప్పటికి 18 నెలలుగా 57 ఎన్‌కౌంటర్లు జరిగాయి. మారెడుమిల్లి ఎన్‌కౌంటర్ జరగడానికి ముందు వారం రోజులుగా వాళ్ళు ఉన్న స్థలాన్ని వాళ్ళని బంధీలుగా చేసుకొని ప్రభుత్వం సరెండర్ ప్రక్రియ కోసం తీవ్రమైన ప్రయత్నాలు చేసింది. వీళ్ళు ముగ్గురిని చంపక ముందే అరుణ, గాజర్ల రవి కుటుంబ సభ్యులను కలిసి మీ వాళ్ళు ఎక్కడ ఉన్నారో మాకు తెలుసు మిమ్మల్ని తీసుకెళ్తాం వాళ్లని సరెండర్ చేయించాలని ఒత్తిడి తీసుకువచ్చారు. కానీ ఏ కుటుంబమూ సహకరించని నేపథ్యంలో నిర్దాక్షిణ్యంగా చంపేసి ఎన్‌కౌంటర్‌గా ప్రకటించడం జరిగింది. కగార్ హత్యాకాండలన్ని బూటకం అని చెప్పడానికి ఇంత కన్నా సజీవ సాక్ష్యం మరొకటి అవసరం లేదు. ఇప్పుడు ఆదివాసీ చట్టాలు 1996 పేసా చట్టం 2006 అటవీ హక్కుల చట్టం అమలు కాని నేపథ్యంలో కొనసాగిన ఆదివాసీ ఉద్యమాలపై కొనసాగుతున్న నర్బింధమే రెండున్నర దశాబ్దాల తరువాత ఆపరేషన్ కగార్ రూపాన్ని తీసుకుంది. మధ్యభారతంలో ఆదివాసీలను అమానవీయంగా వేటాడుతూ హత్య చేస్తూ కార్పొరేట్ల అభివృద్ధినే దేశ అభివృద్ధిగా ప్రకటించే దీనస్థితికి భారత ప్రభుత్వం దిగజారిపోయింది. దీనికి వ్యతిరేకంగా ప్రజాసంఘాలు, ప్రజాస్వామిక వాదులు గొంతెత్తి ప్రభుత్వం నుండి చట్టబద్ధ పాలన కోసం బలమైన ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరం ఉంది. ఉద్యమాలు లేకపోతే చట్టబద్ధ పాలన పూర్తిగా కరువైపోయి పూర్తిగా నియంతృత్వంలోకి దేశ ప్రజాస్వామ్యం వెళ్ళిపోతుంది. దీన్ని నిలువరించడానికైనా ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా బలమైన ప్రజాస్వామిక ఉద్యమాన్ని నిర్మించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉన్నది.

నేడు రాష్ట్రంలో, దేశంలో, ప్రపంచంలో ఎక్కడైనా ఆదివాసులు జీవించే హక్కు పూర్తిగా ప్రమాదంలో పడింది. తరతరాలుగా దట్టమైన అడవులు, కొండలతో, జంతువులతో గడిపే ఆదివాసీల సాంస్కృతిక జీవన వ్యవస్థ వారసత్వం ధ్వంసం చేయబడుతున్నది. వారి స్వయంపాలన, స్వయం నిర్ణయ హక్కు హరించబడటమే గాక సామ్రాజ్యవాద ముసుగులో జరిగే విధ్వంసకర అభివృద్ధిలో దుర్భరమైన జీవనాన్ని గడుపుతున్నారు. ఆదివాసీల జీవించే హక్కు నిరంతరాయంగా వేటాడబడుతున్నది. రాజ్యాంగం పేర్కొన్న ప్రాథమిక హక్కుగా ఉన్నటువంటి జీవించే హక్కు కూడా జరుగుతున్న ఆపరేషన్ కగార్‌లో పూర్తిగా అణచివేతకు గురవుతున్నది. ఈ నేపథ్యంలో ఆదివాసీల సాంప్రదాయక పోరాటాలను గుర్తించిన "ఐక్యరాజ్య సమితి" ఆదివాసీల వారసత్వపు హక్కులు, అటవీ వనరులు, హక్కులు తదితర సమస్యలపై 1982 ఆగస్టు 9న జెనివాలో 26 మంది స్వతంత్ర మానవ హక్కుల మేధావులతో వర్కింగ్ గ్రూపుల సమావేశాన్ని నిర్వహించింది. ఇందులో 140 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కమిటీ 1993 నుండి పది సంవత్సరాల పాటు ప్రపంచ వ్యాప్తంగా తిరిగి ఆదివాసీల సమస్యలను సమగ్రంగా అధ్యాయనం చేసి, 1994 నుండి 2014 వరకు ఆదివాసీల అభివృద్ధి కాలంగా ప్రకటించి, ఆగస్టు – 9న ఆదివాసీల తెగల దినోత్సవంగా ప్రకటించింది. ఐక్యరాజ్య సమితి అంచనా ప్రకారం ప్రపంచంలో 100 దేశాలలో 5 వేల తెగలకు చెందిన 50 కోట్ల ఆదివాసీలు 6700 భాషలను మాట్లాడుతున్నారు. మన దేశంలో 461 ఆదివాసీల తెగలుండగా 92% మంది ఆదివాసీలు నేటికీ అడవి పైనే ఆధారపడి జీవిస్తున్నారు. దేశంలో 'అభివృద్ధి', 'వృద్ధిరేటు పెరుగుదల' పేరిట భూసేకరణ విచ్చల విడిగా జరుగుతున్నది. ఇందుకు పంట పొలాలు, సాగుకు అనుకూలమైన భూములంటూ మినహాయింపు ఏమీ లేదు. 'అభివృద్ధి', 'వృద్ధిరేటు పెరుగుదల' తదితర పేర్లతో సెజ్లు, కారిడార్లు, ఇతర రవాణా మార్గాలు, భారీ ప్రాజెక్టులు, వనసంరక్షణ పార్కుల నిర్మాణాలు, రిజర్వ్ ఫారెస్టు, పర్యావరణ పరిరక్షణ, హరిత హారం, అభయారణ్యాలు మొదలైన వాటికి ప్రాధాన్యత ఇస్తున్నట్లుగా, అందులో భాగంగానే భూ సేకరణ జరుపు తున్నట్లుగా ప్రభుత్వాలు చెబుతూ వస్తున్నాయి. అభివృద్ధి జరగాలంటే ప్రజలు కొంత ఇబ్బందులను ఎదుర్కొనక తప్పదని చెబుతున్నాయి. వాస్తవాచరణలో ఇవన్నీ ప్రజా వ్యతిరేక చర్యలే. ప్రధానంగా ఆదివాసుల జీవన విధ్వంస చర్యలేనన్నది గుర్తించాలి.

ఉద్యమాలు తీవ్రతరమైన పూర్వ రంగంలో దిలీపి సింగ్ భూరియా ఆధ్వర్యంలో ఒక ఉన్నత స్థాయి కమిటీని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిటీ నిపుణుల బృందం అటవీ ప్రాంతాలలో మూలవాసుల ఆధారాల మౌలిక స్వరూపం, వాటి ఆధారాలను సూచిస్తూ 1995 జనవరిలో ఒక నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. ఈ నివేదిక ఆధారంగా భూరియా కమిటీ సిఫారసులలో ప్రధానమైన ఆదివాసులకు 'స్వయం పాలన' ప్రాంతాలను ఏర్పాటు చేయాలని నొక్కి చెప్పిన విషయాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్వపక్షం చేసింది. 1996 డిసెంబర్ 24న షెడ్యూల్డ్ ప్రాంతాల పంచాయితీ చట్టం (పెసా) పేరుతో ఒక చట్టాన్ని ఆమోదించింది. నిజానికి ఇది చట్టం కాకపోయినప్పటికీ ఒక చట్టంగా 73వ రాజ్యాంగ సవరణ ద్వారా సంక్రమించవలసిన అధికారమిది. భూరియా కమిటీ సిఫారసుల ద్వారా గ్రామ సభలకు చాలా పరిమితమైన అధికారాన్ని కల్పిస్తూ మూల ఆదివాసుల గిరిజన తెగలకు అనుకూలమైన అంశాలను అమలు చేయకుండా జీవో.నెం. 90ను జారీ చేసింది. ఆదివాసులకు లభించవలసిన సంపూర్ణ అధికారపు హక్కులు లభించకుండా పాలకులు ఇక్కడ కూడా చాలా కుట్రపూరితంగా వ్యవహరించారు. ఇక్కడొక కీలక అంశాన్ని గమనంలో తీసుకోవలసి ఉంటుంది. సామ్రాజ్యవాద ప్రపంచీకరణకు పునాదులు పడి, విస్తరిస్తున్న కాలమది. భారతదేశంలోని షెడ్యూల్డ్ ప్రాంతాల్లో నిక్షిప్తమై ఉన్న ఖనిజ సంపదను విదేశీ బహుళజాతి సంస్థలకు దోటి పెట్టే ప్రక్రియ కనుగుణంగా అటవీ విధానానికి రూపకల్పన జరుగుతూ వచ్చింది. ఆదివాసీల ఉద్యమా లపై అణచివేతల్లో పోలీసులు పంటల విధ్వంసం, స్త్రీలపై అత్యాచారాలు, హత్యలకు కూడా తెగబడ్డారు. ఈ పరిణామాలపై సమగ్రంగా అధ్యయనం జరిపిన సి.ఆర్. బిజోయ్ తన నివేదికలో ఈ విషయాల్ని పేర్కొన్నాడు. విప్లవ కమ్యూనిస్టు సంస్థల నుండి ఇతర సామాజిక పౌర హక్కుల ఉద్యమాల నుండి దేశంలో ముందుకు వచ్చిన తీవ్ర వ్యతిరేకత, ప్రతిఘటన వల్ల తర్వాత అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం పరిస్థితుల్లో ఉన్న తీవ్రతను గమనించి 2005 డిసెంబర్ నాటికి ఆదివాసుల సాగులో ఉన్న భూములకు సంబంధించి ప్రతి కుటుంబానికి 10 ఎకరాల వరకు క్రమబద్ధీకరించి హక్కులు కల్పిస్తా మని చెప్పింది. పాలకులు ఈ విధంగా రూపొందించిన అటవీ హక్కుల గుర్తింపు చట్టం ముసాయిదా తర్వాత కాలంలో అంటే 2006లో 'అటవీ హక్కుల గుర్తింపు చట్టం – 2006' చట్టంగా రూపొందింది. ఈ క్రమంలో వచ్చిన 2006 అటవీ హక్కుల గుర్తింపు చట్టానికి రెండేళ్ల తర్వాత రూపొంది oచిన నియమావళి 2008 నుండి అమల్లోకి వచ్చింది. ముందే పేర్కొన్నట్లు ఈ చట్టంలో అనేక లోపాలు ఉన్నప్పటికీ ఇవన్నీ ఆదివాసులకు ప్రతికూల అంశాలే అయినప్పటికీ ఏదో మేరకు ఆదివాసులకు ఉపకరించే కొన్ని అంశాలు ఇందులో ఉన్నాయి. దీనిలో ఆదివాసులకు, ఇతర సంప్రదాయ వా సులకు 10 ఎకరాల సాగుభూమి పైన హక్కు లభించబోతుందన్న ప్రబలమైన ఆశ ఏర్పడింది. అయితే ఆచరణలో మాత్రం అమలులకు నోచుకోలేకపోయాయి.

నేడు జరుగుతున్న యుద్ధం ఆగడంలేదు. పాలకుల యుద్ధనీతిలో మార్పులేదు. ఒక వైపు మావోయిస్టు పార్టీ 5 నెలలుగా 10 ప్రకటనలతో శాంతి చర్చల కోసం మేధావులతో, అఖిల భారత స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో శాంతి కమిటీలను ఏర్పరచే ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ చంపేస్తాం, నిర్మూలిస్తాం అనే భాషనే తప్ప ప్రజాస్వామికంగా వ్యవహరించడం లదు. ఎప్పుడైనా సరే ఉద్యమాలు ఎంత బలంగా కొనసాగినా అందులో సామాజిక, రాజకీయ, సాంఘీక, న్యాయ అంశాలు లేకపోతే ఆ ఉద్యమాలు ఎక్కువ కాలం కొనసాగలేవు. ఇలా కొనసాగుతున్న ఉద్యమాలను కార్పొరేట్ల కోసం నిర్మూలించాలనుకోవడం మోదీ-అమిత్‌షాల నియంతృత్వ విధానం. శాంతి చర్చలు జరపాలి. కాల్పుల విరమణను ప్రకటించాలి.

మధ్య భారతంలో శాంతిని నెలకొల్పాలి. ఆదివాసీల జీవించే హక్కులను కాపాడాలను అదే విధంగా మావోయిస్టుల ఉద్యమాన్ని కూడా కొనసాగించాలి. అవన్ని కూడా ప్రజాస్వామ్య విలువలతో కూడిన ప్రజాస్వామిక అంశాలు. వాటిని మోడీ–షాల ప్రభుత్వం ఇప్పటికైనా అమలు చేయాలి. హక్కుల సంఘాలకు నిజనిర్ధారణకు అవకాశాలు కల్పించి జరిగిన అన్ని హత్యాకాండలపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించి నేరస్థులను చట్టబద్ధంగా శిక్షించగలిగితే ప్రజాస్వామ్యంపై ప్రజలకు మరింత విశ్వాసం పెరుగుతుంది. కానీ ప్రభుత్వాలు 28 రకాల 7 లక్షల కోట్ల ఖనిజ సంపదను కార్పొరేట్లకు అందించడం కోసం ప్రజలపై చేస్తున్న కార్పొరేట్ యుద్ధమే కగార్ యుద్ధం. కార్పొరేట్ సంస్థల కనుసన్నలలోనే, వారి కను సైగలతోనే ఇక్కడ రాజ్యపాలన సాగుతుంది. కార్పొరేట్ సంస్థలు రాజ్య విభాగాలన్నింటిని తమ ప్రభావానికి గురి చేస్తున్నవి. మావోయిస్టు రహిత భారత్‌ను నెలకొల్పుతానంటూ ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసుల నర సంహారాన్ని తీవ్ర స్థాయిలో కొనసాగిస్తున్నారు. పాలకులు, అధికారులు, పోలీసు యంత్రాంగం, కార్పొరేట్ సంస్థలు, క్రిమినల్స్ కలిసి కుమ్మక్కై ఆదివాసులు జాతి సంపదను దోపిడి చేస్తున్నారు. చట్టాలను సైతం తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. గతంలో కంటే కనీవినీ ఎరుగని స్థాయిలో అవినీతి పెరిగింది. విశాఖ మన్యాలలో, దేశంలోని ఆదివాసి ప్రాంతాల్లో జరుగుతున్న సంఘర్షణ ఇదే. మన్యం వాసులపై మావోయిస్టు ముద్రవేసి పాలకవర్గాలు సాయుధ బలగాలను ఉసిగొల్పితే పోరాటాలు మరింత ఉధృతం అవుతాయనటానికి చరిత్రలో, వర్తమానంలో ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. సమాజంలో ఆదివాసీల రోదన అరణ్య రోదనగా మారింది. రాజ్యాంగంలోని ఐదు, ఆరు షెడ్యూళ్ళలోని నియమాలను పటిష్టంగా అమలు చేస్తే, ఆదివాసీల స్థితిగతులు, ఆయా ప్రాంతాలు ఆర్థిక సామాజిక అంశాల్లో, ఏదో ఒక మేరకు మెరుగుపడుతాయనడంలో రెండో మాటకు తావు లేదు. కానీ ప్రభుత్వ యంత్రాంగం కార్యచరణే గాడి తప్పింది. షెడ్యూల్డ్ ప్రాంత ఆదివాసీ స్థితిగతుల్ని సమీక్షించి, ప్రత్యేక చర్యలు చేపట్టే అధికారాలు గవర్నరూ, రాష్ట్రపతికి ఉన్నాయి. ఆదివాసీ స్థితిగతులపై రాజ్యాంగ అధినేతలు ఏనాడు పట్టించుకోవడం లేదు. కాకపోగా సల్వాజుడుం, ఆపరేషన్ గ్రీన్‌హంట్, సమాధాన్, నేడు ఆపరేషన్ కగార్ హత్యాకాండలు ఆదివాసీల జీవించే హక్కును పూర్తిగా అణచివేస్తున్న నేపథ్యంలో వారికి అండగా ప్రజాస్వామిక ఉద్యమాలు కొనసాగాలి. ఇప్పుడున్న దేశ రాజకీయ పరిస్థితుల్లో బలమైన మేధావుల గొంతుకలను ఉపా నిర్బంధంలో నిశ్శబ్ధం చేయడంలో ప్రభుత్వాలు సఫలమవుతూ వస్తున్నాయి. అదే స్థితిలో జరుగుతు న్న ఆదివాసీల హత్యాకాండకు వ్యతిరేకంగా శాంతి చర్చలు జరపాలని, కాల్పుల విరమణ పాటించాలని అఖిల భారత స్థాయిలో ప్రజలు మాట్లాడు తున్నారు. కానీ ప్రభుత్వం మాత్రం మేము నిర్మూలిస్తాం అనే భాషనే తప్ప ఒక ప్రజాస్వామికమైన భాషను మాట్లాడడానికి ముందుకు రావడం లేదు. వారి ఆచరణ అంతాకూడా నియంతృత్వ ఫాసిస్టు అప్రజాస్వామిక విదానాలతో కొనసాగుతున్న ప్రజాస్వామిక వులువలు ఆదివాసీ చట్టాలు దళితుల ఆత్మ గౌరవ సమస్యలు, వారికి పోరాటాలుగా కనిపించి వాటిని అణచివేయడానికే ప్రభుత్వాలు సిద్ధపడుతున్నాయి తప్ప శాంతి చర్చలతో ఒక ప్రజాస్వామిక వాతావరణాన్ని ఏర్పాటు చేయడమే ప్రజాస్వామ్యం యొక్క కర్తవ్యంగా భావించడంలో విఫలమవు తున్నది. మనందరం ప్రజాస్వామ్యం నిలబెట్టడం కోసం శాంతి చర్చలను కాల్పుల విరమణను ప్రకటించడం కోసం ఒక ఉద్యమాన్ని నిర్మించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.



**ఎన్. నారాయణ రావు**
ప్రధాన కార్యదర్శి
పౌరహక్కుల సంఘం

# జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాల్సిందే..

- చిన్నా, పెద్ద తేడా లేకుండా అర్హులైన వారికి ఇవ్వాలి
- ముడు నెలలకొకసారి అక్రిడిటేషన్ పొడిగించడం సరికాదు
- జర్నలిస్టులందరికి శిక్షణా తరగతులు నిర్వహించాలి
- జర్నలిస్టుల హక్కుల కోసం సమిష్టిగా కృషి చేయాలి
- జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి
- టీడబ్ల్యూజేఎఫ్ రంగారెడ్డి జిల్లా కోశాధికారి జోగు శ్రీనివాస్
- ఇబ్రహీంపట్నంలో టీడబ్ల్యూజేఎఫ్ నియోజకవర్గ కమిటీ సమావేశం



**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 4 (జనం సాక్షి) :** అర్హులైన పాత్రికేయ మిత్రులకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాల్సిందేనని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) జిల్లా కోశాధికారి జోగు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. చిన్నా, పెద్ద తేడా లేకుండా అర్హులకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలన్నారు. నూతన కార్డులు ఇవ్వకుండా ముడు నెలలకొకసారి స్టిక్కర్ వేసి పొడిగించడం సరైంది కాదన్నారు. గుర్తింపు పొందిన చిన్న పత్రికలకు సైతం అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సోమవారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ఎన్ఆర్ గార్డెన్ లో టీడబ్ల్యూజేఎఫ్ నియోజకవర్గ కమిటీ సమావేశం సంఘం నియోజకవర్గ ప్రచార కార్యదర్శి కందుకూరి నాగేష్ అధ్యక్షతన జరిగింది. ఇట్టి సమావేశంలో సంఘం సభ్యత్వం, అక్రిడిటేషన్ కార్డులు, జిల్లా మహాసభలు, ప్రెస్ అకాడమీ శిక్షణా తరగతులు, తదితర అంశాలపై ప్రధానంగా చర్చించారు. ఈ సమావేశానికి సంఘం జిల్లా కోశాధికారి జోగు శ్రీనివాస్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పల్లాటి జగన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు... సంఘం సభ్యత్వాన్ని ఉద్యమంలా చేపట్టాలని కోరారు. సంఘంలో నూతన సభ్యులను చేర్చడం కోసం ప్రయత్నం చేయాలన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి టీడబ్ల్యూజేఎఫ్ నిరంతరం కృషి చేస్తున్నట్లు వివరించారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. జర్నలిస్టుల పరిస్థితులు దారుణంగా మారాయని, అనేక ఒడిదుడుకుల మధ్య వృత్తిని కొనసాగిస్తూన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. జర్నలిస్టులకు భద్రత కల్పించాలన్నారు. అర్హులైన వారికి ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను ప్రభుత్వాలు అరికట్టాలన్నారు. ఈ క్రమంలో జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రెస్ అకాడమీ ఏకపక్ష నిర్ణయాలు సరైంది కాదన్నారు. మీడియా అకాడమీ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు శిక్షణా తరగతుల పేరుతో కొంతమందికే శిక్షణా ఇవ్వడం, ఓ జర్నలిస్టు సంఘానికి అనుకూలంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు. మీడియా అకాడమీ ఆధ్వర్యంలో ప్రతి జర్నలిస్టుకు శిక్షణా ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండలాల వారీగా నూతన కమిటీలను నియమించాలన్నారు. త్వరలో నియోజకవర్గ పరిధిలో సభ్యులందరి సమక్షంలో పెద్ద ఎత్తున సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. త్వరలో జరగనున్న సంఘం జిల్లా మహాసభల విజయవంతం కోసం సభ్యులంతా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సంఘం బలోపేతం కోసం సభ్యులందరూ శక్తి,వంచన లేకుండా కృషి చేయాలని కోరారు. జర్నలిస్టుల హక్కుల కోసం కలిసికట్టుగా సమిష్టిగా కృషి చేయాలని కోరారు. సమావేశంలో టీడబ్ల్యూజేఎఫ్ కమిటీ నియోజకవర్గ ఉపాధ్యక్షులు పంది శ్రీను, గుండమోని శివకుమార్, జుబ్బూరు కుమార్, సహాయ కార్యదర్శి ఎర్ర లింగం, తదితరులు పాల్గొన్నారు.

## బోడుప్పల్ ప్రజలందరినీ కంటికి రెప్పలా కాపాడుకునే బాధ్యత నాదే..

- రంగంలో అమ్మవారి భవిష్యవాణిని వినిపించిన ఏర్పుల విజయ్ కుమార్



**బోడుప్పల్, ఆగస్టు 4 (జనంసాక్షి) :** బోడుప్పల్ ప్రజలందరిని కంటికి రెప్పలా కాపాడుకునే బాధ్యత నాదేనని, ప్రతి ఏటా తనకు మొక్కులు చెల్లించి తనను వైభవంగా చూస్తున్నారని, పిల్లపాపలను కాపాడుకునేందుకు తాను ఎల్లవేళలా అండగా ఉంటానని బోడుప్పల్లోని శ్రీ బంగారు మైసమ్మ ఆలయం వద్ద సోమవారం నిర్వహించిన రంగం కార్యక్రమంలో ఏర్పుల విజయ్ కుమార్ భవిష్య వాణిని వినిపించారు. వందలాది మంది సమక్షంలో జరిగిన రంగం కార్యక్రమంలో భవిష్యవాణిని వినిపించి ప్రజలను సంతృప్తి పరిచారు. అమ్మవారి కోర్కెలను తీర్చడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అమ్మవారికి ఏ లోటు లేకుండా చూసుకుంటామన్నారు. అనంతరం భారీ పోలీసు బందోబస్తు మధ్య బలిగంపను పురవీధుల్లో ఊరేగించారు. భవిష్యవాణిని వినేందుకు వందలాది మంది ప్రజలు దేవాలయం వద్ద ఆసక్తిగా తిలకించారు. బోనాల ఉత్సవాలలో భాగంగా పెద్దఎత్తున ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమాలు పోటాపోటీగా నిర్వహించడంతో పాటు, స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత దానగల్ల యాదగిరి ఆధ్వర్యంలో వేదికను ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. రెండో రోజు కూడా బంగారు మైసమ్మ అమ్మవారిని అనేకమంది భక్తులు దర్శించుకుని తమ మొక్కులను తీర్చుకున్నారు. రెండు రోజుల పాటు జరిగిన బోనాల ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించడానికి మేడిపల్లి సిఐ గోవిందరెడ్డి ఆధ్వర్యంలో భారీ ఎత్తున పోలీసులను మోహరించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జీ తోటకూర వజ్రేశ్ యాదవ్, శ్రీ బంగారు మైసమ్మ ఆలయ కమిటి అధ్యక్షులు బొబ్బాల లక్ష్మారెడ్డి, మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నరసింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ బిబ్లాక్ కమిటీ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్ గౌడ్, సీనియర్ నాయకులు పోగుల వీరారెడ్డి,రాపోలు శంకరయ్య.దానగల్ల యాదగిరి, బొమ్మకు విశ్వనాథ్. మీసాల కృష్ణ. పొన్నం రవిగౌడ్, తోటకూర చందర్ యాదవ్,గౌనె శ్రీనివాస్, రవీందర్ యాదవ్.అశోక్ యాదవ్, మైసగల్ల మల్లేశ్, బక్కరమేశ్ యాదవ్. దేవరకొండ వీరాచారి. బొమ్మకు రమేశ్ బందారం నాగేశ్వర్ గౌడ్. పులకండ్ల జంగా రెడ్డి. బందారం శ్రీధర్ గౌడ్, చంటి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు సామల పవన్రెడ్డి, చీరాల నర్సింహ. బొమ్మకు కల్యాణ్ కుమార్, రాసాల వెంకటేశ్ యాదవ్. భూక్య సుమన్ నాయక్,జడిగె మహేందర్ యాదవ్ యువజన కాంగ్రెస్ నాయకులు పొన్నం తరుణ్ గౌడ్, బొమ్మకు అజయ్. పోగుల దిలీప్రెడ్డి. బొమ్మకు శివ.రాపోలు ఉపేందర్, ఆసర్ల బీరప్ప కురుమ, పులకండ్ల కీర్తన్ రెడ్డి చిన్నింగల వినయ్. చిన్నింగల సంతోషతో పాటు ఆలయకమిటీ ప్రతినిధులు, వివిధ కాలనీలప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆకునూరులో కేజీకేఎస్ అమరుల యాదిలో సామాజిక చైతన్య యాత్ర




**చేర్యాల, ఆగస్టు 4 (జనంసాక్షి) :** కేజీకేఎస్ అమరుల యాదిలో సామాజిక చైతన్య యాత్ర సామాజిక చైతన్య యాత్రలో భాగంగా సోమవారం ఆకునూర్ గ్రామంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కార్యదర్శి బండకింది అరుణ్ గౌడ్ హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికల ముందు గీత కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని లేని పక్షంలో రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున కేజీకేఎస్ ఆధ్వర్యంలో ఉద్యమం చేపట్టడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేజీకేఎస్ జిల్లా ఉపాధ్యక్షులు రణం వెంకటేశ్వర్లు, కేజీకేఎస్ గ్రామ అధ్యక్షులు మంతపూరి నర్సయ్య, రణం కిష్టయ్య, నాయకులు బాపు కనకయ్య, మంతపూరి లక్ష్మణ్, స్వామి, శ్రీకాంత్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాక్స్ నాలాలు వర్షపు నీటి కోసమే వాడాలి



**హయత్‌నగర్, ఆగస్టు 4 (జనం సాక్షి) :** మన్సూరాబాద్ డివిజన్ లోని జడ్జెస్ కాలనీ ఫేస్-1, సహారా స్టేట్స్, హిమపురి కాలనీ ఫేస్-2 మీదుగా వర్షపు నీరు పోవడానికి జిహెచ్ఎంసి నిర్మించిన బాక్స్ నాలాను పరిసర కాలనీ వాసులతో కలిసి జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వర్షపు నీరు మళ్లించే బాక్స్ నాలా ప్రజల భద్రతకు, ఆరోగ్యానికి కీలకమైనవి కొంతమంది నిర్లక్ష్యపూరితం గా, అజాగ్రత్తగా ఈ నాలాలో మురుగు నీరు కనెక్షన్లు కలపడం తో విపరీతమైన దుర్వాసన వస్తుందని స్థానికులు వాపోతున్నారని వారు పేర్కొన్నారు. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించి కార్పొరేటర్ హెచ్చరిక చేశారు. బాక్స్ నాలాలు వర్షపు నీటి పారుదలకు మాత్రమే ఉద్దేశించినవని వాటిలో సివరేజ్ కనెక్షన్లు కలపడం అనేది నేరమని ఇటువంటి చర్యలకు పాల్పడిన వారిపై జిహెచ్ఎంసి, హెచ్ఎండబ్ల్యూఎస్ ఎస్ బి శాఖలను సమన్వయం చేసి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వారు తెలియజేశారు. ఆటోనగర్ రోడ్డుకు ఇరువైపులా చెత్త చెదారంతో ఉందని వెంటనే సంబంధిత అధికారులు, సిబ్బంది తగిన చర్యలు తీసుకొని క్లియర్ చేయించాలని వారు ఆదేశించారు. ఇక్కడ డంప్ చేస్తున్న వారిపై సరైన నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకునేలా అధికారులు ప్రణాళిక రూపొందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పరిసర కాలనీ వాసులు, సయ్యద్ జానీ, కత్తుల రాంబాబు, శోభన్ బాబు, మధుసూదన్ రెడ్డి, కిరణ్, అజయ్, చంద్రశేఖర్, కిషోర్ పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధే లక్ష్యం

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 4 (జనం సాక్షి) :** గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందనీ ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందేలా చూస్తామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. సోమవారం అనాజ్ పూర్,గుంతపల్లి,మజీద్ పూర్ గ్రామాలలో దాదాపు 80 లక్షలతో నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అనాజ్‌పూర్ గ్రామంలో ఏడు తలకాయల మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనాజ్ పూర్ గ్రామంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు ఎమ్మెల్యే కు ఘన స్వాగతం పలికారు. అనంతరం హరిత హారం కార్యక్రమంలో భాగంగా అధికారులు..మహిళ సంఘం సభ్యులతో కలసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం ఎన్ని నిధులు అయినా మంజూరు చేస్తామని అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామని ప్రజా సంక్షేమం కోసమే పనిచేస్తున్నామని అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల లోపు గృహ జ్యోతి, అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులు, పేదలకు సన్నబియ్యం, రైతు బరోసా, రైతు రుణ మాఫీ, మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచితంగా బస్సు సౌకర్యం, వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వంలో అభివృద్ధికి గ్రామాలు నోచుకోలేదని కేవలం గత ప్రభుత్వం కమిషన్లు దండుకోని గ్రామాల అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు.ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి రోజు ప్రజల కోసం పని చేస్తున్నామని ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి,గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కర చారి, మాజీ జెడ్పిటిసి బింగి దేవదాస్ గౌడ్,మండల పార్టీ అధ్యక్షులు కొత్త ప్రభాకర్ గౌడ్,గుంతపల్లి మాజీ సర్పంచ్ కరిమెల వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## గిఫ్ట్ ఏ స్మైల్‌తో విద్యార్థికి ఆర్థిక చేయూత

**రాజేంద్రనగర్, ఆగస్టు 4 (జనం సాక్షి) :** ఉత్తమ విద్యను అభ్యసిస్తున్న నిరుపేద విద్యార్థికి ఆర్థికంగా చేయూతనందించడం హర్షించదగ్గ విషయమని రాజేంద్రనగర్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తిక్ రెడ్డి పేర్కొన్నారు. జులై 24న బీఆర్ఎస్ పార్టీ కార్య నిర్వాహక అధ్యక్షుడు కెటీఆర్ పుట్టిన రోజున తలపెట్టిన గిఫ్ట్ ఏ స్మైల్ పిలుపు మేరకు, వారి ప్రేరణతో వీఆర్ 4 సహాయోగ్ చారిటబుల్ ట్రస్టు ఉపాధ్యక్షుడు, బి.ఆర్.ఎస్ మణికొండ పార్టీ ముఖ్య సలహాదారుడు బొమ్ము ఉపేందర్నాథ్ రెడ్డి నిరుపేద విద్యార్థికి ఆర్థికంగా చేయూతను అందించారు. గత ఏడాది మాదిరి శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో 470 మార్కులకు గాను 462 సాధించిన విద్యార్థిని ఫలివేల చక్రికకు 439 మార్కులు సాధించిన పూజాసింగ్ ల యొక్క రెండవ సంవత్సరం విద్యకు గాను ప్రోత్సాహకరంగా కళాశాల పాక్షిక ఫీజు చెల్లింపును సోమవారం రోజున బ్యాంకు చెక్ ద్వారా



కార్తీక్ రెడ్డి చేతుల మీదుగా వీ ఆర్ 4 సహయోగ్ చారిటబుల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ అందె లక్ష్మణ్ రావు తో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో మణికొండ మునిసిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళతో పాటు ట్రస్టు సభ్యురాలు సుమ నళిని, బి.ఆర్.ఎస్ పార్టీ మణికొండ స్థానిక నాయకులు గుట్టమీది నరేందర్, రామసుబ్బారెడ్డి, ఆరిఫ్ మహమ్మద్, మహేశ్వరం సుమన్, శేఖర్, విద్యార్థినిల తండ్రులు పి.అర్జున్, మనోజ్ సింగ్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

- ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన ప్రభుత్వ అధికారులే భూ కబ్జాదారులకు అండ
- భూముల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోడుకొండ్ల ప్రవీణ్

**యాచారం, ఆగస్టు 4 (జనం సాక్షి) :** ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని భూముల పరిరక్షణ సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గోడుకొండ్ల ప్రవీణ్ సోమవారం రోజున కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వినతి పత్రం అందజేశారు.యాచారం మండలంలోని మాల్ గ్రామపంచాయతీ నల్లవెల్లి రెవెన్యూ సర్వే నెంబర్ 567,531 లో ప్రభుత్వ భూమిని కొంత మంది వ్యక్తులు కబ్జా చేసినారని,ఆ యొక్క భూమిలో అక్రమంగా ఇంటి నెంబర్లని సృష్టించుకుని డాక్యుమెంట్లు తయారు చేసుకొని రిజిస్ట్రేషన్లు చేసుకొని లావాదేవీలు జరుపుతున్నారని అన్నారు అట్టి విషయమై గతంలో పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ నామ మాత్రం గానే చూసి చూడనట్లు వదిలి వేశారని అన్నారు కబ్జా చేసిన వారిపై చర్యలు ఇంతవరకు తీసుకోలేదని, పలు పత్రికల్లో కథనాలు వచ్చినప్పటికీ స్పందన లేదని,ఇప్పటికైనా కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని పరిరక్షించి సర్వే చేసి హద్దులు నియమించి పిఓటి చట్టం కింద భూమిని స్వాధీనపరచుకొని కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వినతిలో పేర్కొన్నారు.



# దళితులకు న్యాయం చేయండి

- అగ్రకుల పెత్తందారులు దాడులు చేసిన పట్టించుకోరా...
- విచారణ పేరుతో కాలయాపన
- నిందితులను వెంటనే అరెస్టు చేయాలని ఎస్పీ ఆఫీసు ముందు ప్రజా సంఘాల ధర్నా

**వికారాబాద్ జిల్లా బ్యూరో, ఆగస్టు 4 (జనం సాక్షి) :** కోడంగల్,పరిగి, తాండూర్ నియోజవర్గాలలో దళితులను కులంపేరుతో దుషించి భూములను ఆక్రమించి, దాడి చేసిన అగ్రకుల పెత్తందార్లపై ఎస్సి,ఎస్టి అట్రాసిటి కేసులు వెంటనే నమోదు చేసి, అరెస్ట్ చేయాలని ప్రజాసంఘాలు వికారాబాద్ ఎస్పీ ఆఫీసు ముందు ధర్నా నిర్వహించారు.ఎస్సి,ఎస్టి కేసులలో అగ్రకుల నిందితులను అరెస్ట్ చెయ్యకుండా వారికే కొమ్ము ఖస్తూ ఎస్సి ఎస్టి కేసులను నిర్వీర్యం చేస్తున్న పరిగి డిఎస్పి శ్రినివాస్, తాండూర్ డీఎస్పీ బాలకృష్ణ రెడ్డి పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని నేడు దళిత ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.తాండూరు మండలం శేనిగేష్ పూర్ గ్రామానికి చెందిన ఎరుకల శారద వారి భర్త బస్వరాజ్,వారి కుటుంబ సభ్యులు రోడ్డుపై వెళ్తుంటే అదే గ్రామానికి చెందిన రమేష్ గౌడ్, నరేందర్ గౌడ్, పవన్ గౌడ, నరేష్ గౌడ్ ముకుమ్మడీగా బహిరంగంగా కులం పేరుతో దూషించి కర్రలతో దాడి చేసినారు. ఈ ఘటనపై తాండూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చెయ్యగా ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినప్పటికీ నిందితులను ఇప్పటికి అరెస్టు చేయకుండా విచారణ పేరుతో తాండూర్ డిఎస్పి కాలయాపన చేస్తున్నారు. యాలాల్ మండలం గోరేపల్లి గ్రామానికి చెందిన




దళితుడు రవికుమార్ అదే గ్రామం బీసీ కులానికి చెందినటువంటి వ్యక్తి దగ్గర పొలం కౌలుకు వేసుకుంటే మా అగ్రకులస్తుల భూమిని ఎట్లా కౌలుకు కేసుకుంటావని కులం పేరుతో దూషించి, దాడి చేసిన అగ్రకుల పెత్తందార్లు విష్ణు, పకీరప్ప మరియు అతని అనుచరులపై ఎస్సి, ఎస్టి కేసు నమోదుఅయినప్పటికీ అ నిందితులను కూడా అరెస్ట్ చెయ్యలేదు. ఈ కార్యక్రమలో రైతుసంఘం జిల్లా నాయకులు మహిపాల్,సుదర్శన్ సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ,బుస్స చంద్రయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు యూ.బుగ్గప్ప,ఉపాధ్యక్షులు సత్యయ్య, కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నవీన్, మల్కయ్య, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ,కొత్తూరు చంద్రయ్య, హబీబ్,ఇశ్వప్ప, దశరథ్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణ ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వ కృషి

- మౌలాలిలో నూతన పోలీస్ స్టేషన్
- సీఐగా బాధ్యతలు స్వీకరించిన సైదయ్య
- మైనంపల్లి కృషితో పోలీస్ స్టేషన్ ఏర్పాటు
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు



**మల్కాజిగిరి, ఆగస్టు 4 (జనంసాక్షి) :** శాంతిభద్రతల పరిరక్షణ ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. మల్కాజిగిరి నియోజకవర్గంలోని మౌలాలిలో నూతన పోలీస్ స్టేషన్ మంజూరు అయింది.నూతన పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా సైదయ్య నియమితులయ్యారు. ఈ మేరకు మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ను ఆయన నివాసంలో సిఐ సైదయ్య మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా మైనంపల్లి మాట్లాడుతూ, శాంతిభద్రతల పరిరక్షణలో తమదైన పాత్ర పోషించాలని ఇన్స్పెక్టర్ కు సూచించారు.నూతన మౌలాలి పోలీస్ స్టేషన్ భవనం కోసం మున్సిపల్ కమిషనర్ ఆర్వి కర్ణన్‌తో మాట్లాడి మౌలాలి పరిధిలో ఉన్న వార్డు కార్యాలయాన్ని ప్రస్తుతం మౌలాలి పోలీస్ స్టేషన్ కోసం కేటాయించాలని మైనంపల్లి కోరారు. ఇందుకుగాను వారు సమ్మతించినట్లు మైనంపల్లి పేర్కొన్నారు. మౌలాలిలో ఉన్న కుషాయిగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఖాళీ స్థలంలో మౌలాలి పోలీస్ స్టేషన్ కోసం కోటిన్నర రూపాయలు నిధులు మంజూరయ్యాయని సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన అనంతరం ఆగస్టు 15వ తేదీన శంకుస్థాపన చేయనున్నట్లు మైనంపల్లి పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో శాంతి భద్రతల పరిరక్షణకు పెద్దపీట వేయడం ఎంతో సంతోషంగా ఉందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
05 ఆగస్టు 2025

# మాయావతిని ప్రధానిని చేయడమే లక్ష్యంగా బీఎస్పీ శ్రేణులు పనిచేయాలి

- ఉత్తరప్రదేశ్ బిఎస్పీ మాజీ ఎమ్మెల్సీ అతార్ సింగ్ రావ్



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, ఆగస్టు 4 (జనంసాక్షి) :** బీఎస్పీ ఫైర్ బ్రాండ్ మాయావతిని భారతదేశానికి ప్రధానిని చేయడమే ప్రధాన లక్ష్యంగా బహుజన సమాజ్ పార్టీ శ్రేణులు పనిచేయాలని మాజీ ఎమ్మెల్సీ బీఎస్పీ పార్టీ నాయకులు అతార్ సింగ్ రావు పిలుపునిచ్చారు. బహుజన సమాజ్ పార్టీ(బిఎస్పీ) జిల్లా అధ్యక్షులు బోనాసి రాంచందర్ అడ్వకేట్ అధ్యక్షతన సోమవారం జిల్లా కేంద్రంలో జిల్లా సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్య అతిథులుగా ,విశిష్ట అతిథులుగా బిఎస్పీ పార్టీ సెంట్రల్ స్టేట్ కో ఆర్డినేటర్ దాగిళ్ళ దయానంద్ రావ్, గౌరవ అతిథులుగా బిఎస్పీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మంద ప్రభాకర్ హాజరైయ్యారు. ఈ కార్యక్రమంలో అతార్ సింగ్ రావ్ మాట్లాడుతూ బాబాసాహెబ్ డా.అంబేద్కర్ ఆలోచన విధానం, మాన్యవర్ కాన్షీరాం పని విధానం, బెహెన్ కుమారి మాయావతి నాయకత్వంలోనే భారతదేశ బహుజనులకు రాజ్యాధికారం సాధ్యం అనీ అన్నారు. బీజేపీ, కాంగ్రెస్, బిఆర్ఎస్, కమ్యూనిస్ట్ మరియు ఇతర పార్టీలు ఏవి కూడా బహుజనులవి కావని విమర్శించారు. నూటికి 85 శాతంగా ఉన్న బహుజనుల ఏకైక పార్టీ బిఎస్పీ అని వివరించారు. రాజ్యాధికారం లేని జాతులకు పార్లమెంట్, అసెంబ్లీలే అసలైన ఆధునిక దేవాలయాలు అని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య యుగంలో అధికారం అంతా పార్లమెంట్, అసెంబ్లీల్లోనే ఉందని పేర్కొన్నారు. ఉత్తర ప్రదేశ్ లో కూడా బీజేపీ ప్రభుత్వం పట్ల విసుగు చెంది ఉన్నారని, రానున్న అసెంబ్లీ ఎన్నికలల్లో బేహెన్ కుమారి మాయావతిని 5వ సారి ముఖ్యమంత్రి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. 2012లోనే మాయావతి దేశానికి ప్రధాని అవ్వాల్సి ఉండే అనీ, కానీ కొంతమంది కుట్రల వల్ల కాలేక పోయారని అన్నారు. 2029 పార్లమెంట్ ఎన్నికల్లో బిఎస్పీ నీలిజెండా ఎర్రకోటపై ఎగరేసే విధంగా కార్యకర్తలు పని చేయాలనీ పిలుపునిచ్చారు. మాయావతి 1995లో ముఖ్యమంత్రి అవ్వకముందే, కర్ణాటక బీదర్ జిల్లాల్లో 1994లో బిఎస్పీ పార్టీ ఎంఎల్ఏ గెలిచిన విషయాన్ని గుర్తు చేశారు. అదే విధంగా తెలంగాణలో కూడా బిఎస్పీ ఎంపీ, ఎంఎల్ఏ లను గెలిచే విధంగా ప్రణాళికలు రూపొందించుకుని ముందుకు వెళ్దామని అన్నారు. బిఎస్పీ సెంట్రల్ స్టేట్ కో ఆర్డినేటర్ దాగిల్ల దయానంద్ రావ్ మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో బిఎస్పీ పార్టీ ఇతర పార్టీలకు బలమైన పోటీ ఇవ్వాలని పిలుపునిచ్చారు. స్థానిక ఎన్నికల్లో బిఎస్పీ సత్తా చాటాలని అన్నారు. బిఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు మంద ప్రభాకర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగానికి ముప్పు పొంచి ఉందని అన్నారు. భారత రాజ్యాంగాన్ని కాపాడే ఏకైక పార్టీ బిఎస్పీ అనీ అన్నారు. అట్లాగే భారత రాజ్యాంగాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసే పార్టీ కూడా బిఎస్పీ అని తెలిపారు. భారత రాజ్యాంగాన్ని పూర్తి స్థాయిలో అమలు చేస్తే, బహుజనులకు ఎలాంటి బాధలు ఉండవన్నారు. కానీ పాలక పార్టీలు అలా చేయలేవని, ఒక్క బిఎస్పీ పార్టీ మాత్రమే ఆ పని చేస్తుందని అందుకే బహుజనులు అంతా బిఎస్పీ పార్టీనీ బలోపేతం చేయాలనీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంతటి నాగన్న, రాష్ట్ర కోశాధికారి ప్రణయ్, రాష్ట్ర ఆఫీస్ కార్యదర్శి అనిల్, రాష్ట్ర ఈసీ మెంబర్ పృధ్వీరాజ్, జిల్లా ఇంఛార్జ్ లు బిసమోళ్ళ యోసేఫ్, సి. కల్యాణ్, జిల్లా ఉపాధ్యక్షులు రామన్న, జిల్లా కోశాధికారి దాస్, అసెంబ్లీల ఇంచార్జ్ లు కొత్తపల్లి కుమార్, కృపానందం, అసెంబ్లీల అధ్యక్షులు మడుపు నాగేష్ (నల్లవెల్లి మాజీ డిప్యూటీ సర్పంచ్), బొల్లి కురుమయ్య, గుద్దటి మల్లన్న, దన్నారం బాలు, నాయకులు పరుశరామ్, భాస్కర్, నాగరాజు, బాలనాగులు, రాంచందర్, రాజ్, ఆంజనేయులు, రామకృష్ణ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## మన ఊరు - మన బడి పెండింగ్ బిల్లులను చెల్లించాలి

- అడిషనల్ కలెక్టర్‌కు కాంట్రాక్టర్ల వినతి



**వనపర్తి, ఆగస్టు 4 (జనంసాక్షి) :** వనపర్తి జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలలో గత మూడేళ్ళ క్రితం మన ఊరు - మన బడి పథకం కింద చేపట్టిన ప్రభుత్వ పాఠశాలలో పనుల బిల్లులు చెల్లించాలని కోరుతూ కాంట్రాక్టర్లు సోమవారం ప్రజావాణి లో అడిషనల్ కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు కాంట్రాక్టర్లు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మన ఊరు - మన బడి పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు డబ్బులు ఇవ్వకుండా కలర్లు వేసిన మేఘా కృష్ణారెడ్డికి మాత్రం డబ్బులు ఇచ్చిందని, మాలాంటి చిన్న చిన్న కాంట్రాక్టర్లకు డబ్బులు ఇవ్వకపోవడం దారుణమన్నారు. అప్పులు చేసి కట్టడం జరిగిందని తెచ్చిన అప్పులకు మిత్తీలు కట్టలేకపోతున్నామని వాపోయారు. ఇప్పటికైనా అర్థం చేసుకొని పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, లేదంటే జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలలకు తాళాలు వేస్తామని హెచ్చరించారు.

## పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకోవాలి

- జిల్లా ఎస్పీ.రావుల గిరిధర్



**వనపర్తి బ్యూరో, ఆగస్టు 4 (జనంసాక్షి) :** ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకోవాలని, వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా 14 మంది పిర్యాదిదారుల నుండి ఫిర్యాదులను జిల్లా ఎస్పీ స్వీకరించారు. సోమవారం వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్, ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 14 మంది ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత స్టేషన్‌ల యొక్క ఎస్సైలకు, సిఐ లకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని మరియు పరిష్కారానికి సూచనలు చేయడం జరిగింది. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ, వారి వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకొనేల, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీసు శాఖ పని చేస్తుందని, తెలియజేశారు. ప్రజా సమస్యలుపై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కారిస్తున్నామని తెలియజేశారు.

# జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు ఆదర్శం

- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి వేగం పెంచాలి
- నిరంతరాయ విద్యుత్ సరఫరా దిశగా పటిష్ట చర్యలు
- ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి
- ఫ్రైడే డ్రైడే సమర్థవంతంగా అమలు కావాలి
- చేగుంట మండలంలో జిల్లా కలెక్టర్ సుడిగాలి పర్యటన



**మెదక్, ఆగస్టు 4 (జనం సాక్షి) :** చేగుంట మండలంలోని కసాన్పల్లి గ్రామంలో సోమవారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ విస్తృతంగా పర్యటించి అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాల, క్షేత్రస్థాయిలో ఇందిరమ్మ ఇండ్ల పురోగతి పనులను, పరిశీలించారు. ముందుగా మండల కేంద్రంలో అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి ఆటపాటలతో పూర్వ ప్రాథమిక విద్య బోధన విధానాన్ని స్వయంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలు ఆదర్శవంతంగా నిలుస్తాయన్నారు. గర్భిణీలకు చిన్నపిల్లలకు పౌష్టికాహారం అందించడంలో రాజీ పడేది లేదని ప్రభుత్వం అందించిన మెనూ ప్రకారం పోషకాహారం అందించాలన్నారు, అనంతరం ఇందిరమ్మండ్ల నిర్మాణ పురోగతిని పరిశీలిస్తూ పేదవారికి సొంత ఇంటి కల నెరవాలని ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరమ్మండ్ల పథకాన్ని ప్రవేశపెట్టిందని అత్యంత నిరుపేదలకు అన్ని అర్హతలు పరిశీలించి ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని త్వరితగతిన ఇండ్లు నిర్మించుకొని దశలవారీగా బిల్లులు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. గ్రామంలో పర్యటించి ప్రజలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసర పరిశుభ్రతపై తీసుకోవాల్సిన చర్యలను, పంచాయతీ సెక్రెటరీ, ఆశ కార్యకర్తలకు వివరిస్తూ మీరు నిల్వ లేకుండా చూడాలని దోమల లార్వాలను సమూలంగా నిర్మూలించేందుకు ఆయిల్ బాల్స్ వేయడంతో పాటు, ఫాగింగ్ చేయించాలన్నారు. తదుపరి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిశీలించి సబ్ స్టేషన్ ద్వారా విద్యుత్ సరఫరా అయ్యే విధానాన్ని సంబంధిత విద్యుత్ అధికారులను అడిగి తెలుసుకున్నారు నిరంతరాయ విద్యుత్ అందించడానికి పటిష్ట చర్యలు తీసుకోవాలని సబ్ స్టేషన్‌లో సమస్యలు తలెత్తకుండా అందుబాటులో ఉంటూ విద్యుత్ సరఫరాను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దేవాదుల కాలువను పూర్తి చేయాలని రైతు సంఘం ధర్నా

- 20 సంవత్సరాలు గడిచినా పూర్తి కానీ దేవాదుల కాలువ
- 700 ఎకరాలకు నీరు అందక రైతుల ఇబ్బందులు



**చేర్యాల, ఆగస్టు 4 (జనంసాక్షి) :** జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం మీదుగా చేర్యాల మండలంలోని నాగపురి గ్రామ శివారులోని గండికుంట వరకు వచ్చిన దేవాదుల కాలువ పోతిరెడ్డిపల్లి బయ్యన్న చెరువు వరకు పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఏఐకేఎస్) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట గంట పాటు రైతులు ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ షేక్. రిజ్వాన్ పాషా కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జనగామ, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ఆది సాయన్న, కత్తుల భాస్కర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ.. బచ్చన్నపేట మండల శివారు నుండి ప్రారంభమైన దేవాదుల కాలువ చేర్యాల మండలం నాగపురి గ్రామ శివారులోని గండికుంట వద్దకు వచ్చి 2006 సంవత్సరంలో నిలిపివేశారని, పోతిరెడ్డిపల్లి గ్రామ బయ్యన్న చెరువు వరకు భూములు సర్వే చేసి రైతులకు డబ్బులు కూడ చెల్లించారని, కానీ నేటికి 20 సంవత్సరాలు గడిచినప్పటికీ కాలువ నిర్మాణ పనులు పూర్తి కాకపోవడం విచారకరమన్నారు. ఈ కాల్వ పోతిరెడ్డిపల్లి వరకు పూర్తి చేస్తే సుమారు 700 ఎకరాల భూములకు సాగునీరు అందడమే కాకుండా భూగర్భ జలాలు పెరిగి రైతుల భూములు సాగులోకి వచ్చి సస్యశ్యామలమవుతాయని అన్నారు. వెంటనే కాల్వ పనులు పూర్తి చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఏఐకేఎస్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి సొప్పరి సోమయ్య, జిల్లా నాయకుడు అందే అశోక్, వలబోజు నరసింహాచారి, రైతులు గూడూరి బాలరాజు, జింకల హరికృష్ణ, బట్టు భాస్కర్,కొక్కొండ రవీందర్, మాడబోయిన నరేష్, జోగు పరశురాములు, అప్పల బాలయ్య, కొక్కొండ పోశయ్య, పోరెడ్డి సత్యనారాయణ, పోరెడ్డి భాస్కర్, పోరెడ్డి అశోక్, అప్పల బాబు, కొక్కొండ మల్లేశం, కొక్కొండ పరమేష్, పాల కమలాకర్, కొక్కొండ భాస్కర్, కొక్కొండ రాజు,బోకూరు భాను ప్రకాశ్ రెడ్డి, కొక్కొండ నరేష్, జట్టి చందు, గర్నపల్లి రాజు, తదితరులు పాల్గొన్నారు.

## గద్దర్ స్మృతివనాన్ని నిర్మించాలి

- ప్రభుత్వ హామీని నిలబెట్టుకొవాలి
- అగస్టు 6న గద్దర్ రెండవ వర్ధంతి
- ప్రజా సంఘాల డిమాండ్



**సిద్దిపేట బ్యూరో, ఆగస్టు 4 (జనంసాక్షి) :** పీడిత ప్రజల విముక్తి కొసం పోరాడిన సాంస్కృతిక సేన ప్రజాయుద్ద నౌక గద్దర్ స్మృతి వనాన్ని నిర్మించి ప్రభుత్వం ఇచ్చిన హమిని నిలబెట్టుకొవాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేసాయి. ఆగస్టు 6 న హైదరబాద్ లో జరిగే గద్దర్ రెండవ వర్ధంతి పొస్టర్ ను సోమవారంనాడు సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేఖరుల సమావేశంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ మాట్లాడుతూ హైదరాబాదు లో గద్దర్ స్మారకంగా స్మృతి వనాన్ని నిర్మిస్తామని ముఖ్యమంత్రి హమి ఇచ్చి రెండు సంవత్సరాలు అవుతున్న నేటికి నిర్మించలేదన్నారు. గద్దర్ పౌండెషన్ కు 3 కోట్లు సహయం అందజేయడానికి ప్రభుత్వం జిఒ ఇచ్చిన నేటికి నిధులను విడుదల చేయలేదన్నారు. సొషల్ డెమొక్రటిక్ ఫ్రంట్ చైర్మన్ పొచబొయిన శ్రీ హరి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనతో పాటు అనేక ఉద్యమాలను నిర్మించిన గద్దర్ రెండవ వర్ధంతిని అగస్టు 6 నాడు మధ్యాహ్నం రెండు గంటల నుండి గద్దర్ పౌండెషన్ అధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభను సబ్బండ వర్గాలు జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.రంగాచారి, టిపిటిఎఫ్ రాష్ట్ర అసొసియేట్ అధ్యక్షుడు జి.తిరుపతి రెడ్డి,తెలంగాణ ప్రజా ఫ్రంట్ నాయకులు జి.సత్తయ్య,ఎస్సీ ఉద్యోగుల సంఘం నాయకులు ఆస లక్ష్మణ్, బొయ సంఘం నాయకులు బొయ రాములు,డిబిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి మెట్ల శంకర్,జిల్లా ప్రధాన కార్యదర్శి పొతరాజు శంకర్, సిసిసి ప్రవిణ్ ,యాదవ విద్యా వంతుల నాయకులు రాజు,రాము యాదవ్,లడ్డు యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశం సిద్దిపేట లో గద్దర్ విగ్రహ నిర్మాణ కమిటిని ఏర్పాటు చేశారు. కమిటి చైర్మన్‌గా పొచబొయిన శ్రీ హరి యాదవ్,వైస్ చైర్మన్‌గా ఆస లక్మణ్‌ను ఎన్నుకున్నారు. అన్ని సంఘాల, పార్టిల నాయకులు, మేధావులు రచయిత లు,కళాకారులతో కమిటి వేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రం లో గద్దర్ విగ్రహాన్ని ఏర్పాటు చెస్తామని కమిటి నేతలు ప్రకటించారు.

## పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి



**నారాయణఖేడ్, ఆగస్టు 4 (జనం సాక్షి) :** పేద ప్రజల అభివృద్ధి సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. సోమవారం సిర్గాపూర్ మండలంలోని గ్రామాలలో మంజూరైన నూతన రేషన్ కార్డులు లబ్ధిదారులకు అందజేశారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకున్న బేస్మెంట్ లెవెల్ బిల్లు ఒక్క లక్ష రూపాయల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన ప్రతి ఒక్కరు నిర్మించుకోవాలని అన్నారు. ఎమ్మార్వో హేమంత్, ఎంపీడీవో ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సీపీఎస్ రద్దు అయ్యేవరకు ఉద్యమం



**మక్తల్, ఆగస్టు 4 (జనంసాక్షి) :** కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) రద్దు అయ్యేవరకు తమ పోరాటం కొనసాగుతుందని పీఆర్టీయూ టీఎస్ నారాయణపేట జిల్లా అధ్యక్షులు వై. జనార్ధన్ రెడ్డి అన్నారు. పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా సోమవారం మక్తల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు (బాలుర, బాలికల), ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా జనార్ధన్ రెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షులు తిరుపతి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. సీపీఎస్ రద్దు ఉద్యమంలో భాగంగా సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద జరిగే మహాధర్నాకు ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. 317 జీవో వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి న్యాయం జరిగేలా ప్రయత్నిస్తామని, ఈహెచ్ఎస్, పీఆర్సీ అమలు కోసం కూడా పోరాడతామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జి. బాబు, అసోసియేట్ అధ్యక్షుడు ఆర్.కె. అశోక్, రాష్ట్ర అసోసియేట్లు కె. శ్రీనివాస్, పి. బాలరాజు, సీనియర్ ఉపాధ్యాయులు చంద్రశేఖర్, వరుణ్ కుమార్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల నిధులకు ఆడిట్

- పాల్గొన్న విద్యాశాఖ అధికారులు
- సమాచారం తెలిపిన ఆడిటర్ అధికారి వెంకటేష్



**మానవపాడు, ఆగస్టు 4 (జనం సాక్షి) :** ఎర్రవల్లి, ఇటిక్యాల మండలంలోని ప్రభుత్వ పాఠశాలల కు మరియు కస్తూరిబా గాంధీ పాఠశాల మరియు బీచుపల్లి గురుకుల మరియు ఇటిక్యాల గురుకుల పాఠశాలలకు మండల విద్యాశాఖ అధికారులు జె. అమీర్ భాష ఎర్రవల్లి మండలం, సి. వెంకటేశ్వర్లు ఇటిక్యాల మండలం సమక్షంలో రెండు మండలాలకు సంబంధించిన మండల విద్యాశాఖ కార్యాలయం కొండేరు నందు అన్ని పాఠశాలలకు పాఠశాల నిధులపై ఆడిట్ అధికారి వెంకటేష్ ఆడిట్ నిర్వహించడం జరిగినది అన్నారు. ఎర్రవల్లి మండలం నందు స్కూల్ మేనేజ్మెంట్ పాఠశాలలు 28 కస్తూర్బా గాంధీ పాఠశాల పీఎం శ్రీ బీచుపల్లి గురుకుల పాఠశాల నిర్వహించడం జరిగినది అని తెలిపారు. అలాగే ఇటిక్యాల మండలం నందు స్కూలు మేనేజ్మెంట్ పాఠశాలలు 22 పి ఎం శ్రీ గురుకుల ఇటిక్యాల పాఠశాల 1లకు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో రెండు మండలాల ప్రధానోపాధ్యాయులు, మరియు ప్రిన్సిపాల్స్, మండల విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది కాజా కోఆర్డినేటర్ పాల్గొనడం జరిగినది.

# రైతాంగ సాధికారతతోనే జాతీయ సమైక్యత బలోపేతం

- గీతం జాతీయ చర్చాగోష్ఠిలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



**పటాన్‌చెరు, ఆగస్టు 4 (జనంసాక్షి) :** గ్రామీణ ప్రజలు, భారత రైతాంగ సాధికారతతోనే జాతీయ సమైక్యత బలోపేతం అవుతుందని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ లోని రాజకీయ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల 'సర్దార్ వల్లభాయ్ పటేల్, రైతులు చంపారన్ నుంచి చిత్రకూట్ వరకు, జాతీయ చర్చాగోష్ఠిని సోమవారం ఆయన జ్యోతి ప్రజ్వలనలతో లాంఛనంగా ప్రారంభించారు. భారతీయ సామాజిక శాస్త్ర పరిశోధనా మండలి సహకారంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ, స్వాతంత్ర్యం తరువాత 562 సంస్థానాలను భారతదేశంలో విలీనం చేయడంలో సర్దార్ పటేల్ అద్భుతమైన పాత్రను వివరించారు. రైతు ఉద్యమాలకు పటేల్ చేసిన సేవలు అంతగా వెలుగులోకి రాలేదన్నారు. చారిత్రాత్మక బార్డోలి సత్యాగ్రహం1928లో పటేల్ నాయకత్వాన్ని, రైతులు, భూమిలేని కార్మికుల సాధికారత కోసం సర్దార్ పటేల్ చేసిన కృషిని గవర్నర్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. గ్రామీణ భారతదేశం జాతికి ఆత్మగా మిగిలిపోతుందని చెప్పారు. రైతులు, జాతీయ ఐక్యత పట్ల పటేల్ దృక్పథంపై ఈ చర్చాగోష్ఠిలో విలువైన చర్చలకు దారితీస్తుందని గవర్నర్ విశ్వాసం వ్యక్తం చేశారు. స్టాట్యూ ఆఫ్ యూనిటీ' యొక్క విశిష్టతను గుజరాత్ ప్రభుత్వ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఐఏఎస్ అధికారి డాక్టర్ సంజయ్ జోషి వివరించారు. ఐక్యతా స్ఫూర్తిని పొందడం కోసం గుజరాత్‌లో నెలకొల్పిన సర్దార్ పటేల్ స్మారక నివాళిని సందర్శించమని విద్యార్థులను జోషి ప్రోత్సహించారు. సామాజిక సమరస్థ మంచ్ జాతీయ కన్వీనర్ శ్రీ కె.శ్యామ్ ప్రసాద్ పటేల్ నాయకత్వం గురించి ప్రముఖంగా ప్రస్తావించడంతో పాటు, ఆయనపై రాజ్ మోహన్ గాంధీ రచించిన పుస్తక ప్రతులను వేదికపైనున్న ప్రముఖులకు బహూకరించారు. గుజరాత్ లోని సర్దార్ పటేల్ విశ్వవిద్యాలయం చరిత్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వసంత్ కుమార్ ఆర్.పటేల్, తెలంగాణలోని ములుగులోని సమ్మక్క సారక్క గిరిజన కేంద్ర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.ఎల్.శ్రీనివాస్‌బీ ఆంధ్రప్రదేశ్ కేంద్ర విశ్వవిద్యాలయం ఇంచార్జి రిజిస్ట్రార్ అండ్ డీన్ ప్రొఫెసర్ షీలా రెడ్డి హైదరాబాద్ విశ్వవిద్యాలయం సోషియాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ జి.నాగరాజు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వంశీ కృష్ణారెడ్డి, ఐసీఎస్ఎస్ఆర్ దక్షిణ ప్రాంత డైరెక్టర్ ప్రొఫెసర్ సుధాకర్ రెడ్డిబీ యూజీసీ మాజీ సభ్యుడు ప్రొఫెసర్ జి.గోపాల్ రెడ్డి తదితరులున్నారు. సర్దార్ పటేల్ రైతుల పట్ల చూపిన దార్శనికత, భారతదేశ గ్రామీణ, వ్యవసాయ పరివర్తనకు దాని ఔచిత్యంతో పాటు జాతీయ ఐక్యతను పెంపొందించడంలో దాని సహకారంపై చర్చించడానికి విద్యావేత్తలు, సామాజికవేత్తలు, పరిశోధకులకు ఈ సెమినార్ ఒక వేదికను అందిస్తోంది.



# అర్జీదారుల సమస్యలను వెంటనే పరిష్కరించండి

**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** అర్జీదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి లో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి అర్జీలను జిల్లా కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి లు స్వీకరించారు. ప్రజా ఫిర్యాదులలో ఫిర్యాదులను స్వీకరించి సంబంధిత శాఖలకు ఇస్తూ తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అర్జీలు పెన్షన్, ఇందిరమ్మ ఇళ్లు, రహదారులు, విద్య, వైద్యం, మున్సిపాలిటీ, డీడబ్ల్యూవో, రెవెన్యూ తదితర దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ స్రవంతి, ఆయా శాఖల జిల్లా అధికారులు, రెవెన్యు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ బ్యూరో, ఆగస్టు 04 (జనంసాక్షి) :** ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును పరిశీలించి తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ, వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో బేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. కాలానుగుణ వ్యాధులు నియంత్రించేందుకు పకడ్బందీ ప్రణాళికలను అమలు చేయాలని అన్నారు. జిల్లాలో ఇప్పటికే మూడుసార్లు జ్వర సర్వే పూర్తి చేసినట్లు తెలిపారు. పెంబి మండలానికి జాతీయస్థాయిలోనే ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమంలో కాంస్య పతకం రావడం ఎంతో సంతోషకరమైన విషయమని అన్నారు. అధికారుల సమిష్టి కృషితో ఈ విజయం సాధ్యమైందని అన్నారు. పెంబి ఆస్పిరేషన్ బ్లాక్ జాతీయస్థాయిలో మంచి స్థానంలో నిలవడం లో ఫ్రంట్ లైన్ వర్కర్స్ కృషి గర్వించదగ్గదని అన్నారు. గవర్నర్ చేతుల మీదుగా కాంస్య పతకాన్ని స్వీకరించినందుకు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ లను జిల్లా అధికారుల సంఘం తరపున సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలు పెద్ద ఎత్తున అవయవదానానికి ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లాకు చెందిన వైద్య, ఆరోగ్యశాఖ రిటైర్డ్ ఉద్యోగి జొన్న వినోద్ కుమార్ దంపతులు మరణానంతరం వారి దేహాలను నిర్మల్ వైద్య కళాశాలకు విద్యార్థుల శిక్షణ కొరకు దానం చేయనున్నట్లు తెలిపారు. అవయవదానంతో ఎంతోమంది జీవితాలలో మరణానంతరం కూడా వెలుగును నింపవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా దేహాన్ని దానం చేయడానికి ముందుకు వచ్చిన వినోద్ కుమార్ దంపతులను కలెక్టర్ అభినందించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**స్టేషన్ ఘన్పూర్, ఆగస్టు 04 (జనంసాక్షి) :** ఆసుపత్రుల్లో పనిచేసే వైద్యులు పేద ప్రజలకు మెరుగై న వైద్య సేవలందించాలని మాజీ ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలో నూతనంగా ఏర్పాటుచేసిన సింధూర హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా కడియం శ్రీహరి హాజరై హాస్పిటల్ ను ప్రారంభించా రు. ఈ సందర్భంగా హాస్పిటల్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. పేద ప్రజలకు అందుబాటు లో ఉంటూ మెరుగైన వైద్యసేవలు అందించాలని హాస్పిటల్ వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ దుగ్గినాల ప్రశాంత్ మాట్లాడు తూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పేద ప్రజలకు తక్కువ ఖర్చుతో అన్ని విధాల వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఆస్పత్రిని ప్రారంభించడం జరిగిందని అన్నా రు. రెండు నెలల పాటు ఉచిత ఓపి చూడబడనని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఘన పూర్ మార్కెట్ చైర్మన్ జూలుకుంట్ల లావణ్య శిరీష్ రెడ్డి, డాక్టర్ సింగపురం సింధూర, డాక్టర్ సుధాకర్, డాక్టర్ దామోదర చారి, డాక్టర్ శంకర్ నాయక్, డాక్టర్ హేమ వర్షిని, డాక్టర్ శ్రీప్రియా, నాయకులు సింగపురం జగన్, చింతకుంట్ల నరేందర్ రెడ్డి, బెలిదే వెంకన్న, నీల గట్టయ్య, బూర్ల శంకర్, పోగుల సారంగపాణి, రాజేష్ నాయక్, బొమ్మిశెట్టి బాలరాజు, పోలేపల్లి రంజిత్ రెడ్డి, రజాక్ యాదవ్, అయోధ్య, గుజ్జరి రాజు, గద్దమీది వెంకటస్వామి, డాక్టర్ జైహింద్ రాజ్, గట్టు రమేష్, గట్టు మనోహర్, ప్రభాకర్, శ్రీనివాస్, రామకృష్ణ, రాజు, వెంకటేష్,నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిలో రాజకీయ జోక్యం తగ్గాలి

- తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామెర గట్టయ్య



**భూపాలపల్లి, ఆగస్ట్ 4 (జనంసాక్షి):** సింగరేణిలో రాజకీయ జోక్యం తగ్గాలని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామెర గట్టయ్య అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసి సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడారు. గత కార్మిక సంఘం కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నదన్నారు. భూపాలపల్లి ఏరియాలో సింగరేణి గుర్తింపు సంఘంగా ఐఎన్‌టియుసి కార్మిక సంఘాన్ని కార్మికులు ఎంతో ఆశతో గెలిపిస్తే ఐఎన్‌టియుసి కార్మిక సంఘం నాయకులు కింది స్థాయి అధికారులను కార్మికులను కొంతమంది నాయకులు కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ యాజమాన్యానికి తొత్తులుగా వ్యవహరిస్తూ ఉచిత మాస్టర్ల కు అలవాటు పడి కార్మికుల ఫోటోలు తీసి కార్మికులను బ్లాక్మెయిల్ చేస్తూ యాజమాన్యానికి పంపిస్తూ అదే విధంగా కంపెనీకి అధికారులకు ఇన్ ఫార్మర్లుగా వ్యవహరిస్తున్నారని, కార్మికులు గనులలో ఎదుర్కొంటున్న సమస్యలు గాలి లేక త్రాగునీరు లేక సరి అయిన పనిముట్లు లేక కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు గెలిచిన సంఘం నాయకులకు సమస్యలు చెప్పుకుంటే ఆ సమస్యల యాజమాన్యంతో మాట్లాడి పరిష్కరించకపోగా కార్మికులపైన తిరగబడుతూ గుండాల్లాగా బెదిరింపుల పాల్పడుతున్నారన్నారు. తమకు ఎమ్మెల్యే అండదండలు ఉన్నాయంటూ విరవీగుతున్నారన్నారు. ఇలాంటి కొంతమంది స్వార్థపరుల మూలంగా ఎమ్మెల్యేకు కాంగ్రెస్ పార్టీకి ఐఎన్‌టియుసి కార్మిక సంఘం కార్మిక వర్గంలో ఉనికి కోల్పోతున్నదని, ఇప్పటికైనా ఎమ్మెల్యే అదే విధంగా ఐఎన్టియుసి యూనియన్‌పై నాయకత్వం కార్మిక వ్యతిరేక నాయకులపైన తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రశ్నిస్తున్న కార్మికులకు యాజమాన్యంతో కుమ్మక్కై షరిసిట్లు సస్పెండ్, లెటర్‌లు ఇపిస్తున్నారని, ఇలాంటి పద్ధతులు మానుకోకపోతే వీరికి రాబోయే రోజులలో కార్మిక వర్గం తగు గుణపాఠం చెప్తారని అన్నారు . ఈ కార్యక్రమంలో టీఎస్ యుఎస్ కార్మిక సంఘం నాయకులు దాసరి జనార్ధన్, నామల శ్రీనివాస్, రాళ్ల బండి బాబు, జయశంకర్, కే నరసింహారెడ్డి, ఎస్ కే సాజిద్, ఎండి సలీం ,సిహెచ్ లక్ష్మీనారాయణ, కే మధుకర్ తదితరులు పాల్గొన్నారు.



# సమర్థవంతమైన వైద్యసేవలు అందించాలి

- వైద్యులు విధులకు అలసత్వం వహిస్తే చర్యలు
- రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్టు డైరెక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి

**మహదేవపూర్, ఆగస్టు 4 (జనంసాక్షి):** వైద్యులు సమర్థవంతమైన వైద్యసేవలు అందించాలని రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్టు డైరెక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం మహదేవపూర్ సామాజిక వైద్యశాలలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రఎయిడ్స్ కంట్రోల్ డైరెక్టర్ సామాజిక వైద్యశాలలో రికార్డులను తనిఖీ చేసి రోగులకు అందిస్తున్న వైద్య సేవల తీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ల్యాబ్ అవుట్ పేషెంట్ విభాగాలు ఇంటర్నేషనల్ వార్డులు మందుల నిల్వ స్టోర్లను తనిఖీ చేశారు. వైద్యులు విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని అన్నారు. అలాగే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బంది సమయం పాలన పాటించాలని వైద్యులకు సూచించారు. అదేవిధంగా ప్రభుత్వం వైద్య సేవలపై చాలా పోకస్ చేస్తుందని విధులు నిర్వహణ అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వైద్యులు ఆసుపత్రికి వచ్చిన రోగులకు సమర్థవంతమైన వైద్య సేవలు అందించాలని, ప్రభుత్వ వైద్యశాలకు వచ్చిన రోగులకు వైద్యులు అందుబాటులో ఉండి సమర్థవంతమైన వైద్య సేవలు అందించాలని మాసం వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు.అలాగే పారిశుధ్యం మందుల లభ్యత సిబ్బంది హాజరు తప్పనిసరిగా నిరంతరం కొనసాగాలని ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఆయన ప్రత్యేకంగా వైద్యులను ఆదేశించారు. అనంతరం రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ. అదనపు కలెక్టర్ విజయలక్ష్మి. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఉపాసంచాలకులు నాగరాజు. ఇన్చార్జి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీదేవి. ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ఉమాదేవి. పాల్గొన్నారు.

# క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి

- ఆటల పోటీలు ప్రారంభించిన జిల్లా జడ్జి వీరయ్య



**మంచిర్యాల ప్రతినిధి, ఆగస్ట్ 4 (జనంసాక్షి) :** నేడు మనిషి బిజీ జీవితంలో క్రీడలు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని మంచిర్యాల జిల్లా జడ్జి వీరయ్య పేర్కొన్నారు. సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని అడ్వకేట్ బార్ అసోసియేషన్‌లో జిల్లా జడ్జి వీరయ్య ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అడ్వకేట్స్ ఎప్పుడు మీరు నిరంతరం కేసుల బిజీలో ఉంటూ మీయొక్క మానసిక ఉల్లాసాన్ని కోల్పోతున్నారు. ఈ ఆటల పోటీలు అనేవి మానసిక వికాసాన్ని పెంపొందించే విధంగా ఉంటాయి .కాబట్టి గెలుపు ఓటములు అన్నిటి సహజమే కానీ మంచి ఓర్పుతో ఆటలు ఆడాలని కోరారు. ఈ ఆటల పోటీలు ప్రారంభించే కార్యక్రమంలో జడ్జీలు శ్రీనివాస నాయక్, రామ్మోహన్, నిర్మల, కవిత జడ్జిలు పాల్గొన్నారు. అడ్వకేట్స్ రంగు వేణు, మురళీకృష్ణ, గడ్డం శ్రీనివాస్, వేల్పుల సతీష్, ఆకుల రవీందర్, తులా ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

# వైహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడుగా దేవరాయ సాయిలు



**పాలకుర్తి, ఆగస్టు 4 (జనంసాక్షి) :** ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడుగా జనగాం జిల్లా, పాలకుర్తి మండలం, మల్లంపల్లి గ్రామానికి చెందిన దేవరాయ సాయిలు ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. ఆది వారం హైదరాబాద్లో ఆసంఘం 29వ అవిర్భావ సభ జరిగింది. నూతన అధ్యక్షుడుగా తనను నియమించిన ఆ సంఘం వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు వలిగి ప్రభాకర్కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడారు. ఎరుకల హక్కుల సాధన కోసం పోరాడేందుకు వెనుకాడేది లేదన్నారు. ట్యాంక్ బండిపై ఏకలవ్య విగ్రహం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన అందరికి ప్రత్యేక కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు.




# అంబేద్కర్ సేవారత్న అవార్డు అందుకున్న గబ్బెట సుధాకర్

**స్టేషన్ ఘన్పూర్, ఆగస్టు 03 (జనం సాక్షి) :** విద్యుత్ శాఖలో లైన్మెన్ గా విధులు నిర్వహిస్తు స్టేషన్ ఘనపూర్ పట్టణంలో నివాసం ఉంటున్న గబ్బెట సుధాకర్ అంబేద్కర్ సేవారత్న అవార్డు అందుకున్నా రు. లైన్మెన్ గబ్బెట సుధాకర్ ఇటు విధుల్లో చురుకుగా పని చేస్తూ అటు పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొని ఎన్నో కార్యక్రమాలు సజావుగా నిర్వహిస్తున్నందుకు గుర్తించిన లలిత కళా సమాఖ్య సేవాసామాజిక సౌంస్థ వారు ఆదివారం హైదరాబాద్ లోని త్యాగరాయ గాన సభ వేదిక మీద అంబేద్కర్ సేవారత్న అవార్డును అందజేసి ఘనంగా లైన్మెన్ సుధాకర్ ను ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ తాను చేపట్టిన సేవాకార్యక్రమాలకు ఇంతటి గుర్తింపు వస్తుందని అనుకోలేదన్నారు. ఇప్పటినుండి రెట్టింపు ఉత్సాహంతో ముందుకు వెళతానని తనను గుర్తించి అవార్డు అందజేసిన లలిత కళా సమాఖ్య నిర్వాహకులకు, వెన్నంటే ఉంటూ తనను ఆదరించిన గురువులకు, స్నేహితులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజావాణిలో తాడిచర్ల భూనిర్వాసితుల వినతి

- డేంజర్ జోన్ ఇండ్లు సేకరించి సురక్షిత ప్రాంతాలకు తరలించండి
- ఇండ్లు సేకరించకుంటే రిలే దీక్షలు చేపడుతాం



**మల్హర్, ఆగస్టు 04(జనం సాక్షి) :** మండల కేంద్రమైన తాడిచర్ల లోని టిజి జెన్కో ఓసిపి బ్లాక్ 1 కు 500 మీటర్ల డేంజర్ జోన్ లో ఉన్న ఇండ్లను సేకరించి సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని సోమవారం భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ కు తాడిచర్ల భూ నిర్వాసితులు తాండ్ర మల్లేష్, కేసారపు నరేష్ లు ప్రజావాణి లో వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. జెన్కో యాజమాన్యం తమ సారవంతమైన భూములను 2008 లో పిఎన్ చేసి తమ భూములతో పాటు ఓసిపి డేంజర్ జోన్ లో అప్పుడు ఉన్న 1080 గృహాలు సేకరిస్తామని ఇండ్లకు నంబర్లు వేసి 2013 లో తమ భూములను సేకరించి కేవలం 49 ఇండ్లను మాత్రమే సేకరించారని తెలిపారు. గత ఎనిమిదేళ్ళుగా తమ ఇండ్లకు పరిహారం ఇవ్వకుండా టిఎస్ జెన్కో అధికారులు మోసం చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎనిమిదేళ్ళుగా ఓసిపి నుంచి వెలువడే దుమ్ము ధూళి, వివిధ విషవాయువలతో అనేక ఆరోగ్య సమస్యలకు గురై రోగాల బారిన పడుతున్నామని తెలిపారు. 2022 లో ఇట్టి ఇండ్లను సేకరించేందుకు టిఎస్ జెన్కో అధికారులు మరోసారి ఇండ్లను సర్వే చేసి సుమారు 2500 ఇండ్లకు నంబర్లు వేసి ప్రిలిమినరి నోటిఫికేషన్ జారీ చేశారన్నారు. 2008 లో నంబర్లు వేసినప్పుడు కేవలం 1080ఉన్న గృహాలు దాదాపు 15 ఏళ్లుగా కాలయాపన చేయడం మూలంగా కుటుంబాలు వృద్ధి చెందడంతో పిల్లలు పెళ్లిళ్లు చేసుకుని కుటుంబ పోషణలో భాగంగా వేరే ఇండ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. దాని వలన 40 శాతం ఇండ్లు పెరగడంతో మరో పదిహేను వందల ఇండ్లు పెరిగినట్లు తెలిపారు. ఇట్టి విషయాన్ని దృష్టిలో పెట్టుకుని తమ తాడిచర్ల లోని స్థానికంగా ఉన్న వారి ఇండ్లను సేకరించి డేంజర్ జోన్ నుండి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సత్వరమే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో డేంజర్ జోన్ ప్రజలతో పెద్ద ఎత్తున సెప్టెంబర్ నుండి మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరవధిక రిలే నిరహర దీక్షలు చేపడతామని హెచ్చరించారు.

# తాగునీరు కలుషితంపై స్పందించిన అధికారులు

- తాగునీరు కలుషితం ఇలా.. మరి తాగేది ఎలా....! అనే కథనానికి స్పందన
- సమస్యను పరిష్కరించిన పంచాయతీరాజ్ అధికారులు






**మంగపేట, ఆగస్ట్ 04(జనంసాక్షి) :** మంగపేట మండల కేంద్రంలోని పొదుమూరు గ్రామానికి పైప్ లైన్ ద్వారా వెళ్లవలసిన త్రాగునీరు గేట్ వాల్ లీకేజీ కారణంగా పూర్తిగా కలుషితమవుతున్న అధికారులు నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్న తీరును గ్రామస్తుల ఆవేదనను అధికారుల దృష్టికి తీసుకు వెళ్లే విధంగా ఆదివారం జనంసాక్షి దినపత్రికలో ' త్రాగునీరు కలుషితం ఇలా.. మరి తాగేది ఎలా....! అనే వార్తను ప్రచురించగా వెంటనే స్పందించిన పంచాయతీరాజ్ అధికారులు సోమవారం గేట్ వాల్ లీకేజీకి మరమ్మతులు పూర్తిచేసి గొయ్యిని ఇసుకతో పూర్తిగా నింపేశారు. ఈ విషయంపై జనంసాక్షి దినపత్రిక తీరును పొదుమురు గ్రామస్తులు సంతోషిస్తూ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపే విధంగా చేసిన తీరును వారు అభినందించారు. ఇలాంటి సమస్యలపై జనంసాక్షి ఎప్పుడు కూడా ప్రజల పక్షానే పోరాడుతూ ప్రజలకు అండగా నిలుస్తుందని వారన్నారు. అలాగే వెంటనే స్పందించి పైప్ లైన్ ద్వారా కలుషితమై వచ్చే త్రాగునీరే దిక్కుగా ఉన్న త్రాగునీటిని గేట్ వాల్ లీకేజీ సమస్యను పరిష్కరించి తమ ఆవేదనను అర్థం చేసుకున్న టువంటి పంచాయతీరాజ్ అధికారులకు, మండల పంచాయతీ కార్యదర్శి సురేష్‌కు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు పోరాటం



**ఖానాపూర్ ఆగస్టు 04 (జనం సాక్షి) :** సార్వత్రిక ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు ప్రజల పక్షాన బి.ఆర్.ఎస్ పార్టీ పోరాటం కొనసాగుతూనే ఉంటుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి భూక్య ఝాన్సన్ నాయక్ ఉద్ఘాటించారు. సోమవారం బి ఆర్ ఎస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. జనహిత పాదయాత్ర పేరుతో ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కేందుకే ప్రణాళిక బద్ధంగా కాంగ్రెస్ పార్టీ పాదయాత్ర చేస్తుందని అన్నారు. ప్రజల సమస్యలను పట్టించుకోని పాదయాత్రలు ఎందుకు చేస్తున్నారని సూటిగా ప్రశ్నించారు. ఏ ఒక్కరికైనా 100 శాతం రుణమాఫీ జరిగిందేమో చూపించాలని ఆయన సవాలు విసిరారు. 50 శాతానికి మించి రుణమాఫీ జరగలేదని ఇచ్చిన ఆరు గ్యారంటీలలో అసంపూర్తిగా ఆరంభించి వదిలి పెట్టారని ఆయన అన్నారు. కాంగ్రెస్ పాలకులు పాదయాత్రలపై దృష్టి సారించడం మాని ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలు నెరవేర్చుటపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీపీ మోయిద్, మాజీ వైస్ ఎంపీపీ వాల్ సింగ్, నాయకులు గౌరీకర్ రాజు, కొక్కుల ప్రదీప్, పుప్పాల గజేందర్, తదితరులు ఉన్నారు.

# ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురైన విద్యార్థినులు

- హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు
- సకాలంలో వైద్య సేవలు అందించడంతో కోలుకున్న విద్యార్థులు
- హాస్టల్ వార్డెన్ వర్కర్లపై ఆగ్రహ వ్యక్తం చేసిన ఎమ్మెల్యే మట్టా రాగమయి



**కల్లూరు, ఆగస్టు 4 (జనం సాక్షి) :** రెవెన్యూ డివిజన్ కేంద్రం కల్లూరులోని ఎన్ఎస్పి క్యాంపస్ ఆవరణలో గల గిరిజన బాలికల ఆశ్రమపాఠశాలలో పలువురు విద్యార్థినిలు ఫుడ్ పాయిజన్ తో అస్వస్థతకు గురైన సంఘటన సోమవారం జరిగింది. గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల విద్యార్థులకు రోజువారి మెనూలో భాగంగా అల్పాహారం కింద సోమవారం కిచిడీ పెట్టడంతో తిన్న విద్యార్థులకు కొంత సమయం గడిచిన తర్వాత ఆయాసం వాంతులు, కడుపునొప్పి, తో ఇబ్బంది పడటంతో గమనించిన హాస్టల్ వార్డెన్ ఉపాధ్యాయులు ప్రభుత్వ ఆసుపత్రికి సమాచారం ఇచ్చి సుమారు 15 మందిని ప్రభుత్వాసుపత్రికి తీసుకొని వెళ్లారు. ఈ విషయం కాంగ్రెస్ నాయకులు సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి దయానంద్ కి సమాచారం ఇవ్వటంతో వెంటనే కాంగ్రెస్ కార్యకర్తలకు నాయకులకు ఆసుపత్రికి, హాస్టల్ కి వెళ్లి విద్యార్థుల పరిస్థితి తెలుసుకోమని ఆదేశించారు. కాంగ్రెస్ నాయకులు ఆసుపత్రికి చేరుకొని అస్వస్థకు గురైన విద్యార్థులను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకుని వైద్యులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తదుపరిహాస్టల్ కుచేరుకునేసరికి మరి కొంతమంది విద్యార్థులు కడుపునొప్పి, వాంతులు విరోచనాలతో బాధపడుతుంటే కాంగ్రెస్ పార్టీ శ్రేణులు స్పందించి తమ సొంత వాహనాల్లో విద్యార్థుల్ని ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటన విషయం తెలుసుకున్న కల్లూరు రెవిన్యూ డివిజన్ సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ ఆస్పత్రికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు .తాసిల్దార్ ఎంపీడీవోలను అప్రమత్తం చేసి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది జరగకుండా వైద్య సేవలు అందే విధంగా చూడాలని ఆదేశించారు. ఎమ్మెల్యే చొరవ తీసుకోవడంతో విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం లేకుండా కాపాడుకోగలిగారు. మొత్తం హాస్టల్లో 90 మంది విద్యార్థులు ఉండగా సుమారు 40 మంది విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ జరిగి అనారోగ్యం పాలయ్యారు. ఎమ్మెల్యే మట్టరాగమై హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని విద్యార్థులను స్వయంగా డాక్టర్ అయిన ఎమ్మెల్యే స్టెతస్కోప్ పట్టుకొని విద్యార్థులను పరీక్షించి స్వయంగా సిరప్పులు తాగించి వైద్య సేవలు అందించారు. ప్రభుత్వ వైద్యులు నవ్య కాంత్, రమేష్ తో పాటు ప్రైవేటు వైద్యులు కృష్ణ చైతన్య, వైద్య సిబ్బంది సకాలంలో స్పందించి విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించారు .ఎలాంటి ప్రమాదం లేకుండా కాపాడుకోగలిగారు. అనంతరం ఎమ్మెల్యే గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల, హాస్టల్ను సందర్శించారు. అక్కడిపరిసరాలను పరిశీలించారు. విద్యార్థుల కొరకు తయారుచేసిన భోజనం, కూరలు సాంబారు ని పరిశీలించారు. సాంబార్ చూసి ఇది సాంబార్ నీళ్లొచార అనే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే సందర్భంలో పాఠశాలలోని విద్యార్థులు పలువురు ఆహారం నాణ్యతగా పెట్టటం లేదని, నాసిరకంగా, కూరలు సాంబార్ తయారు చేస్తున్నా రని, ఒక లీటర్ పాలతో సేమ్యా తయారుచేసి పల్చగా అందిస్తున్నారని, ఏదైనా అడిగితే పట్టించుకోకుండా బెదిరిస్తున్నారని ఎమ్మెల్యే ముందు విద్యార్థులు వాపోయారు. గత వారం రోజుల నుండి అన్నంలో పురుగులు వస్తున్నాయని అన్నం మొత్తం గుజ్జుగా ఉంటుందని తక్కువ మందికే వంట చేస్తున్నారని ఇదేమిటి అని అడిగితే ఇంటిదగ్గర ఇంతకంటే మీరు బాగా తింటారా ఎక్కువ మాట్లాడితే ఇంటికి పంపించేస్తామని బెదిరిస్తున్నారు అనిహాస్టల్ లో కూడా శుభ్రత లేదని తదితర సమస్యలు ఎమ్మెల్యేకి దృష్టికి తీసుకెళ్లారు. అంతకుముందు అక్కడ ఉండిన ఆహారం చూసిన ఎమ్మెల్యే విద్యార్థులు చెప్పేదానికి ఒకే రకంగా ఉండటంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేస్తూ మీ ఇల్లు దగ్గర అయితే ఇంతే వండుకొని తింటారా ప్రభుత్వం అన్ని విధాలుగా సదుపాయాలు కల్పిస్తున్న మీలాంటివారు ఉండబట్టే ఇలాంటి అప్రతిష్ట జరుగుతుందని వార్డెన్ వర్కర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి దీనికి సంబంధించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు ఫుడ్ పాయిజన్ తో అస్వస్థకు గురైన సంఘటన జరిగిన వెంటనే తాహ సిల్దార్ పు లి సాంబశివుడు , ఎండిఓ డి చంద్రశేఖర్ హాస్టల్కు చేరుకొని విద్యార్థుల పరిస్థితి గమనించి ఆసుపత్రికి తరలించడంలో సేవలు అందించారు. ఏఎంసీ చైర్మన్ భాగం నిరజా ప్రభాకర్ చౌదరి, సీనియర్ నాయకులు పసుమర్తి చంద్రావు భాగం ప్రభాకర్ చౌదరి ఆలకుంట నరసింహారావు, ఏనుగు సత్యం బాబు, నోటి కృష్ణా రెడ్డి, పలువురు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు,కార్యకర్తలు విద్యార్థులను సకాలంలో ఆసుపత్రిలో చేర్పించి వాళ్లని ఆపదనుండి కాపాడారు. విద్యార్థులకు సకాలంలో వైద్య సేవలు అందించేందుకు సహకరించిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు. ప్రభుత్వ వైద్యులకు ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానందుకు విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజావాణి అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, ఆగస్టు 4 (జనంసాక్షి) :** అల్బండజోల్ టాబ్లెట్ తీసుకోవటం ద్వారా పిల్లల్లో నులిపురుగులను నివారించవచ్చని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులి పురుగులు శరీరంలోకి ప్రవేశించి పిల్లలలో బలహీనత, రక్తహీనత, ఆకలి లేకపోవడం వంటి సమస్యలకు లోనవుతారని అన్నారు. ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఆగస్టు 11న జాతీయ డీవార్మింగ్ డే నిర్వహిస్తుందని తెలిపారు. డిఈఓ, డిఎంహెచ్ఓ, డిడబ్ల్యూఓ, రెసిడెన్సీయల్ కో ఆర్డినేటర్లు సమన్వయం చేసుకుంటూ ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, హాస్టల్ వార్డెన్స్ ద్వారా సమావేశం నిర్వహించి అంగన్వాడీ కేంద్రాలలో, ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో, రెసిడెన్సీయల్ హాస్టల్లో ఉన్న ప్రతి విద్యార్థికి వైద్య సిబ్బంది ద్వారా అల్బండజోల్ టాబ్లెట్లు అందించాలని ఆదేశించారు. నిరుద్యోగ యువత ప్రైవేట్ రంగంలో ఉద్యోగ సమాచారం కొరకు డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్చేంజ్ ఆఫ్ తెలంగాణ అనే ఆన్ లైన్ పోర్టల్ ద్వారా తెలుసుకోవచ్చని అన్నారు. అనంతరం పోర్టల్ ను ఆవిష్కరించారు. జిల్లా అధికారులు తమ శాఖ అభివృద్ధి పనులపై, తమకి కేటాయించిన హాస్టల్స్, పాఠశాలలను తరువుగా క్షేత్రస్థాయిలో పరిశీలించి తమకి నివేదిక అందజేయాలని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో, జిల్లా స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు అధిక ప్రాధాన్యతనిస్తూ ప్రజా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భూ సమస్యలకు సంబంధించి 57 ధరఖాస్తులు, ఎంపిడిఓలకు 12 దఖాస్తులు,మున్సిపల్ కమిషనర్లకు 7 దరఖాస్తులు,జిల్లా పంచాయతీ అధికారికి 6 దరఖాస్తులు మిగిలిన 17 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవి వచ్చాయని, మొత్తం99 దరఖాస్తులు వచ్చాయని వాటిని పరిష్కరించుట కొరకు సంబంధిత అధికారులకి పంపించటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎఫ్ఓ సతీష్ కుమార్, డిఆర్డిఏ పిడి వివి అప్పారావు, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ పెట్రోలింగ్ తనిఖీలు నిరంతరం చేయాలి

- 101 ఫోన్లను బాధితులకు అందించిన జిల్లా ఎస్పీ కె.నరసింహ



**సూర్యాపేట ప్రతినిధి, ఆగస్టు 4 (జనంసాక్షి) :** పోలీస్ స్టేషన్ తనిఖీలో భాగంగా సోమవారం జిల్లా ఎస్పీ నరసింహ సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేశారు. సిబ్బంది పరేడ్ ను పరిశీలించారు. పరికరాలను పరిశీలించి సిబ్బందితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్ రికార్డ్స్, పరిసరాలు పరిశీలించి తనిఖీ చేసి పోలీస్ స్టేషన్ మ్యాప్ ను, గ్రామాల హద్దులను, కేసు ఫైల్స్ ను, కోర్టు వ్యవహారాలు, రిసెప్షన్, కేసుల్లో సీజ్ చేసిన వాహనాలు పరిశీలించారు. ఎన్ఫోర్స్మెంట్ గురించి సమీక్షించారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలు దృష్టిలో ఉంచుకుని పని చేయాలని, రౌడి షిటర్స్, సస్పెక్ట్ పై, సమస్యలు సృష్టించే అవకాశం ఉన్న వ్యక్తులపై నిఘా ఉంచాలన్నారు. స్టేషన్ పరిధిలో గ్రామాలు, కాలనీలు, పట్టణాల్లో పెట్రోలింగ్, తనిఖీలు నిరంతరంగా చేయాలని ఆదేశించారు. పెండింగ్ ఉండకుండా ప్రణాళిక ప్రకారం పని చేయాలని అన్నారు. ప్రజా పిర్యాదులకు ప్రాధాన్యం ఇవ్వాలని,మహిళా కేసుల్లో ప్రణాళిక ప్రకారం పని చేయాలని,ప్రతి విషయమును రికార్డ్ లో నమోదు చేయాలని, పోలీస్ స్టేషన్ కు వచ్చే వారిని మర్యాద పూర్వకముగా చూసి, వారి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐ రాజశేఖర్, ఎస్ఐ బాలు నాయక్, డీసీఆర్ బీ ఎస్ఐ యాకూబ్, సిబ్బంది అంజన్ రెడ్డి, శేఖర్ రెడ్డి, ఎస్పి సీసీ సందీప్ పాల్గొన్నారు. 101 ఫోన్లను బాధితులకు అందించిన ఎస్పీ నరసింహ...లి ప్రజలు వివిధ రూపాల్లో పోగొట్టుకున్న ఫోన్స్ ను జిల్లా పోలీసులు పటిష్టంగా పని చేసి 101 ఫోన్స్ ను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సెల్ ఫోన్ రికవరీ మేళా ఏర్పాటు చేసి సుమారు 20 లక్షల రూపాయల విలువ గల 101 ఫోన్ల ను జిల్లా ఎస్పీ నరసింహ బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొబైల్ చోరికి గురైనా, పోగొట్టుకున్నా అందులో ఉన్న సమాచారం పోతుంది కావున మొబైల్ వినియోగదారులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రికవరీ చేసి బాధితులకు అప్పగించడంలో కృషి చేస్తున్న ఐటి కోర్ సిబ్బందిని, పోలీస్ స్టేషన్ సిబ్బందిని అభినందించారు. ఇతర రాష్ట్రాల నుండి కూడా ఫోన్స్ రికవరీ చేయడం జరిగిందన్నారు.

## విద్యార్థినుల అస్వస్థతపై మాజీ ఎంపీ నామా ఆరా..



**కల్లూరు, ఆగస్టు 4 (జనం సాక్షి) :** ఖమ్మం జిల్లా కల్లూరు మండలంలో ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాలలో పలువురు బాలికలు సోమవారం ఉదయం అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటనపై బిఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఆరా తీశారు. విద్యార్థినులు ప్రస్తుతం కల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, వారి ఆరోగ్య పరిస్థితి పై అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవసరమైతే మెరుగైన వైద్యం కోసం వారిని జిల్లా కేంద్రానికి తీసుకువెళ్ళి వైద్యం అందించాలన్నారు. గత పదిహేడవ లోక్ సభ సమయంలో తన నిధులు నుండి కేటాయించిన అంబులెన్సు స్థానిక కల్లూరు ప్రభుత్వ హాస్పిటల్లో నే అందుబాటులో ఉందని గుర్తు చేశారు. ఇటువంటి ఘటనలు జరిగిన ప్రతిసారీ ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుంటున్నట్టు చెబుతూనే, సమస్యల మూలాలను పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఆశ్రమ పాఠశాలలు గిరిజన పిల్లలకు విద్య అందించే ముఖ్య కేంద్రాల్లో సరైన పర్యవేక్షణ లేకపోవడం ఆందోళన కలిగిస్తుందన్నారు. విద్యార్థుల ఆహార నాణ్యత, పరిసరాల శుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల రాష్ట్రంలో జరుగుతున్న వరుస సంఘటనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం ఆశ్రమ పాఠశాలల నిర్వహణపై సమగ్ర సమీక్ష చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థినులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, వారి తల్లిదండ్రులకు ధైర్యం చెప్పాలని స్థానిక బిఆర్ఎస్ నాయకులతో పాటు అధికారులను కోరారు. ఈ ఘటనపై నిష్పాక్షికంగా విచారణ జరిపి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని నామ పేర్కొన్నారు.

## సర్కారు దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, ఆగస్టు 4 (జనం సాక్షి) :** జిల్లాలోనీ సర్కారు దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ నగర్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కలెక్టర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అర్బన్ పీ హెచ్ సీ లో సిబ్బంది హాజరు, ఓపీ, మందుల రిజిస్టర్, వ్యాక్సిన్ గది, మందులు ఇచ్చే గదిని, అందుబాటులో ఉన్న మందులను పరిశీలించారు. దవాఖానలో అందుతున్న వైద్య సేవలపై రోగుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడారు. గర్భిణీలు అందరూ ప్రభుత్వ దవాఖానల్లో పేర్లు నమోదు చేసుకునేలా చూడాలని, ఇక్కడ అందుతున్న సేవలు, వసతులపై అవగాహన కల్పించాలని నిరంతరం పరీక్షలు చేసి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. సర్కార్ దవాఖానల్లోనే ప్రసవాలు చేసుకునేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించి, సీజనల్ వ్యాధులు తదితర అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పై ఆసుపత్రికి వచ్చే వారికి వివరించాలని తెలిపారు. ఆయన వెంట పల్లూరు అధికారులు ఉన్నారు.

## వంద పడకల ఆసుపత్రి లో వైద్యం వంద శాతం

- వంద పడకల ఆసుపత్రిలో పేదలకు మెరుగైన వైద్యం..
- రక్తదానం చేసిన జిల్లా ప్రధాన అధికారి జితేష్ వి పాటిల్...

**మణుగూరు, ఆగస్టు 4 (జనం సాక్షి) :** వంద పడకల ఆసుపత్రి లో వైద్యం వంద శాతం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జిల్లా ప్రధాన అధికారి జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. వంద పడకల ఆసుపత్రిలో రక్త నిధి కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రిలో ఉన్న రోగులను వైద్యం ఎలా అందుతోందని అడిగి తెలుసుకున్నారు. మొదట కలెక్టర్ రక్త దానం చేసి బ్లెడ్ క్యాంప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అత్యవసర పరిస్థితులలో ఎవరికైనా రక్తం అవసరం ఉంటుంది. రక్తదానం చేయటం వల్ల ఒక వ్యక్తి ప్రాణాన్ని కాపాడవచ్చన్నారు. గతంలో ఏదైనా రక్త నిధి అవసరం ఉంటే భద్రాచలం వెళ్లి రావడానికి చాలా సమయం పట్టేది. దాంతోపాటు ఈ ప్రయాణంలో కొంత ప్రమాదం కూడా జరిగే అవకాశాలు ఎన్నో ఉన్నాయి. భద్రాచలం వెళ్లి రావడానికి పేదవాడికి ఖర్చుతో కూడుకున్న పని దానిని దృష్టిలో పెట్టుకొని వంద పడకల ఆసుపత్రిలో రక్త నిధి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇక్కడ రక్తనిధి ఏర్పాటుకు ముందుగా వైద్యుల నుంచి రక్తనిధి సేకరణ జరిగితే మిగతావారు రక్తం ఇవ్వటానికి ముందుకు వస్తారనే ఉద్దేశంతో బ్లడ్ బ్యాంక్ క్యాంప్ ఏర్పాటు చేయడం జరిగింది. ఇలాంటి మంచి కార్యక్రమానికి అందరూ సహకరించాలని కోరారు. వంద పడకల ఆసుపత్రిలో సర్జన్, ఆర్థోపెడిక్ వైద్యులను అలాగే ఎక్స్ రే పరికరాలను త్వరలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. నెలకు 7 ప్రసవాలు జరిగే స్థాయి నుంచి 78 వరకు ప్రసవాలు జరగటం సంతోషకరం అన్నారు. అలాగే రోజు 100 నుంచి 550 వరకు ఓపి పెరిగిందన్నారు. ఆస్పత్రిలో కావాల్సిన ఫర్నిచర్ పూర్తిస్థాయిలో అందించిందన్నారు. డయాలసిస్ కేంద్రం రక్తనిధి తో పాటు తల్లిపాలు కూడా అందుబాటులోకి తీసుకొచ్చి తల్లి బిడ్డ సురక్షితంగా ఆరోగ్యంగా ఇంటికి వెళ్లేలా ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సేవలు అందిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో డి సి హెచ్ ఎస్ రవిబాబు, ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ సునీల్, మణుగూరు తహసిల్దార్ అద్దంకి నరేష్ ఎంపీడీవో టి. శ్రీనివాసరావు ఎంపీఓ వెంకటేశ్వర్లు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ వైద్యులు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# రెంజల్ మండలంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



**నిజామాబాద్ జిల్లా బ్యూరో, ఆగస్టు 4 (జనం సాక్షి) :** నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలంలో కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వీరన్నగుట్ట లోని జిల్లా పరిషత్ హైస్కూల్, ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి సెంటర్ లను కలెక్టర్ సందర్శించారు. పాఠశాలల్లో బోధన, బోధనేతర సిబ్బంది హాజరును ఫేస్ రికగ్నేషన్ విధానం (ఎఫ్.ఆర్.ఎస్) ద్వారా చేపడుతున్నారా లేదా అని పరిశీలించారు. యూడైస్ లో అందరు విద్యార్థుల నమోదు పూర్తయ్యిందా అని ఆరా తీశారు. కిచెన్, టాయిలెట్స్, తరగతి గదులను పరిశీలించిన కలెక్టర్, పాఠశాల ఆవరణలో నిరుపయోగంగా ఉన్న గదులను తొలగింపజేయాలని ఆదేశించారు. కిచెన్, పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉండాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని హెచ్.ఎం లను ఆదేశించారు. బాలుర కోసం టాయిలెట్స్, ఇతర అవసరమైన మౌలిక సదుపాయాల కోసం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ప్రతిపాదనలు పంపాలని సూచించారు. అనంతరం కలెక్టర్ రెంజల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాలను, అంగన్వాడీ సెంటర్, ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. పీ.హెచ్.సీలో మెడికల్ ఆఫీసర్లు అందుబాటులో లేకపోవడంతో వారి గురించి అడిగి తెలుసుకున్నారు. అటెండెన్స్ రిజిస్టర్ ను తనిఖీ చేసి, సిబ్బంది హాజరును పరిశీలించారు. విధులలో లేని వారికి అటెండెన్స్ రిజిస్టర్ లో కలెక్టర్ స్వయంగా ఆబ్సెంట్ వేసి, డీఎంహెచ్ఓ కు గైర్హాజరు అయిన డాక్టర్లు, సిబ్బంది వివరాలు పంపించారు. రెంజల్ అంగన్వాడీ కేంద్రంలో కూడా టీచర్ లేకపోవడాన్ని గుర్తించిన కలెక్టర్, తగు చర్యలు తీసుకోవాలని సీడీపీఓను ఫోన్ ద్వారా ఆదేశించారు. సహకార సంఘం ఎరువుల గోడౌన్ ను తనిఖీ చేసి ఎరువుల నిల్వలను తనిఖీ చేశారు. రైతులకు సరిపడా యూరియా, ఇతర ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఎరువుల వివరాలతో కూడిన స్టాక్ బోర్డును తప్పనిసరిగా ప్రదర్శించాలని అన్నారు. అక్కడి నుండి ఎంపీడీఓ కార్యాలయాన్ని అయన సందర్శించారు. మండలంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై ఎంపీడీఓ, ఎంపీఓ, పంచాయతీరాజ్ ఏ.ఈ లతో సమీక్షించారు. ఎన్ని పనులు మంజూరయ్యాయి, వాటిలో ఎన్ని ప్రారంభం అయ్యాయి, అవి ఏ దశలో ఉన్నాయని వివరాలు అడిగి తెలుసుకున్నారు. టెండర్ల ప్రక్రియను వెంటనే పూర్తి చేసి, అన్ని పనులు గ్రౌండింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షిస్తూ త్వరితగతిన పూర్తి అయ్యేలా చొరవ చూపాలన్నారు. మండల, గ్రామ ప్రత్యేక అధికారులు తప్పనిసరిగా అభివృద్ధి పనులను పరిశీలిస్తూ, వాటి ప్రగతిపై క్రమం తప్పకుండా సమీక్ష జరపాలని కలెక్టర్ ఆదేశించారు. పంచాయతీరాజ్, ఆర్.డబ్ల్యు.ఎస్, ఆర్ అండ్ బీ తదితర ఇంజనీరింగ్ విభాగాల ఏ.ఈ ల క్షేత్రస్థాయి సందర్శనలకు సంబంధించి ఎంపీడీఓ కార్యాలయంలో మూవ్ మెంట్ రిజిస్టర్ నిర్వహించాలని, జిల్లాలోని అన్ని మండలాల్లో దీనిని విధిగా అమలుపర్చాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పారిశుద్ధ్య పనులు పక్కాగా జరిగేలా పర్యవేక్షణ చేయాలని ఎంపీఓ ను ఆదేశించారు. ప్రతీ రోజు క్రమం తప్పకుండా శానిటేషన్ సిబ్బంది ఇంటింటికి తిరిగి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేలా చూడాలన్నారు. సీజనల్ వ్యాధులు సోకకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి నివాస ప్రాంతంలో ఫాగింగ్, స్ప్రే జరిపించాలని సూచించారు. అనంతరం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో తో కలిసి తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులపై ఒక్కో గ్రామం వారీగా రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమీక్ష జరిపారు. వచ్చిన దరఖాస్తులలో ఆయా మాడ్యుల్స్ లో ఎన్ని అర్జీలు పరిష్కరించారు, ఎన్ని పెండింగ్ లో ఉన్నాయి, ఎంతమందికి నోటీసులు ఇచ్చారు, క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ పూర్తయ్యిందా తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. భూభారతి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అర్జీల పరిష్కారంలో జాప్యం జరుగకుండా రోజువారీగా దరఖాస్తుల పరిశీలనను పర్యవేక్షిస్తూ, వేగవంతంగా వాటిని పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నిర్ణీత గడువు లోపు అన్ని దరఖాస్తులు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. కలెక్టర్ వెంట స్థానిక అధికారులు ఉన్నారు.


## రాష్ట్రస్థాయి డ్యూటీ మీట్‌లో బంగారు పతకం సాధించిన సింబా..

- సిపి అభినందనలు..
- రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పోలీస్ డాగ్‌గా రామగుండం పోలీస్ కమీషనరేట్ నార్కోటిక్ డాగ్ "సింబా" ఎంపిక..




**గోదావరిఖని, ఆగస్టు 4 (జనంసాక్షి) :** వరంగల్ జిల్లా మమునూరు పిటిసిలో జరిగిన తెలంగాణ రాష్ట్ర రెండవ పోలీస్ డ్యూటీ మీట్ లో కాళేశ్వరం జోన్ నుండి నార్కోటిక్ డాగ్ విభాగం పోటీలో పాల్గొనీ గంజాయి, మత్తు పదార్థాలను గుర్తించడం లో పోలీసు జాగిలం సింబా, డాగ్ హ్యాండ్లర్ ఏ ఆర్ హెడ్ కానిస్టేబుల్ ఎం. వేణుగోపాల్ కృష్ణ గోల్డ్ మెడల్ సాధించడం జరిగింది. అదేవిదంగా రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పోలీస్ డాగ్ గా లి"సింబా"లి ఎంపిక కావడం జరిగింది. ఈరోజు రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా గారు తమ కార్యాలయం లో నార్కోటిక్ డాగ్ సింబా, డాగ్ హాండ్లర్ ను అభినందనచడం జరిగింది. 2026 సంవత్సరం ఫిబ్రవరిలో పూణేలో జరిగే నేషనల్ పోలీసు డ్యూటీ మీట్ లో పాల్గొని మరిన్ని పతకాలు సాధించాలని తెలంగాణ రాష్ట్రానికి, రామగుండం పోలీస్ కమీషనరేట్ కి మంచి పేరు తీసుకు రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డిసిపి ఏ. భాస్కర్, పెద్దపల్లి డిసిపి పి. కరుణాకర్, ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాస్, ఏఆర్ ఏసిపి ప్రతాప్, ఆర్ ఐ లు దామోదర్, శ్రీనివాస్, వామనమూర్తి సంపత్, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

# విపణి



## ఎప్పుడూ ఊహించని కొత్త ఉద్యోగాలొస్తాయ్..

**జనంసాక్షి:**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వ్యవస్థలు రోజురోజుకూ మెరుగవుతున్నకొద్దీ మానవ ఉద్యోగాలు పోతాయన్న ఆందోళన పెరుగుతోంది. మనుషులు చేయగలిగే పనులన్నీ ఏఐ చేసేస్తుండటంతో మానవ ఉద్యోగాలను త్వరలోనే ఈ కొత్త ఏఐ టూల్స్ భర్తీ చేసే ప్రమాదం ఎక్కువవుతోంది. టెక్ దిగ్గజాల సీఈవోలూ ఇదే హెచ్చరిస్తున్నారు. రాబోయే సంవత్సరాల్లో తమ కంపెనీలోని ఉద్యోగులను ఏఐ తగ్గిస్తుందని స్వయంగా అమెజాన్ సీఈఓ ఆండీ జాస్సీనే కొన్ని వారాలుగా చెబుతూ వస్తున్నారు. ప్రతి ఒక్కరి ఉద్యోగాలు ప్రభావితమవుతాయని ఎన్విడియా సీఈఓ జెన్సెన్ హువాంగ్ కూడా ఇటీవల హెచ్చరించారు. అయితే, ఈ క్రమంలో ఉద్యోగుల్లో ఏఐపై ఉన్న భయాల్ని పోగొట్టేలా గూగుల్ డీప్ మైండ్ సీఈఓ డెమిస్ హస్సాబిస్ ఆసక్తిక వ్యాఖ్యలు చేశారు. ఓ అడుగు ముందుకేసి ప్రస్తుతం ప్రత్యామ్నాయంగానే ఉన్న కృత్రిమ మేధస్సుతో రాబోయే ఐదు నుండి పదేళ్లలో ఉద్యోగ భావనలోనే సమూల మార్పు సంభవించవచ్చని అభిప్రాయపడ్డారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల ఎప్పుడూ ఊహించని విధంగా కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయని 'వైర్డ్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. "ఉద్యోగ ప్రపంచంలో చాలా మార్పు ఉంటుందని నేను అనుకుంటున్నాను. కానీ గతంలో మాదిరిగానే మెరుగైన కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయి. ఇవి ఈ సాధనాలు లేదా కొత్త సాంకేతికతలను ఉపయోగిస్తాయి" అని హస్సాబిస్ అన్నారు. ప్రస్తుతం మానవులు చేసే ప్రతి పనినీ ఏజీఐ లేదా ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్ చేయగలిగితే, రానున్న కొత్త ఉద్యోగాలను కూడా ఈ సాంకేతిక పరిజ్ఞానం భర్తీ చేయకుండా ఆపగలమా అన్న ప్రశ్న కూడా ఉత్పన్నమైంది. దీనికి హస్సాబిస్ బదులిస్తూ ఒక వైద్యుడి స్థానాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ భర్తీ చేయగలదు కానీ నర్సులను కాదు అన్నారు.

# 24,700 ఎగువన నిఫ్టీ

- **లాభాల్లో ముగిసిన సూచీలు..**



**జనంసాక్షి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలుబీ మెటల్, ఐటీ, ఆటో స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు రాణించాయి. ముఖ్యంగా జులై నెలకు సంబంధించి అమెరికా జాబ్స్ డేటా ఊహించిన దానికంటే తక్కువగా వచ్చింది. దీంతో అమెరికా ఫెడ్ సెప్టెంబర్‌లో వడ్డీ రేట్లలో కోత విధిస్తుందన్న అంచనాలు మన మార్కెట్లలో జోష్ నింపాయి. అమెరికాలో వడ్డీ రేట్లు తగ్గితే ఆ మేర అక్కడి బాండ్లపై రాబడి తగ్గడంతో పాటు, డాలర్ కూడా బలహీన పడుతుంది. ఇది భారత్ వంటి వర్ధమాన మార్కెట్లకు లాభించే అంశం. ఈ క్రమంలోనే మదుపర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.4.5 లక్షల కోట్లు పెరిగి రూ.449 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 80,765.83 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 81,093.19 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 418.81 పాయింట్ల లాభంతో 81,018.72 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 157.40 పాయింట్ల లాభంతో 24,722.75 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 87.70గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు మినహా మిగిలిన అన్ని షేర్లూ లాభాల్లో ముగిశాయి. టాటా స్టీల్, బీఈఎల్, అదానీ పోర్ట్స్, టెక్ మహీంద్రా, టీసీఎస్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 68.84 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 3406 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

## ఇంత జీఎస్టీ ఎగ్గొట్టారా?

**జనంసాక్షి:**గడిచిన ఐదేళ్లలో (2024-25 ఆర్థిక సంవత్సరం వరకు) సుమారు రూ.7.08 లక్షల కోట్ల పన్ను ఎగవేతను కేంద్ర జీఎస్టీ ఫీల్డ్ ఆఫీసర్లు గుర్తించారు. ఇందులో సుమారు రూ.1.79 లక్షల కోట్ల ఇన్ పుట్ ట్యాక్స్ క్రెడిట్ మోసం కూడా ఉందని కేంద్ర ఆర్థిక శాఖ తాజాగా పార్లమెంటుకు తెలిపింది. లోక్‌సభలో ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి వెల్లడించిన వివరాల ప్రకారం.. ఒక్క 2024-25 ఆర్థిక సంవత్సరంలోనే రూ.2.23 లక్షల కోట్లకు పైగా జీఎస్టీ ఎగవేతను సీజీఎస్టీ ఫీల్డ్ ఆఫీసర్లు గుర్తించారు. గత ఐదేళ్లలో గుర్తించిన మొత్తం 91,370 కేసుల్లో జీఎస్టీ ఎగవేత సుమారు రూ.7.08 లక్షల కోట్లుగా ఉంది. ఈ కాలంలో స్వచ్ఛంద డిపాజిట్ ద్వారా వసూలు చేసిన పన్నులు రూ.1.29 లక్షల కోట్లకు పైగా ఉన్నాయి. 2021 ఆర్థిక సంవత్సరం నుంచి 2025 ఆర్థిక సంవత్సరం మధ్య 44,938 కేసుల్లో సుమారు రూ.1.79 లక్షల కోట్ల ఐటీసీ మోసం జరిగింది. 2022, 2021 ఆర్థిక సంవత్సరాల్లో జీఎస్టీ ఎగవేతలు వరుసగా రూ.73,238 కోట్లు, రూ.49,384 కోట్లుగా ఉన్నాయి. ఇందులో ఐటీసీ మోసాలు వరుసగా రూ.28,022 కోట్లు, రూ.31,233 కోట్లు ఉన్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.2.30 లక్షల కోట్ల విలువైన జీఎస్టీ ఎగవేతను సీజీఎస్టీ ఫీల్డ్ ఆఫీసర్లు గుర్తించారు. 2023 ఆర్థిక సంవత్సరంలో రూ.1.32 లక్షల కోట్ల జీఎస్టీ ఎగవేతను గుర్తించామని, ఇందులో రూ.24,140 కోట్ల నకిలీ ఐటీసీ క్లెయిమ్‌లు ఉన్నాయని తెలిపారు. 2025 ఆర్థిక సంవత్సరంలో గుర్తించిన 30,056 జీఎస్టీ ఎగవేత కేసులలో సగానికి పైగా లేదా 15,283 కేసులు ఐటీసీ మోసానికి సంబంధించినవి. వీటి ద్వారా రూ .58,772 కోట్ల ఎగవేత జరిగింది.

# తీరని బెంగళూరు బెంగ..

## 'ఏదో అలా బ్రతికేస్తున్నాం.. అంతే అన్నట్టుగా నగరవాసుల జీవనం

**జనంసాక్షి:**బెంగళూరులో క్రమంగా క్షీణిస్తున్న జీవన నాణ్యత, నగరంలో పెరుగుతున్న రోజువారీ ఖర్చుల నేపథ్యంలో చాలామంది నివాసితులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బెంగళూరు పట్టణం వేగంగా విస్తరిస్తోంది. దాంతో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చేవారి సంఖ్య పెరుగుతోంది. స్థానికంగా నివాసం ఉండేందుకు రెంట్లు, జీవనవ్యయం అధికం అవుతున్నట్లు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు వెలుస్తున్నాయి. తొమ్మిదేళ్లు నగరంలో నివాసం ఉన్న ఓ వ్యక్తి ఆన్‌లైన్‌లో చేసిన పోస్ట్‌కాస్తా వైరల్‌గా మారింది. 'నేను తొమ్మిదేళ్లుగా బెంగళూరులో నివసిస్తున్నాను. టెక్నాలజీ అభివృద్ధి, మెరుగైన పట్టణ వాతావరణం, జీవన నాణ్యత బాగుంటుందని ఇక్కడకు వచ్చాను. కానీ ఇక్కడి పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. 12 కిలోమీటర్లు ప్రయాణించడానికి నిత్యం మూడు గంటలు ట్రాఫిక్‌తో ఇబ్బందిపడాల్సి వస్తోంది. ఎలాంటి పార్కింగ్ సదుపాయంలేని 1 బీహెచ్‌కే ఫ్లాట్‌కు రూ.30 వేల కంటే అధిక రెంటు ఉంది. క్యాబ్ బుక్ చేయడానికి ఏడు వేర్వేరు యాప్‌లను ఉపయోగిస్తున్నా చాలాసార్లు బుక్ అవ్వదు. నగరంలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉంది. ఏదో అలా బ్రతుకుతున్నాం అంతే..' అని ఓ వ్యక్తి లింక్డ్‌ఇన్‌లో పోస్ట్ చేశాడు. ఈ పోస్ట్‌పై నెటిజన్లు విభిన్నంగా స్పందిస్తున్నారు. 'నేను ఉద్యోగం కోసం ఇక్కడకు వచ్చాను. చాలా విషయాలతో ఇక్కడే చిక్కుకుపోయాను' అని ఒకరు రిప్లై ఇచ్చారు. 'ట్రాఫిక్ ఆత్మరక్షణలో ఉంది. కుటుంబంతో కంటే ప్రయాణాలకే ఎక్కువ సమయం కేటాయిస్తున్నాను' అని మరో వ్యక్తి తెలిపారు.



## సులువుగా యూఎస్ వీసా రావాలంటే..



యూఎస్ వీసా రావాలంటే కష్టమని చాలా మంది చెబుతుంటారు. అయితే ఇటీవల వీసా ఇంటర్వ్యూకు హాజరైన ఒక స్టార్టప్ ఫౌండర్‌కు ఇట్టే వీసా అప్రూవ్ అయింది. తన వీసా ఇంటర్వ్యూలో ఆఫీసర్లు అడిగిన ప్రశ్నలను సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. ఈ తొమ్మిది ప్రశ్నలకు సమాధానం చెప్పడంతో తనకు, తన భార్యకు యూఎస్ వీసా వచ్చినట్లు ప్రణవ్ దత్ ఓ పోస్ట్‌లో ఆనందం వ్యక్తం చేశారు. ఇంతకీ వీసా ఆఫీసర్లు అడిగిన ప్రశ్నలేంటో కింద చూద్దాం. ప్రణవ్‌కు ఎలాంటి ఆదాయం లేదు. పాత కంపెనీలో ఉద్యోగం వదిలేయడంతో ఎలాంటి ఉపాధి పత్రాలు లేవు. గతంలోనూ అమెరికా వీసా కోసం దరఖాస్తు చేసుకోలేదు. నిజాయితీగా దరఖాస్తు చేస్తే తప్పకుండా వీసా అవకాశం వస్తుందని తెలుసుకుని అప్లై చేశాడు. అమెరికా వీసా లేకపోయినా 'ఎస్ఏఎస్ 1 మిలియన్ మైల్ ఛాలెంజ్'లో పాల్గొంటూ ప్రణవ్ దత్, ఆయన భార్య శ్రుతి పాటిల్ పలు దేశాల్లో పర్యటించారు. యూఎస్ వీసాకు సంబంధించి అభ్యర్థులు ఎంత నిజాయితీగా సమాధానం చెబుతున్నారు, ఎంత స్పష్టంగా కమ్యునికేట్ చేస్తున్నారో ఆఫీసర్లు క్షుణ్ణంగా పరిశీలిస్తారని చెప్పారు.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 4.35 | ₹ 4.37 |

## బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 92,950 (22 క్యారెట్లు) | ₹ 1,01,400 (24 క్యారెట్లు) |
|---|---|

## వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 1,23,000

# ధర్మస్థళ కేసులో జీపీఆర్ టెక్నాలజీ!




కర్ణాటక దైవక్షేత్రం ధర్మస్థళ సామూహిక ఖననాల కేసు మిస్టరీ ఇంకా వీడలేదు. మొత్తం 13 పాయింట్లలో.. మిగిలిన పాయింట్లలో ఆరో రోజు సిట్ తవ్వకాలు కొనసాగుతున్నాయి. ఈ మూడు పాయింట్లు హైవేను ఆనుకుని ఉండడం గమనార్హం. ఈ కేసులో ప్రత్యక్ష సాక్షి అయిన మాజీ పారిశుద్ధ్య కార్మికుడిని వెంటపెట్టుకుని అధికారులు తవ్వకాలు జరుపుతున్నారు. ధర్మస్థళలో ఇవాళ 11, 12వ ప్రాంతాల్లో మానవ అవశేషాల కోసం తవ్వకాలు జరపనున్నట్లు అధికారులు వెల్లడించారు. శనివారం 8, 9, 10వ పాయింట్ల వద్ద 8 ఫీట్ల లోతులో తవ్వకాలు జరిపినా ఏం లభించలేదు. ఆదివారం రెవెన్యూ, ఇతర విభాగాల అధికారులకు సెలవు కావడంతో తవ్వకాలు జరపలేదు. అదే సమయంలో.. ఆయా పాయింట్లలో యాంటీ నక్సల్ ఫోర్స్ ను కాపలాగా ఉంచారు. 1998 నుంచి 2004 మధ్య ప్రముఖ దైవక్షేత్రం ధర్మస్థళంలో వందలాది మృతదేహాల ఖననం జరిగిందని, బలవంతంగా తనతో ఆ మృతదేహాలను పూడ్చి పెట్టించారని ఓ వ్యక్తి ముందుకు రావడం దేశవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ నేపథ్యంలో అతను చూపించిన చోట్లలో అధికారులు తవ్వకాలు జరుపుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ప్రతీ చిన్న విషయం కేసుకు కీలకంగానే మారింది. నేత్రావతి నది ఒడ్డున ఉన్న ఆరో పాయింట్‌లో మనిషి ఎముకలు బయటపడ్డాయి. కానీ పుర్రె మాత్రం లభించలేదు. ఫోరెన్సిక్ పరీక్షలు ద్వారా వయస్సు, లింగం, మరణ కారణం నిర్ధారణ కావాల్సి ఉంది. అదే సమయంలో.. కొన్ని స్థావరాల్లో %ఖాచీ% కార్డు, %ూవీ% కార్డు లభించాయి. కార్డు నెలమంగళ ప్రాంతానికి చెందిన వ్యక్తిదిగా గుర్తించారు. అతను జాండిస్‌తో మృతి చెందినట్లు నిర్ధారించుకున్నారు. అయితే.. ఏటీఎం కార్డు వివరాలపై స్పష్టత రావాల్సి ఉంది.



జీపీఆర్ టెక్నాలజీతో..

2003 సమయంలో కోల్‌కతాకు చెందిన అనన్య భట్ అనే మెడికో ధర్మస్థళంలో అనూహ్య రీతిలో అదృశ్యమైంది. అయితే అనన్య హత్యాచారానికి గురైందని, ప్రస్తుత తవ్వకాల్లో అవశేషాలు బయటపడే అవకాశం ఉందని ఆమె తల్లి సుజాత భట్ ముందుకు వచ్చారు. ఈ క్రమంలో ఆమె దక్షిణ కన్నడ జిల్లా బెత్తంగడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉంటే.. వర్షాలు, మట్టి తడిగా ఉండటం వల్ల తవ్వకాల్లో ఆలస్యం జరుగుతోంది. అయితే ఈ కేసులో సుజాత భట్ తరఫున ఆమె న్యాయవాది మంజునాథ్ 'జీపీఆర్ టెక్నాలజీ వాడే అవకాశాన్ని పరిశీలించమని సిట్‌ను కోరుతున్నారు. జీపీఆర్ టెక్నాలజీ.. బాంబ్ డిటెక్టర్ తరహాలో ఉండే పరికరం. ఇది ఎలక్ట్రోమాగ్నటిక్ తరంగాలను భూమిలోకి పంపుతుంది. అది భూమి పొరల్లోకి చొచ్చుకుపోయి.. ఎముకలు, కేవిటీస్, తదితర మార్పులను గుర్తిస్తుంది. తద్వారా అనవసర తవ్వకాలను నియంత్రిస్తుంది. ఫోరెన్సిక్ నిపుణులు, ఆర్కియాలజీవాళ్లు ఈ సాంకేతికతను ఎక్కువగా వినియోగిస్తుంటారు. అయితే ధర్మస్థళ కేసుకు ఇది ఎందుకు అవసరం అనే వాదనలోకి వెళ్తే..ఈ కేసులో కీలకంగా ఉన్న పారిశుద్ధ్య మాజీ కార్మికుడు 13 పాయింట్లు చూపించాడు. అవి 2014 కంటే ముందు ప్రాంతాలని చెబుతున్నాడు. అయితే ఈ పదేళ్ల కాలంలో అక్కడ చాలా మార్పులు సంభవించాయి. భారీ వర్షం, మట్టి కొట్టుకుపోవడం లాంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి.




## భారత్‌పై ట్రంప్ సన్నిహితుడి వివాదాస్పద వ్యాఖ్యలు

### రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తూ ఉక్రెయిన్‌పై యుద్ధానికి భారత్ పరోక్షంగా నిధులు సమకూరుస్తోంది

**జనంసాక్షి:**రష్యా-భారత్ వాణిజ్యంపై అమెరికా మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక సహాయకుడు స్టీఫెన్ మిల్లర్..భారత్‌పై సంచలన ఆరోపణలు చేశారు. రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు చేస్తూ ఉక్రెయిన్‌పై ఆ దేశం చేస్తున్న యుద్ధానికి భారత్ పరోక్షంగా నిధులు సమకూరుస్తోందని ఆయన తీవ్రంగా విమర్శించారు. యుద్ధం ఆగాలంటే భారత్‌పై ఆంక్షలు తప్పవని తేల్చి చెప్పారు. దీంతో, ఈ వ్యాఖ్యలు తీవ్ర చర్చకు దారి తీశాయి. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక సహాయకుడు స్టీఫెన్ మిల్లర్ తాజాగా ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. భారత్ వాణిజ్యం కారణంగానే రష్యా ఉక్రెయిన్‌తో యుద్ధం కొనసాగిస్తోంది. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తూ యుద్ధానికి ఆర్థికంగా మద్దతు ఇవ్వడం ఎంత మాత్రం కరెక్ట్ కాదు. రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకునే విషయంలో భారత్ దాదాపుగా చైనాతో సమానంగా ఉంది. భారత్ చేసుకుంటున్న దిగుమతులు ఉక్రెయిన్‌పై రష్యా దాడికి నిధులు సమకూర్చడానికి సాయపడుతున్నాయి. ఇది అమెరికా ప్రయోజనాలకు విరుద్ధంగా ఉంది. ఈ విషయంలో అధ్యక్షుడు ట్రంప్ చాలా స్పష్టతతో ఉన్నారు' అంటూ వ్యాఖ్యలు చేశారు. ఇక, ఆయన వ్యాఖ్యలపై భారత ప్రభుత్వం స్పందించాల్సి ఉంది. అయితే, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో అమెరికాకు కీలక భాగస్వామి అయిన భారత్‌పై ట్రంప్ వర్గం నుంచి ఇలాంటి విమర్శలు రావడం తీవ్ర చర్చకు దారి తీశాయి. కాగా, కొద్ది రోజుల ముందే ట్రంప్.. భారత వస్తువులపై 25 శాతం సుంకాలు విధించిన విషయం తెలిసిందే. భారత్, రష్యా వాణిజ్యంపై ట్రంప్ ఆగ్రహం సైతం వ్యక్తం చేస్తూ డెడ్ ఎకానమీ అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. అంతటితో ఆగకుండా.. ఉక్రెయిన్‌లో శాంతి చర్చల దిశగా పురోగతి లేకపోతే, అంతటితో ఆగకుండా.. ఉక్రెయిన్‌లో శాంతి చర్చల దిశగా పురోగతి లేకపోతే,రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాల నుంచి వచ్చే దిగుమతులపై 100 శాతం వరకు సుంకాలు విధిస్తామని ఆయన హెచ్చరించారు. ఇదిలా ఉండగా.. భారత్, తక్కువ ధరకే లభిస్తున్న రష్యా ముడి చమురుపై ఎక్కువగా ఆధారపడుతోంది. ప్రస్తుతం దేశ చమురు అవసరాల్లో మూడింట ఒక వంతుకు పైగా రష్యా నుంచే దిగుమతి చేసుకుంటోంది. అమెరికా ఒత్తిడి ఉన్నప్పటికీ, దేశ ఇంధన భద్రత, సార్వభౌమ నిర్ణయాల దృష్ట్యా రష్యాతో వాణిజ్యాన్ని కొనసాగించాలని కేంద్రం భావిస్తున్నట్లు ప్రభుత్వ వర్గాల సమాచారం. అయితే, ట్రంప్‌కు, భారత ప్రధాని నరేంద్ర మోదీకి మధ్య చారిత్రాత్మకంగా బలమైన స్నేహ సంబంధాలు ఉన్నాయని మిల్లర్ అంగీకరించడం గమనార్హం.

## ఉగ్రవాది అంత్యక్రియల్లో స్థానికుల తిరుగుబాటు..

### తోక ముడిచిన పాక్ పోలీసులు



**జనంసాక్షి:** ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ ఇటీవల జరిగిన ఒక ఉగ్రవాది అంత్యక్రియల్లో యూటర్న్ తీసుకుంది. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌పై పలు ఆరోపణలు చేసిన పాకిస్తాన్ తన తీరు బయటకు పొక్కకుండా ఉండేలా చర్యలు తీసుకుం టోంది. ఒక ఉగ్రవాది అంత్యక్రియల సమయంలో చోటుచ ేసుకున్న పరిణామం ఇందుకు ఉదాహరణగా నిలిచిం ది. ఏప్రిల్ 22న జమ్ముకశ్మీర్‌లో మరణించిన ఉగ్రవాది హబీబ్ తాహిర్ అంత్యక్రియలు ఇటీవల పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్ లోని కుయియాన్ గ్రామంలో జరిగాయి. ఈ సందర్భంగా స్థానికంగా ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. ఎల్‌ఈటీ కమాండర్ రిజ్వాన్ హనీఫ్ సాయుధ వ్యక్తులతో అంత్యక్రియలకు రావడంతో, తాహిర్ కుటుంబ సభ్యులు, స్థానికులు వారిని అడ్డుకున్నారు. అయితే ఇంతలో హనీఫ్ మేనల్లుడు అక్కడ దుఃఖిస్తున్న వారిని తుపాకీతో బెదిరించడంతో ఘర్షణ చోటుచేసుకుంది. ఇది స్థానికుల్లో ఆగ్రహాన్ని తెప్పించింది. దీంతో హనీఫ్, అతని సహచరులు పోలీసుల జోక్యంతో అక్కడి నుండి వెళ్లిపోవాల్సి వచ్చింది. ఇటీవలి కాలంలో పాక్‌లో ఉగ్రవాదులు నిర్వహించే కార్యక్రమాలపై పోలీసులు ఆంక్షలు విధిస్తున్నారు. ఉగ్రవాద గ్రూపులు చేపట్టే ప్రజా కార్యకలాపాలను తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. దీనిని చూస్తుంటే పాక్ బహిరంగంగా ఉగ్రవాదులను ప్రోత్సహించేందుకు వెనకడుగు వేస్తున్నదని విశ్లేషకులు అంటున్నారు.

## మధ్యవర్తిత్వం ద్వారా సమస్యను సెటిల్ చేసుకోండి: సుప్రీం



న్యూఢిల్లీ: 150 ఏళ్లకు పైగా చరిత్ర కల్గిన పురాతన బాంకే బిహారీ ఆలయానికి సంబంధించి ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం-ఆలయ ట్రస్టుల మధ్య నెలకొన్న వివాదాన్ని ఉన్నత స్థాయి కమిటి మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవాలని సుప్రీంకోర్టు సూచించింది. బృందావన్‌లో ఉన్న బాంకే బిహారీ కృష్ణ దేవాలయం అంశానికి సంబంధించి ఈరోజు(సోమవారం, ఆగస్టు 4వ తేదీ) జస్టిస్ సూర్యకాంత్, జోయ్‌మాల్యా బాగ్చిలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ప్రధానంగా రూ. 500 కోట్లను ఆలయ నిధులతో దేవాలయ అభివృద్ధి పనులను చేపట్టడానికి యూపీ ప్రభుత్వం సిద్ధం కాగా, ఆలయ ట్రస్టు అభ్యంతరం వ్యక్తం చేయడంపై ఇది సుప్రీంకోర్టు వరకూ వెళ్లింది. ఆలయ నిధులను అభివృద్ధికి వాడటానికి మే 15వ తేదీన సుప్రీంకోర్టు అనుమతి ఇవ్వగా, తాజా తీర్పులో ఆ వివాదాన్ని ఓ కమిటీ ఏర్పాటు చేసి దాని ద్వారా సెటిల్ చేసుకోవాలని ధర్మాసనం పేర్కొంది. అదే సమయంలో గత తీర్పును ఉపసంహరించుకోవాలని ధర్మాసనం మౌఖికంగా ప్రతిపాదించింది ప్రస్తుత ధర్మాసనం. బాంకే బిహారీ ఆలయం-యూపీ ప్రభుత్వం వివాదంపై జస్టిస్ సూర్యకాంత్, జోయ్‌మాల్యా బాగ్చిలతో కూడిన సుప్రీంకోర్టు ఇలా వ్యాఖ్యానించింది. ' బృందావన్‌లోని బాంకే బిహారీ టెంపుల్‌కు తొలి మధ్యవర్తి శ్రీకృష్ణ భగవానుడే. ఈ వివాదాన్ని మధ్యవర్తిత్వం ద్వారా సెటిల్ చేసుకోండి. సమస్య పరిష్కారం కోసం ఓ కమిటీని ప్రతిపాదిస్తున్నాం. ఆ కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి ఆలయ ట్రస్టు బోర్డుకు మధ్యవర్తిత్వం వహిస్తుంది. గత సుప్రీంకోర్టు తీర్పులో కొంత భాగాన్ని నిలుపుదల చేద్దాం. హైకోర్టు మాజీ న్యాయమూర్తి లేక సీనియర్ రిటైర్డ్ జిల్లా జడ్జి ఇరు పక్షాలకు ధర్మకర్తగా ఉంటారు' అని స్పష్టం చేసింది.

ఆలయ వారసత్వం దెబ్బతింటుందనే..

యూపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆలయ అభివృద్ధి-నిధులు ఆర్డినెన్స్‌పై స్థానికంగా తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఒకవైపు ఆలయ ట్రస్ట్ అభ్యంతరంతో పాటు స్థానిక ప్రజలు కూడా వ్యతిరేకత వ్యక్తం చేశారు. ఆలయ అభివృద్ధి పేరుతో మరమ్మత్తులు చేపడితే ఆలయ వారసత్వం, వాస్తవికత దెబ్బతింటుందని అభిప్రాయం వ్యక్తమైంది. ఇది సున్నితమైన అంశం కావడంతో పాటు ఆధ్యాత్మిక వైభవం, సంప్రదాయాల సమతుల్యతలపై అనేక ప్రశ్నలు లేవనెత్తింది.

## చైనా మన భూభాగం ఆక్రమించిందని నిజమైన భారతీయుడు చెప్పడట!

### సుప్రీం వ్యాఖ్యలకు విస్తూపోయిన రాహుల్ గాంధీ

ఆక్రమించిందనే విష యం మీకెలా తెలు సని కాంగ్రెస్ నేతను ప్రశ్నించిన సర్వో న్నత న్యాయస్థానం నిజమైన భారతీయులెవరూ అలా మాట్లా డరని వ్యాఖ్యా నించింది. రాహుల్ తరపు న్యాయవాది అభిషే క్ సింఘ్వీ మాట్లా డుతూ.. దేశంలో ఉన్న సమస్య లను ప్రశ్నించకపోతే రాహుల్ ప్రతిపక్ష నాయకుడు ఎలా అవుతా రని వాదిం చారు. దీంతో ఆగ్రహించిన జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఏజీ మసిహ్‌లతో కూడిన ధర్మాసనం ఏదైనా సమస్య లేదా విషయంపై మాట్లాడాలంటే పార్లమెంటులో మాట్లాడాలని.. సోషల్ మీడియాలో కాదని పేర్కొంది. పార్లమెంటులో ఎందుకు లేవనెత్తరని ప్రశ్నించింది. భారత్‌జోడో యాత్రలో రాహుల్‌గాంధీ మాట్లాడుతూ..పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. "2020 జూన్‌లో లడఖ్‌లోని గల్వాన్ లోయలో చైనా సైనికులతో జరిగిన హింసాత్మక ఘర్షణ సమయంలో దాదాపు 2 వేల చదరపు కిలోమీటర్ల భారత భూగాన్ని చైనా స్వాధీనం చేసుకుంది. కానీ, కేంద్రంలో అధికారంలో ఉన్నవారు దాని గురించి ఒక్క ప్రశ్న కూడా అడగరని వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే..అరుణాచల్‌ప్రదేశ్‌లో 20 మంది సైనికులు ప్రా ణాలు కోల్పోయారు. ఆ భూభాగాన్ని తిరిగి ఇవ్వాలంటూ మన సైన్యం చైనా సైన్యంతో చర్చలు జరిపినప్పటికీ మోదీ అబద్ధాలు చెబుతున్నారన్నారు.

# ఖమ్మం నుంచి రాజకీయ మార్పు పునాది

- కాంగ్రెస్-బీఆర్ఎస్ పాలనలపై ప్రజల విరక్తి
- స్థానిక ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టనున్న ఖమ్మం
- బూత్ స్థాయిలో ప్రచారమే విజయ రహస్యం
- మీడియా సమావేశంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు, స్థానిక సంస్థల ఎన్నికల ఖమ్మం జిల్లా ఇంచార్జ్, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి



**ఖమ్మం, ఆగస్టు 4 (జనం సాక్షి) :** తెలంగాణ రాజకీయ సమీకరణాల్లో ఇప్పుడు ఖమ్మం జిల్లా కేంద్రబిందువుగా మారింది. గతంలో ఎన్టీఆర్‌కు అండగా నిలిచిన ఈ జిల్లా, ఇప్పుడు ప్రధాని మోదీకి నైతిక మద్దతు తెలుపుతోంది. రాజకీయంగా నిరాశకు గురైన ప్రజలు, ప్రభుత్వ విధానాలపై అసహనం వ్యక్తం చేస్తున్న యువత ఈసారి మార్పు కోసం ముందుకు వస్తున్నారనీ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు, స్థానిక సంస్థల ఎన్నికల ఖమ్మం జిల్లా ఇంచార్జ్, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి పేర్కొన్నారు. ఖమ్మం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో సోమవారం నిర్వహించిన 'మహా సంపర్క్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా మీడియా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ జిల్లా గతంలో ఎన్టీఆర్‌కు రాజకీయ బలం ఇచ్చింది. అదే ప్రజలు ఇప్పుడు ప్రధాని మోదీ నాయకత్వంలో బీజేపీకి శక్తిని ప్రసాదించబోతున్నారు. ఖమ్మం జిల్లాలో రాజకీయ వాతావరణం మారుతోంది. ప్రజలంతా మార్పు వైపు మొగ్గు చూపుతున్నారు. మేము బూత్ స్థాయిలో ప్రచారం నిర్వహించి, అభివృద్ధిని వివరించనున్నాం" అన్నారు. అదేలా ఉండగా బీఆర్ఎస్ కుటుంబ కలహాలతో అలజడి. కాంగ్రెస్ ప్రభుత్వంలో శూన్యతే మిగిలింది. సమన్వయం లేక ప్రభుత్వం చీలిపోయినట్లయి ంది. ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని స్థితి ఎంత దుర్భరమో ప్రజలు చూస్తున్నారు" అన్నారు. యువతపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ప్రతి బూత్‌లో 'మహా సంపర్క్‌అభియాన్' సమావేశాలు నిర్వహించనున్నాం. మోదీ గారి నాయకత్వంలో దేశం అభివృద్ధి దిశగా పరుగులు పెడుతోంది. అదే అభివృద్ధిని రాష్ట్రంలోకి తీసుకురావడానికి బీజేపీని పట్టాలి," అన్నారు. బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వర రావు మాట్లాడుతూ జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో అత్యధిక విజయం సాధించడమే మా లక్ష్యం. గతంలో టీడీపీ వర్గాలు ఇప్పుడు బీజేపీలోకి వచ్చి పార్టీకోసం పని చేస్తున్నాయి. రాష్ట్రంలో ముగ్గురు మంత్రులు ఖమ్మం జిల్లాకు ఉన్నా అభివృద్ధి నిధులు రావడం లేదు. హాస్టళ్లలో విద్యార్థులకు కనీస వసతులు లేవు. ఇది పాలన వైఫల్యానికి ప్రత్యక్ష నిదర్శనం" అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర స్థాయి నేతలు దేవకీ వాసుదేవరావు, ఇవి రమేష్, నున్న రవికుమార్, పుల్లారావు యాదవ్, దొంగల సత్యనారాయణ, నంబూరి రామలింగేశ్వరరావు, అల్లిక అంజయ్య, జ్వాలా నరసింహారావు, గడిల నరేష్, ధనియాకుల వెంకటనారాయణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పారమిత విద్యాసంస్థల అధినేత జన్మదిన వేడుకలు



**కరీంనగర్ ఆగస్టు 04 (జనంసాక్షి) :** అనాథ ఆశ్రమానికి నిత్యావసర సరుకుల పంపిణి, ఔన్నత్యం చాటుకున్న విద్యార్థులు నగరంలోని పారమిత విద్యాసంస్థలలో పారమిత పాఠశాలల అధినేత డా. ఇనుగంటి ప్రసాదరావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంనగర్ పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీ లోని 'వీరబ్రహ్మేంద్ర స్వామి అనాథ వృద్ధ ఆశ్రమం" ఆశ్రమానికి పారమిత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫిలాంత్ర ఫి ట్రస్ట్ ద్వారా అనాదలకు నిత్యావసర సరుకులు అందించారు. పంపిణీలో భాగంగా 7 క్వింటాళ్ళ బియ్యం, 15 కిలోలు చింతపండు, 32 కిలోలు కందిపప్పు, 31 కిలోలు పెసరపప్పు, 31 కిలోల నూనె లను పారమిత పిల్లల నుండి సేకరించారు. ఆశ్రమ నిర్వాహకులైన సీపెల్లి వీరమాదవ్ స్వచ్ఛంద సంస్థకు అందించారు. అలాగే పాఠశాల యాజమాన్యం 51 వేల రూపాయలు నగదు రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా పారమిత పాఠశాలల అధినేత మాట్లాడుతూ... పిల్లలో దానగుణం పెంపొందించి వారిలో ఔదార్య బుద్ధిని అలవరచాలనే సత్సంకల్పంతో ఫిలాంత్రఫి ట్రస్టు ఏర్పాటు చేశామని ఈ ట్రస్టు వలన బాల్య దశ నుండే ఆపదల్లో ఉన్నవారిని ఎలా ఆదుకోవాలి, దాన ధర్మాల ఆవశ్యకత గురించి స్వయంగా నేర్చుకుని సమాజానికి ఆదర్శప్రాయులు గా నిలుస్తున్నారని సంతోషాన్ని వ్యక్తం చేసారు. ఇలాగే భవిషత్తులో పారమిత నుండి అనేక సామజిక కార్యక్రమాలకు శ్రీకారం చుడతామన్నారు. ఈ సందర్భంగా పారమిత 30 వసంతాలు పూర్తిచేసుకున్న శుభవేళ విద్యార్థులు 30 అంకెల ఆకృతిలో చేసిన ఏర్పాటు , సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం అందరినీ ఆకట్టుకున్నాయి . ఈ కార్యక్రమంలో పారమిత డైరెక్టర్లు ప్రసూన, ప్రసాదరావు, రశ్మిత, రాకేశ్, ప్రాచీ, అనుకర్ రావు, వినోదరావు, టి. యస్వీ. రమణ, వి.యు.ఎం. ప్రసాద్, హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు గోపి కృష్ణ , ప్రశాంత్, బాలాజీ, శ్రీకర్, శర్మిష్ఠ, కవిత ప్రసాద్ సమన్వయకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జిల్లాలో పకడ్బందీగా.. డీ-వార్మింగ్ డే





### నిజామాబాద్ జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

**నిజామాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 04 (జనం సాక్షి) :** జిల్లా వ్యాప్తంగా డీ - వార్మింగ్ డే ను పకడ్బందీగా నిర్వహించాలని, దీనిలో భాగంగా నులిపురుగుల నివారణ మాత్రను 0 - 19 వయస్సు కలిగిన ప్రతీ ఒక్కరికి అందించాలని నిజామాబాద్ జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో సోమవారం డీ-వార్మింగ్ డే కార్యక్రమంపై జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలోని విద్యార్థినీ విద్యార్థులు, మదరసాలు, అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లలు, బడిబయట ఉన్న పిల్లలందరికీ నులిపురుగుల నివారణ కోసం అల్బెండజోల్ మాత్రను అందించాలని తెలిపారు. ప్రతీ పాఠశాలలో, కళాశాలల్లో ఒక నోడల్ అధికారిని నియమించాలని సూచించారు. భోజనం తిన్న తరువాత ఈ మాత్రను పిల్లలకు వేయాలని తెలిపారు. పిల్లలలో రక్త హీనత, బరువు తగ్గుదల, తదితర వ్యాధుల నుండి కాపాడడానికి అల్బెండజోల్ మాత్ర దోహదపడుతుందని అన్నారు. ఈ మాత్ర వేసుకోవడం ద్వారా ఎనీమియా, ఇతర ఆరోగ్య సమస్యలు రాకుండా ఉంటాయన్నారు. డీ-వార్మింగ్ డే కార్యక్రమం గురించి జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపల్ పట్టణాలు, గ్రామాలలో విస్తృత ప్రచారం చేపట్టి ప్రజలలో అవగాహన పెంపొందించాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీలలో మైకుల ద్వారా, మున్సిపల్ పట్టణాలలో చెత్త సేకరణ వాహనాలలో అనౌన్స్ మెంట్ ద్వారా ప్రచారం చేయాలని సూచించారు. ఈ నెల 9, 11 వ తేదీలలో రెండు రోజుల పాటు తప్పనిసరిగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని పాఠశాలలు, కళాశాలల నోటీసు బోర్డులు, బ్లాక్ బోర్డులపై డీ-వార్మింగ్ డే కార్యక్రమం గురించి రాయించాలని అన్నారు. ఆహార పదార్థాలు తినే ముందు పిల్లలు చక్కగా చేతులు శుభ్రం చేసుకునేలా పాఠశాలల్లో అవగాహన పెంపొందించాలని అన్నారు. బాలల సంరక్షణ కేంద్రాలు, రెస్క్యూ హోంలు, అనాథ బాలల ఆశ్రమాలలో కూడా విధిగా డీ-వార్మింగ్ కార్యక్రమం అమలయ్యేలా చూడాలన్నారు. విద్య, వైద్యరోగ్య, మహిళా శిశు సంక్షేమ శాఖలతో పాటు మెప్మా, ఐకేపి, మున్సిపల్ సిబ్బంది, ఐ.ఎం.ఏ ప్రతినిధులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు అందరూ భాగస్వాములై, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. ఆయా సంస్థల వారీగా మండల స్థాయిలో కూడా సన్నాహక సమావేశాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నెల 11న అన్ని చోట్ల అల్బెండజోల్ మాత్రలు ప్రతి విద్యార్థికి వేశారా లేదా అన్నది పక్కాగా నిర్ధారిస్తూ, ఒకవేళ ఎవరైనా తప్పిపోతే అలాంటి వారిని సైతం గుర్తించి మలివిడతగా ఈ నెల 18న నులి పురుగు నివారణ మాత్ర వేయించాలని అన్నారు.

ఇదివరకు డీ-వార్మింగ్ డే కార్యక్రమం అమలు కాని విద్యా సంస్థలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. అనంతరం డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ మాట్లాడుతూ, ఈ నెల 11న నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందని, ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 4,05,443 మంది ఒకటి నుండి 19 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన వారికి మాత్రలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. మాత్ర వేసుకున్న తదుపరి ఎవరికైనా వాంతులు అయితే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అత్యవసరమైతే సమీప ఆసుపత్రి, పీ.హెచ్.సికి తీసుకెళ్లాలని సూచించారు. ఇప్పటికే అన్ని ప్రాంతాలలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామని, నోడల్ అధికారులను గుర్తించామని అన్నారు. ఈ సందర్భంగా డీ-వార్మింగ్ డేను పురస్కరించుకుని రూపొందించిన గోడ ప్రతులను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, డీపీఓ శ్రీనివాస్ రావు, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అశోక్, డీడబ్ల్యూఓ రసూల్ బీ తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ శాఖల సమన్వయంతో
# ఆపరేషన్ ముస్కాన్-11విజయవంతం

- కమిషనరేట్ పరిదిలో 193 మంది విముక్తి..18 కేసులు నమోదు..
- రామగుండం సిపి అంబర్ కిషోర్



**గోదావరిఖని, జనంసాక్షి :** బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి సంవత్సరంలో రెండు సార్లు ఆపరేషన్ స్మైల్, మరియు ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలను నిర్వహించి తప్పిపోయిన/ వదిలివేయబడిన, వివిధ రకాల బాల కార్మికులు కిరాణం షాప్‌లలో, మెకానిక్ షాపులలో, హోటళ్లలో, వివిధ కంపనీలలో పనిచేస్తూ మరియు రోడ్డుపై భిక్షాటన చేస్తున్న పిల్లలు బాల కార్మికులుగా ఉన్నట్లయితే అలాంటి వారిని గుర్తించి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి వారికి అప్పగించడం, లేదా చిల్డ్రన్ హోమ్ కు పంపించడం జరుగుతుంది. దానిలో భాగంగా కమిషనరేట్ వ్యాప్తంగా ఆపరేషన్ ముస్కాన్-11 కార్యక్రమం పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పోలీస్ అధికారులు, సిబ్బంది మరియు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, లేబర్ డిపార్ట్మెంట్, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్, చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్మెంట్, హెల్త్ డిపార్ట్మెంట్, వివిధ శాఖల సమన్వయంతో ఆపరేషన్ ముస్కాన్ విజయవంతంగా ముగిసిందని రామగుండము పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. రామగుండము కమిషనరేట్ పరిధిలో ప్రతి డివిజన్ పరిధిలో ఒక ఎస్ఐ మరియు నలుగురు సిబ్బందిని నియమించి టీం లు ఏర్పాటు చేసి ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థలను గుర్తించి విస్తృతంగా తనిఖీలు నిర్వహించడం జరిగిందని అన్నారు. ఈ సంవత్సరం జూలై 1 నుండి 31 వరకు ఆపరేషన్ స్మైల్-11 కార్యక్రమాన్ని కమిషనరేట్ వ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించడం జరిగిందనీ, దానిలో కమిషనరేట్ పరిదిలో (193) మంది బాల బాలికలను గుర్తించడమైనదని తెలిపారు. లిపెద్దపల్లి జిల్లా పరిదిలో బాలురు-52, బాలికలు-19 మొత్తం మంది-71, 06 కేసులు నమోదు చేసి 08 బాలకార్మికులనిలి విముక్తి చేసి పాఠశాల లో చేర్పించడం జరిగినది. మంచిర్యాల జిల్లా పరిదిలో బాలురు-84, బాలికలు-38, మొత్తం మంది-122 మంది మరియు 12 కేసులు నమోదు చేసి 13 మంది బాలకార్మికులనిలి విముక్తి చేసి పాఠశాల లో చేర్పించడం జరిగింది. ఈ సందర్బంగా సిపి మాట్లాడుతూ బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉన్నదని, బాల కార్మిక వ్యవస్థ నిర్ములన కోసం బాధ్యతా యుతంగా కృషి చేయాలని కోరారు. బాలల హక్కులను, బాలకార్మిక వ్యవస్థ ను నిర్మూలించడానికి ఆపరేషన్ స్మైల్, ముస్కాన్ కార్యక్రమాలను నిరంతరం నిర్వహించడం జరుగుతుందనీ, అలాగే ఎవరైనా బాలలను పనిలో పెట్టుకున్న, ఎక్కడైనా పనిచేసిన, తప్పిపోయిన వదిలివేయబడిన బాలల సమాచారం తెలిసిన వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 (చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్) వారికి మరియు డైల్ 100కి కాల్ చేసి పోలీసు వారికి సమాచారం ఇవ్వగలరనీ తెలిపారు. బాలకార్మికులుగా పెట్టుకున్న వారిపై కూడా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. పోలీసు శాఖతో కలిసి ఆపరేషన్ స్మైల్ విజయవంతం చేయడంలో కృషి చేసిన వివిధ శాఖల అధికారులను, సిబ్బందిని సీపీ అభినందించారు.

# శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలి

### వేములవాడ ఏఎస్పి శేషాద్రిని రెడ్డి



**వేములవాడ (గ్రామీణం, ఆగస్టు 4 (జనంసాక్షి):** శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా గ్రామాల్లో పకడ్బందీగా విజిబుల్ పోలీసింగ్ ని అమలు చేస్తూ నిఘా పెంచాలని వేములవాడ ఏఎస్పి శేషాద్రిని రెడ్డి అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్లను సోమవారం ఆమె తనిఖీ చేసి స్టేషన్ నిర్వహణ, పోలీసుల పనితీరు, వారికి కేటాయించిన కిట్ ఆర్టికల్స్, జనరల్ డైరీ, స్టేషన్ రికార్డులు పరిశీలించి పెండింగ్ కేసులపై క్షుణ్ణంగా రివ్యూ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోవు స్థానిక సంస్థలు ఎన్నికలకు అధికారులు, సిబ్బంది సంసిద్ధంగా ఉండాలన్నారు. అధికారులు, సిబ్బంది తరచూ గ్రామాలను సందర్శిస్తూ ప్రజలతో మంచి సత్సంబంధాలు కొనసాగించాలని, గ్రామాల్లో ఏ చిన్న సంఘటన జరిగిన వెంటనే తెలిసేలా ఇన్ఫర్మేషన్ వ్యవస్థ పటిష్టం చేయాలన్నారు. పోలీస్ స్టేషన్ల పరిధి లోని రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలని, ప్రతి నెలా వారికి సంబంధించిన నూతన సమాచారం సేకరించి నమోదు చేసుకోవాలని ఆదేశించారు. వాహనాల తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. అనంతరం స్టేషన్ ఆవరణలో అధికారులతో కలసి మొక్కలు నాటారు. ఆమె వెంట వేములవాడ రూరల్ సి.ఐ శ్రీనివాస్, ఎస్.ఐ అంజయ్య, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# కనుమరుగవుతున్న కాలువలను పరిశీలిస్తున్న డి రవికుమార్



**ముస్తాబాద్ ఆగస్టు 04 (జనం సాక్షి) :** ముస్తాబాద్ పెద్ద చెరువు ఎడమ కాలువ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న డి ఈ రవికుమార్ మండల కేంద్రంలోని పెద్ద చెరువు ఎడమ కాలువ తూము చెరువు కట్టను సోమవారము నీటిపారుదల శాఖ ముస్తాబాద్ సబ్ డివిజన్ ఇంజనీర్ పరిశీలించారు. ఇటీవల మంజూరై జరుగుతున్న పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి త్వరగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. కాలువల పరిస్థితిపై ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న సమస్యలను అధికారులకు నివేదించడం జరిగిందని కొన్ని పనులు జరుగుతున్నాయని మరికొన్ని పనులు త్వరలో ప్రారంభిస్తామని ఆయన తెలిపారు ఆయకట్టుకు వెళ్లే పిల్ల కాలువలు కొంతమంది రైతులు కబ్జా చేస్తున్నారు, కాల్వ పక్కన ఉన్నటువంటి ఆ స్థలాన్ని కూడా రైతులు కబ్జా చేస్తున్నారు, ఎన్నిసార్లు చెప్పినా రైతులు వినిపించుకోవడం లేదు వ్యవసాయ పొలాల కాడికి పోవడానికి కూడా దారి లేకుండా చేస్తున్నారు, అలాంటి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు పూర్వకాలం నుండి ఉన్నటువంటి కాలువలు కనుమరుగైంది పోయాయి కనీసం ఇప్పుడు చివరి వరకు కూడా నీరు పోవడానికి అవకాశం లేకుండా పోయింది ,కనుమరుగయ్యాయని వాటిపై దృష్టి పెట్టి పునరుద్ధరణ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు, రైతులు సహకరించాలని కోరారు ఇక్కడ ఏ ఈలు వంశీకృష్ణ, నవీన్ సిబ్బంది పాల్గొన్నారు

## బాలుడిపై.. కేసు నమోదు

**బంజారాహిల్స్:** :బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో 13 ఏళ్ల బాలుడు కారు నడుపుతూ సైకిల్‌పై వెళ్తున్న వృద్ధుడిని ఢీకొట్టిన ఘటన జరిగింది. మల్లేపల్లి సమీపంలోని మాంగార్‌బస్తీలో నివాసముంటున్న ఎండీ. షమీమ్ (70) సైకిల్‌పై కూరగాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఉదయం ఇంటి నుంచి బయలుదేరి మాసాబ్‌ట్యాంక్ మీదుగా బంజారాహిల్స్ రోడ్ నెం. 1లో వెళ్తుండగా, రోడ్ నెం. 11లోని సర్వీ హోటల్ సమీపంలో వెనక నుంచి వచ్చిన స్విఫ్ట్ కారు (టీజీ08సీ6385) అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కిందపడిన షమీమ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కారును 13 ఏళ్ల బాలుడు నడుపుతున్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బాలుడితో పాటు అతడికి కారు ఇచ్చిన వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# కరీంనగర్‌లో అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

- దొంగిలించిన సొత్తు కొనుగోలుదారు అరెస్ట్
- కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం






**కరీంనగర్ జిల్లా బ్యూరో, ఆగస్టు 04 (జనంసాక్షి):** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నిజామాబాద్ జిల్లా కమ్మరపల్లి గ్రామానికి చెందిన, ప్రస్తుతం ఏసపల్లి ఆర్మూర్ మండలంలో నివాసముంటున్న టేకు చిరంజీవి (22) అనే అంతర్ జిల్లా దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇతని నుండి 18 తులాల బంగారం, 164 తులాల వెండి, రూ. 1,00,000 నగదు, ఒక మొబైల్ ఫోన్, దొంగతనాలకు ఉపయోగించిన మారుతి ఫ్రాంక్స్ కారు (నం. టిజి-16-ఎ-7015), ఇనుప రాడ్లు, గ్లౌజులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హార్వెస్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న చిరంజీవి, జల్సాలకు అలవాటు పడి, సులువుగా డబ్బు సంపాదించేందుకు పగలు తాళం వేసిన ఇళ్లను గుర్తించి, రాత్రిపూట చోరీలకు పాల్పడేవాడు. 2025 మే 7న నిజామాబాద్ జిల్లా వేల్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పచ్చల నడ్కుడ గ్రామంలో 66 గ్రాముల బంగారం దొంగిలించి, తన తండ్రి గంగ సాయిలు సహాయంతో నందిపేటలోని బంగారు నరసయ్య (44)కు రూ. 1,14,000కు విక్రయించాడు. జూన్ 10, 2025న కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలంలో పావు తులం బంగారు గొలుసు, 4 తులాల వెండి గొలుసులు, రూ. 5,000 నగదు, జూన్ 30న రామడుగు మండలం శానగర్ గ్రామంలో 5 తులాల బంగారు హారం, జూలై 16న మానకొండూరు మండలం గంగిపల్లి గ్రామంలో ఒక తులం బంగారు చైన్, 6 తులాల వెండి, రూ. 30,000 నగదు, జూలై 22న తిమ్మాపూర్ మండలం పోరండ్ల గ్రామంలో మూడు ఇళ్లలో 2.75 తులాల బంగారం, 20 తులాల వెండి, రూ. 1,65,000 నగదు, జూలై 23న చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి గ్రామంలో మూడు చోట్ల 5.5 తులాల బంగారం, 90 తులాల వెండి, జూలై 24న గన్నేరువరం మండలం చీమలకుంటపల్లి గ్రామంలో 3 తులాల బంగారం, 25 తులాల వెండి దొంగిలించాడు. దొంగిలించిన సొత్తును కొనుగోలు చేసిన నందిపేటకు చెందిన బంగారు నరసయ్యను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసును ఛేదించిన ఏసిపి వెంకటస్వామి, సి.సి.ఎస్ ఏసిపి జాన్ నర్సింహులు, తిమ్మాపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సదన్ కుమార్, సి.సి.ఎస్ ఇన్స్పెక్టర్ ప్రకాష్, ఎల్.ఎం.డి. ఎస్సై శ్రీకాంత్, క్రైమ్ పార్టీ కానిస్టేబుళ్లు నరేష్, జైపాల్, సీసీఎస్ కానిస్టేబుళ్లు రాజశేఖర్, వేణుగోపాల్, అనిల్, అవినాష్‌లను కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అభినందించారు. దొంగతనాల నివారణకు నిఘా పెంచామని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

# నగరంలో మినిస్టర్ క్యాంప్ కార్యాలయం ప్రారంభం

### ప్రజా సమస్యల పరిష్కార వేదికగా ప్రారంభించిన కార్యాలయాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్



**కరీంనగర్ జిల్లా బ్యూరో, ఆగస్టు 04 (జనంసాక్షి) :** కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యాలయాన్ని ప్రారంభించిన రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్. వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ...తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వంలో ప్రజలకు అందుబాటులో ఉండాలి హుస్నాబాద్ శాసనసభ్యునిగా, కరీంనగర్ మాజీ పార్లమెంటు సభ్యునిగా, లోక్ సభ పరిధిలో ఉన్నటువంటి ప్రజా సమస్యల పరిష్కారం కోసం గతంలో ఉన్నటువంటి కార్యాలయం కొంత ఇబ్బందికరంగా ఉన్న కారణంగా నూతన కార్యాలయాన్ని నిర్మించి సోమవారం రోజు ప్రారంభించుకోవడం జరిగింది.

ప్రజల సేవల కోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికగా ప్రారంభించిన ఈ కార్యాలయం నుండి లోక్ సభ నియోజకవర్గంలోని ప్రజాసమస్యల ప్రజా సమస్యల పరిష్కారంతోపాటుగా అభివృద్ధికి సంబంధించి కార్యాలయంలో సిబ్బందితో సహా ఆర్జీలు, విజ్ఞాపన పత్రాలు, సీఎం సహాయనిధి ఇతర దరఖాస్తుల స్వీకరణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమాచారం అందుబాటులో ఉంటుంది ముఖ్యమంత్రి నాయకత్వంలో పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో ఈ కార్యాలయం అన్ని రకాలుగా ఈ కార్యాలయం వేదికగా ఉంటుంది ప్రజలందరూ ఈ కార్యాలయాన్ని వినియోగించుకోవాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ లోక్ సభ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వెలిచాల రాజేందర్ రావు, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, నాయకులు ఆకారపు భాస్కర్ రెడ్డి, పడాల రాహుల్, గడ్డం విలాస్ రెడ్డి, వైద్యుల అంజన్ కుమార్, పులి ఆంజనేయులు గౌడ్, కర్ర సత్య ప్రసన్న రెడ్డి, మడుపు మోహన్, మల్యాల సుజిత్, యం.డి.తాజ్, శ్రావణ్ నాయక్, బోనాల శ్రీనివాస్, కంకణాల అనిల్ కుమార్, ఎస్. ఎ.మోసీన్, ముద్దం తిరుపతి, ఎస్ఎల్, గౌడ్, తాళ్ళపెల్లి శ్రీనివాస్ గౌడ్, ఆకుల ప్రకాష్, పడిశెట్టి భూమయ్య, కట్ల సతీష్ పాల్గొన్నారు.

*కేంద్ర ప్రభుత్వం అమోదించిన నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో ఏఐ డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, బిగ్ డేటా కోర్సులకు తెలంగాణ వ్యాప్తంగా ఆన్‌లైన్ శిక్షణ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నేషనల్ స్కిల్ అకాడమీ డైరెక్టర్ వెంకటరెడ్డి తెలిపారు.*




## ప్రాంతీయ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ మొబైల్ ల్యాబ్ వ్యాన్ ప్రారంభించిన పోలీస్ కమిషనర్

**ఖమ్మం (జనం సాక్షి) :** నేర పరిశోధనలో కీలకంగా ఉపయోగపడే ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ మొబైల్ ల్యాబ్ వ్యాన్ ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ప్రారంభించారు. నేరం జరిగిన ప్రదేశానికి వెళ్లి తక్షణమే పరీక్షలు నిర్వహించేందుకు వీలుగా ఈ వాహనం పూర్తి సదుపాయాలతో కూడిన మొబైల్ ల్యాబ్ గా పని చేస్తుందని పోలీస్ కమిషనర్ అన్నారు. నేరం జరిగిన ప్రదేశానికి వెళ్లి, ఆయా ప్రదేశంలో లభించిన అన్ని రకాల సాక్ష్యాలను (ఫింగర్‌ప్రింట్స్, రక్తపు నమూనాలు, ఇతర ఆధారాలు) సేకరించి, ప్రాథమిక విశ్లేషణలు చేసే ఈ వాహనం నేర పరిశోధనలో చాలా ముఖ్యమైనదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఆర్ ఏసీపీ సుశీల్ సింగ్, డాక్టర్ వి. నాగలక్ష్మి (శాస్త్రీయ అధికారి) కె. సుధాకర్ (శాస్త్రీయ అధికారి) కె. నరసింహ (అసిస్టెంట్ డైరెక్టర్)ఆర్ ఐ కామరాజు, శ్రీశైలం, సురేష్, నాగులుమీరా, పాల్గొన్నారు.



## క్రిస్ వోక్స్ రియల్ హీరో..!

క్రికెట్‌లో ఒంటి చెత్తో బ్యాటింగ్ అంటే మాటలు కాదు. ఒకవైపు వికెట్లు పడిపోతుంటే.. తన తోటి ఆటగాళ్లు క్యాబిన్‌కి పరుగు పెడుతుంటే.. క్రీజ్ మీద ఒంటరిగా నిలబడి జట్టు గౌరవాన్ని కాపాడే బ్యాట్స్‌మెన్ నిజంగా హీరో. అలాంటి సందర్భాల్లో జట్టుకు పునాదిగా నిలిచేవాడే అసలైన వీరుడు. అలాంటి ఓ సందర్భమే ఓవల్ వేదికగా ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో జరిగింది. లండన్‌లోని కెన్నింగ్టన్ ఓవల్ వేదికగా భారత్ ,ఇంగ్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న ఐదో టెస్టు మ్యాచ్‌లో టీమిండియా అద్భుతం చేసింది. ఇంగ్లాండ్‌పై థ్రిల్లింగ్ విక్టరీ కొట్టి.. సిరీస్‌ను సమం చేసింది. ఇంగ్లాండ్ పై ఓడిపోయే టెస్టులో 6 పరుగుల తేడాతో సూపర్ విక్టరీ నమోదు చేసింది. ఐదో రోజు గెలుపుకి నాలుగు వికెట్లు కావాల్సి ఉండగా.. భారత బౌలర్ మహ్మద్ సిరాజ్ 5 వికెట్లు, ప్రసిద్ధ్ కృష్ణ 4 వికెట్లు తీసి టీమిండియా విజయంలో కీలక పాత్ర పోషించారు..ఈ మ్యాచ్ తొలి రోజు ఆటలో క్రిస్‌వోక్స్ గాయపడిన సంగతి తెలిసిందే. బౌండరీ లైన్ వద్ద ఫీల్డింగ్ చేస్తూ క్రిస్ వోక్స్ గాయపడగా.. అతని భుజానికి తీవ్ర గాయమైంది. గాయం కారణంగా అతడు చేతికి స్లింగ్ తగిలించుకుని కనిపించాడు. దీంతో అతను ఈ మ్యాచ్‌కు పూర్తిగా దూరమైనట్లేనని అందరూ భావించారు. ఇంగ్లాండ్ ఆటగాళ్లు ఒక్కొక్కరిగా పెవిలియన్‌కి వెళ్తుండటం.. మరో వికెట్ పడితే మ్యాచ్ భారత్ గెలవడం ఖాయం అనుకున్నప్పుడు.. అప్పుడు వచ్చాడు క్రీజులోకి క్రిస్ వోక్స్.

## విడాకులపై సైనా-కశ్యప్ యూటర్న్

ఇటీవలె విడిపోతున్నట్లు ప్రకటించిన బ్యాడ్మింటన్ జంట సైనా నెహ్వాల్, పారుపల్లి కశ్యప్ మళ్లీ ఒక్కటయ్యారు. ఈ మేరకు "మళ్లీ ప్రయత్నిస్తున్నాం" అంటూ సైనా శనివారం ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఓ పోస్ట్ చేసింది. "కొన్నిసార్లు దూరం వల్ల ఉనికి విలువ తెలుస్తుంది. బంధాన్ని కొనసాగించేందుకు మేము మళ్లీ ప్రయత్నిస్తున్నాం" అని పోస్ట్?లో పేర్కొంది. కశ్యప్?తో కలిసి ఉన్న ఫొటోను ఆమె షేర్? చేశారు.కాగా, అంతకుముందు గత నెలలో సైనా నెహ్వాల్, పారుపల్లి కశ్యప్ తమ ఏడేళ్ల వివాహ బంధానికి ముగింపు పలుకుతున్నట్లు ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్వయంగా సైనా వెల్లడించారు. ఎంతో ఆలోచించి, చర్చించిన అనంతరం తాను, కశ్యప్ విడిపోవాలని నిర్ణయించుకున్నట్లు సైనా ప్రకటించారు. "జీవితం కొన్ని సార్లు మనల్ని విభిన్న మార్గంలోకి తీసుకెళ్తుంది. సుదీర్ఘ చర్చలు ఎన్నో ఆలోచనల తర్వాత నేను, కశ్యప్ విడిపోవాలని నిర్ణయించుకున్నాం. ప్రశాంతతను ఎంచుకున్నాం. ఈ సమయంలో మా గోప్యతకు గౌరవం ఇస్తారని భావిస్తున్నాం" అని సైనా తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. హైదరాబాద్?లోని పుల్లెల గోపీచంద్? బ్యాడ్మింటన్ అకాడమీలో శిక్షణ తీసుకుంటుండగా వీరి మధ్య స్నేహం మొదలైంది. ఆ తర్వాత ప్రేమగా మారగా, 2018లో సైనా, కశ్యప్ వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. గత కొంతకాలంగా వరుసగా గాయాల బారిన పడిన సైనా, ఫామ్‌ను కోల్పోయారు. చివరిసారిగా 2023 జూన్‌లో ప్రొఫెషనల్ సర్క్యూట్‌లో ఆడారు. తాను ఆర్థరైటిస్‌తో బాధపడుతున్నట్లు గతేడాది ప్రకటించిన సైనా, కెరీర్‌పై త్వరలోనే నిర్ణయం తీసుకోనున్నట్లు వెల్లడించారు. సైనా ఒలింపిక్? కాంస్య పతకం, ప్రపంచ నెంబర్? వన్? ర్యాంకింగ్?తో ప్రపంచ ఐకాన్?గా మారారు.సైనా అద్భుత కృషికి గానూ 2009లో అర్జున అవార్డు, 2010లో రాజీవ్ గాంధీ ఖేల్ రత్న అవార్డులన్ను ఆమె అందుకున్నారు. సైనా ప్రధాన బ్యాడ్మింటన్ పోటీల్లో భారత్?కు ప్రాతినిధ్యం వహించడమే కాక వివిధ ట్రోఫీలు, పతకాలను కూడా సాధించారు. క్రీడల్లో ప్రపంచ నంబర్ 1 ర్యాంకింగ్‌ను కలిగి ఉన్న ఏకైక భారత మహిళా క్రీడాకారిణిగా రికార్డ్ నెలకొల్పారు. మరోవైపు, కాంపిటీటివ్ బ్యాడ్మింటన్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన కశ్యప్, ఆ తర్వాత కోచింగ్‌పై దృష్టిపెట్టారు.

# శభాష్ టీమిండియా

## భారత్ అద్భుత విజయం

- రసవత్తరంగా సాగిన మ్యాచ్
- భారత్ 6 పరుగుల తేడాతో విన్
- ఐదు టెస్టుల సిరీస్ 2-2తో సమం

లండన్ ఓవల్ టెస్టులో భారత్ 6 పరుగుల తేడాతో అద్భుత విజయం సాధించింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్ 2-2తో సమం కాగా, రసవత్తరంగా సాగిన ఈ మ్యాచ్‌లో టీమ్ ఇండియా అద్భుతంగా పోరాడింది. 339-6 స్కోరుతో ఐదో రోజు ఆట ప్రారంభించిన ఇంగ్లాండ్, 35 పరుగులు కావాల్సిన దశలో మరో 28 పరుగులు చేసి చివరి నాలుగు వికెట్లు కోల్పోయి 367కి ఆలౌట్ అయింది. భారత్ 374 పరుగుల లక్ష్యం నిర్దేశించగా, ఐదో రోజు తొలి ఓవర్‌లోనే సిరాజ్ జెమీ స్మిత్ వికెట్ తీసాడు. జెమ్మీ ఓవర్టన్, జోష్ టంగ్ వికెట్లు త్వరగా కూల్చినా, గస్ అట్కిసన్ (29 బంతుల్లో 17 పరుగులు) పోరాడాడు. గాయపడిన వోక్స్ కూడా బ్యాటింగ్‌కు వచ్చి, అట్కిసన్‌తో కలిసి పరుగులు సాధించి భారత అభిమానుల్లో ఉత్కంఠ రేపాడు. చివర్లో సిరాజ్ అద్భుత బంతితో అట్కిసన్‌ను బౌల్డ్ చేసి జట్టుకు విజయం అందించాడు. భారత బౌలర్లలో సిరాజ్ 5, ప్రసిద్ధ్ కృష్ణ 4, ఆకాశ్ దీప్ 1 వికెట్ తీశారు. సిరీస్‌లో తొలి మ్యాచ్‌లో ఇంగ్లాండ్, రెండో మ్యాచ్‌లో భారత్, నాలుగో మ్యాచ్‌లో ఇంగ్లాండ్ విజయం సాధించగా, మూడో టెస్టులో భారత్ ఓడింది. ఐదో టెస్టులో ఈ చారిత్రాత్మక విజయంతో ఆండర్సన్-టెండూల్కర్ ట్రోఫీ 2-2తో డ్రాగా ముగిసింది. భారత్ విజయానికి ఐదు ప్రధాన కారణాలు ఉన్నాయి. సిరాజ్ 9 వికెట్లతో పేస్ అటాక్‌కు నాయకత్వం వహించాడు, అతని బాడీ లాంగ్వేజ్ ప్రసిద్ధ్ కృష్ణ (8 వికెట్లు), ఆకాశ్ దీప్‌లను ప్రేరేపించింది. తొలి ఇన్నింగ్స్‌లో 153కి 6 వికెట్లు కోల్పోయిన భారత్, చివరి 4 వికెట్లతో 71 పరుగులు జోడించి 224 స్కోరు సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో వాషింగ్టన్ సుందర్ 53 పరుగులతో స్కోరును 400కి దగ్గరగా తీసుకెళ్లాడు. ఐదో రోజు కేవలం 4 ఓవర్లలో కొత్త బంతి తీసుకోకుండా పాత బంతితో స్వింగ్‌తో ఇంగ్లీష్ బ్యాటర్లను కట్టడి చేశారు. యశస్వి జైస్వాల్ రెండో ఇన్నింగ్స్‌లో 118 పరుగుల సెంచరీతో 396 స్కోరు సాధించడంలో కీలక పాత్ర పోషించాడు.

### ఐదు వికెట్లతో భారత్‌ను గెలిపించిన సిరాజ్

అంతేకాదు.. ఆదివారం ఇంగ్లండ్ పుంజుకునే అవకాశం ఇచ్చినందుకు బౌలర్లను, గొప్పగా ఆడనందుకు ఆటగాళ్లను నిందించినందుకు తనను క్షమించాలని థరూర్ అన్నారు. 'నాలుగో రోజు ఆట చూశాక భారత జట్టు విజయంపై అనుమానాలు వ్యక్తం చేశాను. కానీ, సిరాజ్ మాత్రం తన శక్తిపై నమ్మకంతో జట్టుకు సూపర్ విక్టరీ అందించాడు. ఓవల్‌లో చిరస్మరణీయ విజయంలో భాగమైన భారత ఆటగాళ్లకు అభినందనలు' అని థరూర్ మరొక ట్వీట్‌లో వెల్లడించారు.

## సిరాజ్ అద్భుత ప్రదర్శనతోనే గెలిచాం

### కెప్టెన్ శుభ్‌మన్ గిల్

**మహమ్మద్ సిరాజ్ అద్భుత ప్రదర్శనతోనే ఓడిపోయే మ్యాచ్‌లో విజయం సాధించామని టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అన్నాడు. అతను జట్టులో ఉండటం తమ అదృష్టమని చెప్పాడు. ఉత్కంఠగా సాగిన ఆఖరి టెస్ట్‌లో టీమిండియా 6 పరుగుల తేడాతో విజయం సాధించింది. 339/6 ఓవర్ నైట్ స్కోర్‌తో ఆఖరి రోజు ఆటను ప్రారంభించిన ఇంగ్లండ్.. 367 పరుగు లకు ఆలౌటైంది. మహమ్మద్ సిరాజ్(5/104) ఐదు వికెట్లతో భారత్‌కు చిరస్మరణీయ వియాజయాన్నందించాడు. సిరాజ్‌తో పాటు ప్రసిధ్ కృష్ణ(4/126) నాలుగు వికెట్లు తీయగా ఆకాష్ దీప్ ఓ వికెట్ పడగొట్టాడు. ఈ గెలుపుతో ఐదు టెస్ట్‌ల సిరీస్ 2-2తో సమంగా నిలిచింది. ఈ సిరీస్‌లో అసాధారణ బ్యాటింగ్ ప్రదర్శన కనబర్చిన శుభ్‌మన్ గిల్.. భారత్ తరపున ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు. మ్యాచ్ అనంతరం మాట్లాడిన శుభ్‌మన్ గిల్.. కెప్టెన్‌గా ఈ సిరీస్‌ను సమం చేసుకోవడం సంతోషంగా ఉందన్నాడు. 'ఈ సిరీస్ హెూరా హెూరీగా సాగింది. ప్రతీ మ్యాచ్‌లోనూ ఆఖరి రోజు వరకు ఏ జట్టు గెలుస్తుందో కూడా చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఇది ఇరు జట్ల అత్యుత్తమ ప్రదర్శనను తెలియజేస్తోంది. తప్పక గెలవాల్సిన ఈ మ్యాచ్‌లో విజయం సాధించినందుకు చాలా సంతోషంగా ఉంది. సిరాజ్, ప్రసిధ్ కృష్ణ అద్భుతంగా బౌలింగ్ చేయడంతో కెప్టెన్‌గా నా పని సులువైంది. బంతి రెండు వైపులా స్వింగ్ కావడంతో ఇంగ్లండ్ బ్యాటర్లు ఒత్తిడికి లోనయ్యారు. ఈ ఉదయం మా బౌలర్ల స్పెల్ అద్భుతం.**

## కోహ్లీ.. రిటైర్మెంట్ వెనక్కి తీసుకో

### కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ కీలక వ్యాఖ్యలు

వల్ వేదికగా భారత్-ఇంగ్లాండ్ మధ్య కీలకమైన ఐదో టెస్టు జరుగుతున్న వేళ, విరాట్ కోహ్లీని ఉద్దేశించి కాంగ్రెస్ సీనియర్ నేత శశి థరూర్ కీలక వ్యాఖ్యలు చేశారు. విరాట్ కోహ్లీని టెస్టు క్రికెట్ నుంచి తన రిటైర్మెంట్ నిర్ణయంపై పునరాలోచించాలని ఎక్స్ వేదికగా విజ్ఞప్తి చేశారు. దేశానికి కోహ్లీ అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. థరూర్ చేసిన ట్వీట్ ఇప్పుడు వైరల్?గా మరింది. ఇంగ్లాండ్ పర్యటనకు ముందు టెస్టు క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తీసుకుంటున్నట్లు కోహ్లీ ప్రకటించారు. నేను ఈ సిరీస్‌లో విరాట్ కోహ్లీని కొన్నిసార్లు మిస్ అయ్యాను. ఈ టెస్ట్ మ్యాచ్‌లో ఆయన లేని లోటు ఎంతగానో కనిపించింది. ఆయన అద్భుతమైన బ్యాటింగ్ నైపుణ్యాలను పక్కన పెడితే, ఆయన ఓర్పు, అభిరుచి, మైదానంలో ప్రేరణ కలిగించే స్వభావం, ఆయన ఉనికి బహుశా ఫలితాన్ని మార్చగలిగే అంశాలు. విరాట్, దేశానికి మీ అవసరం ఉందని అన్నారు. అయితే, థరూర్ చేసిన ఈ ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్?గా మారింది. దీంతో కోహ్లీ అభిమానులు, క్రికెట్ లవర్స్ థరూర్ ట్వీట్?ను కామెంట్లతో హెూరెత్తిస్తున్నారు. చాలా మంది అభిమానులు థరూర్ అభిప్రాయంతో ఏకీభవిస్తూ, విరాట్ కోహ్లీ టెస్టు క్రికెట్‌లోకి తిరిగి రావాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం ఇంగ్లాండ్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో భారత బ్యాట్స్‌మెన్ పటిష్టమైన ప్రదర్శన కనబరిచినప్పటికీ సగటు అభిమాని మైదానంలో 'కింగ్ కోహ్లీ' లేని లోటు స్పష్టంగా కనిపించినట్లు శశి థరూర్ చెప్పుకొచ్చారు.36 ఏళ్ల విరాట్ కోహ్లీ భారత క్రికెట్ చరిత్రలో అనేక మైలురాళ్లను అధిగమించారు. ఆయన భారత్ తరపున 123 టెస్టు మ్యాచ్‌లు ఆడారు.

### టిఎస్ 2వ పోలీస్ డ్యూటీ మీట్ - 2025లో

## సైబరాబాద్ కమిషనరేట్ అద్భుత ప్రతిభ

### సిపి అవినాష్ మహంతి



**శేరిలింగంపల్లి, ఆగస్టు 4 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర రెండవ పోలీస్ డ్యూటీ మీట్ - 2025 లో సైబరాబాద్ కమిషనరేట్ పోలీస్ అధికారులు అత్యుత్తమ ప్రతిభను కనబరచడం ప్రశంసనీయమని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి పేర్కొన్నారు. ఈ మేరకు సైబరాబాద్ కమిషనరేట్ ఆవరణలోని ఆడిటోరియంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక అభినందన సభకు సైబరాబాద్ ట్రాఫిక్ విభాగం జాయింట్ సిపి డాక్టర్ గజరావు భూపాల్ తో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీస్ డ్యూటీ మీట్ - 2025లో ఉత్తమ ప్రతిభను కనబరిచి విజేతలుగా నిలిచిన వారిని, వారి విజయంలో కీలక పాత్రను వహించిన ఆయా విభాగాల కోచ్ లను, మెంటార్లను సిపి అవినాష్ మహంతి ప్రత్యేకంగా అభినందించారు. వరంగల్ పట్టణంలో జులై 31 నుండి ఆగస్టు 2 వరకు తెలంగాణ స్టేట్ 2వ పోలీస్ డ్యూటీ మీట్ ను నిర్వహించిన విషయం విధితమే. ఇందులో రాష్ట్రం నలుమూలలనుండి ఆయా విభాగాలలో ప్రతిభ కలిగిన పోలీస్ అధికారులు పాల్గొనడం జరిగింది. అయితే సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ విభాగం పోలీసు కాంటీన్ జెంట్స్ అత్యుత్తమ ప్రతిభను కనబరుస్తూ మొత్తం 17 పథకాలను గెలవగా అందులో ఆరు బంగారు పథకాలు, 7 వెండి పథకాలు, నాలుగు కాంస్య పథకాలను సాధించి పోటీలలో మెరుగైన స్థానాన్ని అందుకోవడం గర్వకారణమన్నారు. ఫోరెన్సిక్, లా, వీడియోగ్రఫీ, సైబర్ అవేర్నెస్, ఆంటీ సాబ్టేజ్, డాగ్ స్క్వాడ్ మరియు ఫోటోగ్రఫీ రంగాలలో సైబరాబాద్ విభాగం సిబ్బంది ఎంతో నైపుణ్యాన్ని ప్రదర్శించడం విశేషం అన్నారు. పోలీస్ అధికారులు తమ బాధ్యతను గుర్తు ఎరిగినప్పుడు అనుకోకుండానే వారిలోని నైపుణ్యాలు బహిర్గతమవుతాయని, అలాంటప్పుడు ఎలాంటి సవాళ్లను అయినా సరే ఎంతో మనోధైర్యంతో ఎదుర్కొని విజయం సాధించడం ఎన్నో సందర్భాలలో నిరూపితమైందని, ఇది అన్ని రంగాలకు వర్తిస్తుందని సిపి అవినాష్ మహంతి పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ క్రైమ్స్ విభాగం బీసీపీ ముత్యంరెడ్డి, అడిషనల్ డిసిపి రామ్ కుమార్, అడ్మిన్ విభాగం అడిషనల్ డిసిపి రవిచంద్రన్ రెడ్డి, సిటిసి ఎడిసిపి పూర్ణచందర్, సిఎస్ డబ్ల్యూ ఎడిసిపి హనుమంతరావు, సిటిసి ఎసిపి గంగారం, ఇతర పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ఇంగ్లండ్ తిక్క కుదిర్చిన భారత బౌలర్లు

ప్రసిద్ధ్ కృష్ణ, మహ్మద్ సిరాజ్ అద్భుతంగా బౌలింగ్ చేశారు. ఇంగ్లండ్ తిక్క కుదిర్చారు. టెస్ట్ క్రికెట్ చరిత్రలో విదేశీ గడ్డపై జరిగిన ఐదు టెస్ట్‌ల సిరీస్‌లో చివరి మ్యాచ్‌ను భారత్ గెలవడం ఇదే తొలిసారి. గతంలో భారత్ విదేశీ గడ్డపై 16 ఐదు టెస్ట్‌ల సిరీస్‌లను ఆడింది. వాటిలో చివరి టెస్ట్‌లో 6 సార్లు ఓడిపోయింది. చివరి టెస్ట్ మ్యాచ్ 10 సార్లు డ్రాగా ముగిసింది. ఇప్పుడు చివరకు భారత జట్టు విదేశాల్లో జరిగిన ఐదు టెస్ట్‌ల సిరీస్‌లో చివరి మ్యాచ్‌ను గెలుచుకోవడంలో విజయం సాధించింది.

## వరద ముప్పు ప్రాంతాల్లో హైడ్రా సేవలు

### రౌండ్‌ది క్లాక్ కంట్రోల్ రూమ్ (9000113667)కి ఫిర్యాదు చేయండి




**హైదరాబాద్, ఆగస్టు 04 (జనంసాక్షి) :** నగరంలో సోమవారం భారీ వర్షం కురిసింది. గంట వ్యవధిలో 7 నుంచి 8 సెంటీమీటర్ల వరకూ వర్షపాతం నమోదైంది. దీంతో రహదారులు, లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. భారీ వర్షం పడే అవకాశాలను రెండు గంటల ముందుగానే గ్రహించిన హైడ్రా కమిషనర్ క్షేత్ర స్థాయిలో ఉండే అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేశారు. ప్రజావాణి ఫిర్యాదులను పరిశీలిస్తున్న సమయంలోనే భారీ వర్షం కురవడంతో హైడ్రా కమిషనర్ నేరుగా వరద ముప్పు ఉన్న ప్రాంతాలకు వెళ్లారు. లకడికాపూల్, ఖైరతాబాద్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. క్షేత్రస్థాయిలో ఉన్న డీఆర్ ఎఫ్ సిబ్బందితో పాటు హైడ్రా మాన్సూన్ ఎమర్జన్సీ బృందాలతో మాట్లాడి వరద ముప్పు లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. కొన్నిచోట్ల చెట్లు విరిగిపడగా.. సిబ్బంది వాటిని తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. మరికొన్నచోట్ల వరదకు చిక్కుకున్న కార్లను పక్కకు తొలగించి వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు. జూబ్లీహిల్స్, జీడిమెట్ల, ఉప్పల్ ఇలా అన్ని ప్రాంతాల్లో జీహెచ్ ఎంసీ, ట్రాఫిక్ పోలీసులతో సమన్వయంగా పని చేసి ట్రాఫిక్ జామ్‌లు లేకుండా చూశారు. రోడ్డు అండర్ బ్రిడ్జిల వద్ద ఆటోమేటిక్ డీవాటర్ పంపులకు తోడుగా హైడ్రా నీటి పంపులను కూడా ఉంచి.. వరద ముప్పు లేకుండా జాగ్రత్త పడ్డారు. ఎక్కడైనా వరద ముప్పు ఉన్నట్లయితే రౌండ్‌ది క్లాక్ పని చేసే హైడ్రా కంట్రోల్ రూమ్ (9000113667)కి ఫిర్యాదు చేయాలని సూచించారు.

## ప్రజావాణి పిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

### ప్రజావాణికి 143 ఫిర్యాదులు : నిజామాబాద్ జిల్లా కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి



**నిజామాబాద్ జిల్లా బ్యూరో, (జనం సాక్షి) :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని నిజామాబాద్ జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 143 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, డీఆర్డీఓ సాయాగౌడ్, డీపీఓ శ్రీనివాస్ రావు, నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్ రెడ్డిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.





## అక్రమ మట్టి, ఇసుక రవాణాపై ఉక్కుపాదం

- అనుమతిలేని తరలింపు పై ప్రత్యేక నిఘా
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బీ గితే ఆధ్వర్యంలో సంయుక్తంగా దాడులు
- కేసులు నమోదు.. వాహనాలు సీజ్
- జరిమానా విధించి ప్రభుత్వ ఖజానాకు జమ

**రాజన్న సిరిసిల్ల బ్యూరో, ఆగస్టు 4 (జనంసాక్షి):** జిల్లాలో మట్టి, ఇసుక అక్రమ రవాణాపై జిల్లా అధికార యంత్రాంగం కఠిన చర్య లు చేపడుతోంది. అనుమతి లేకుండా తరలింపును నియంత్రించే ఒదుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, వరుస దాడులు కొనసాగిస్తు న్నారు. అక్రమ రవాణాదారులపై కేసులు నమోదు చేసి వాహనా లను సీజ్ చేస్తున్నారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బీగితే సహజ వనరుల సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపడు తున్నారు. ప్రభుత్వ పథకాలు, నిర్మాణాల కోసం నిబంధనల మేరకు మట్టి, ఇసుక తరలింపునకు కలెక్టర్ అనుమతి ఇస్తున్నారు.

జూలై 21న ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లో హిటాచి యంత్రం, జూలై 12న ఇల్లంతకుంట మండలం గాలిపెల్లిలో జేసీబీ, ఐదు ట్రాక్టర్లు, జూలై 10న ముస్తాబాద్ మండలం చిప్పలపల్లిలో జేసీబీ, ఐదు ట్రాక్టర్లు, జూన్ 28న వేములవాడ రూరల్ మండలం కొడిముంజ-అనుపురం పరిసరాల్లో ఇందిరమ్మ ఇళ్లకు అని బ్యానర్ కట్టి అక్రమ రవాణా చేస్తున్న 10 టిప్పర్లు, 2 ట్రాక్టర్లు, 2 జేసీబీలు, 2 హిటాచి యంత్రాలు, జూన్ 22న ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లో హిటాచి, జేసీబీ, ఒక టిప్పర్‌ను సీజ్ చేసి పోలీస్ స్టేషన్లు, ఎస్పీ కార్యాలయానికి తరలించారు. నిర్మాణదారులకు ఇసుక, మట్టి సమకూర్చేందుకు తహసీల్దార్లకు ఆదేశాలు జారీ చేశారు. అనుమతి లేకుండా మొరం, మట్టి తరలిస్తున్న 691 వాహనాలను మైనింగ్ శాఖ సీజ్ చేసి రూ. 1,02,026 జరిమానా విధించింది. అక్రమ తవ్వకాలు చేసిన నలుగురిపై రూ. 2,87,515 జరిమానా విధించి ప్రభుత్వ ఖజానాకు జమ చేశారు.

ప్రభుత్వ సెలవు రోజుల్లో ఇసుక, మట్టి తరలింపునకు అనుమతులు ఇవ్వవద్దని, పని దినాల్లోనే అనుమతించాలని కలెక్టర్ సూచించారు. అక్రమ రవాణాను ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయం

- వెల్ది హరిప్రసాద్'కు నాగుల మల్లయ్య"స్మారక పురస్కారం అందజేత
- బీసీ రిజర్వేషన్లపై బిజెపి నిర్లక్ష్యం: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, ఆగస్టు 4 (జనంసాక్షి):** కళాకారులకు ప్రోత్సాహం అందించడం అభినందనీయమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం నాగుల మల్లయ్య స్మారక పురస్కార కమిటీ చైర్మన్, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు నాగుల సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన, సిరిసిల్ల చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్‌కు నాగుల మల్లయ్య స్మారక పురస్కారా న్ని అందజేశారు. నాగుల మల్లయ్య జయంతి సందర్భంగా 38 సంవత్సరా లుగా కళాకారులను ప్రోత్సహిస్తూ అవార్డులు ప్రధానం చేయడం ప్రశంసనీయమని తెలిపారు. కార్యక్రమంలో అవార్డు గ్రహీత వెల్ది హరిప్రసాద్, సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ స్వరూప, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, గడ్డం నరసయ్య, నాగుల మల్లయ్య స్మారక కమిటీ నిర్వాహకులు, అభిమానులు పాల్గొన్నారు. అదే రోజు సిరిసిల్లలో మరో కార్యక్రమంలో మీడియాతో మాట్లాడిన ఆది శ్రీనివాస్, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి బీసీ రిజర్వేషన్లపై పట్టింపు లేదని విమర్శించారు. గల్లీలో సై అంటున్న బిజెపి నేతలు ఢిల్లీలో నై అంటున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ కమ్యూనిటీకి చెందకపోయినా అసెంబ్లీలో 42 శాతం రిజర్వేషన్ల కోసం తీర్మానం చేసి కేంద్రానికి పంపించారని, అయినప్పటికీ బిజెపి నాయకులు బండి సంజయ్, కిషన్ రెడ్డిలు స్పందించడం లేదని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్ల అమలు కోసం ఢిల్లీలో ధర్నా చేస్తామని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సరైన ప్లేస్‌లలో బంతు వేయడంపై దృష్టి పెట్టాను

### మ్యాచ్ అనంతరం మహ్మద్ సిరాజ్ వ్యాఖ్యలు

4వ రోజు ముగిసేసరికి ఇంగ్లాండ్ జట్టుకు కేవలం 37 పరుగులు మాత్రమే కావాలి. ఇంకా చేతిలో నాలుగు వికెట్లు ఉన్నాయి. దీంతో మ్యాచ్ ఎక్కువ శాతం ఇంగ్లండ్‌వైపే మొగ్గుతుందని అంతా భావించారు. కానీ ఐదో రోజు జరగబోయే అద్భుతాన్ని ఊహించిన వాళ్లు చాలా తక్కువమందే ఉండి ఉంటారు. కానీ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణకు వేరే ఆలోచనలు ఉన్నాయి. ఈ ఉదయం సెషన్‌లో వీళ్లిద్దరు ఇంగ్లీష్ మిడిల్ -లోయర్ ఆర్డర్‌ను కూల్చివేశారు. చివరి ఇన్నింగ్స్‌లో మ్యాచ్‌లో సిరాజ్ ఐదు వికెట్లు, కృష్ణ నాలుగు వికెట్లు పడగొట్టారు. ఇది దేశ టెస్టు క్రికెట్ చరిత్రలో ఉన్న గొప్ప టెస్టుల్లో ఒకటిగా నిలిచింది. "నేను ఈ రోజు నిద్ర లేచినప్పుడు నేను దీన్ని చేయగలనని నమ్మాను. అది గూగుల్ నుంచి ఒక ఫోటో తీసి, నేను దీన్ని చేయగలనని నా వాల్‌పేపర్‌గా పెట్టుకున్నాను.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
5 ఆగస్టు 2025

## మిడ్డే మీల్స్ కార్మికుల వేతనాలను పెంచండి

- పీఎం పోషణ్ అభియాన్ మార్గదర్శకాలను అమలు చేయండి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ లేఖ

**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన వంట కార్మికుల వేతనాల పెంపు అంశాన్ని పరిశీలించాలని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్ రెడ్డిని కోరారు. ఈ మేరకు సోమవారం సీఎంకు లేఖ రాశారు. దీంతోపాటు ప్రధానమంత్రి పోషణ్ అభియాన్ పథకం మార్గదర్శకాలను అమలు చేయాలని అందులో పేర్కొన్నారు. కొద్దిరోజుల క్రితం తెలంగాణలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన వంట కార్మిక సంఘం నాయకులు న్యూఢిల్లీలో ధర్మేంద్ర ప్రధాన్ తోపాటు కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ లను కలిసి మధ్యాహ్న భోజన వంట కార్మికుల గౌరవ వేతనాన్ని పెంచాలని కోరుతూ వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పెండింగ్ నిధుల అంశాన్ని సంఘం నాయకులు ప్రస్తావించగా ధర్మాన్ ప్రదాన్ బదులిస్తూ నిధులన్నీ క్లియర్ చేశామని, కేంద్రం వద్ద పెండింగ్ లేదని తేల్చి చెప్పారు. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి పెండింగ్ బిల్లులు మంజూరయ్యేలా క్రుషి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతోపాటు మధ్యాహ్న భోజన కార్మికుల గౌరవ వేతనం రూ.17 వేలకు పెంచాలని, కార్మిక చట్టం కింద సామాజిక భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్ వసతులు కల్పించాలని కోరగా ఈ అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. అందులో భాగంగానే మధ్యాహ్న భోజన వంట కార్మికుల వేతనాలను పెంచాలని కోరుతూ ముఖ్యమంత్రికి లేఖ రాయడం గమనార్హం.

## ఢిల్లీ బీసీ రిజర్వేషన్ ధర్నాకు బీసీ నేతల బృందం




**రామకృష్ణాపూర్, ఆగస్టు 4 (జనంసాక్షి):** 42 శాతం బీసీ రిజర్వేషన్ అమలుకు డిమాండ్ చేస్తూ ఆగస్టు 6న ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద నిర్వహించనున్న ధర్నాలో పాల్గొనేందుకు చెన్నూరు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వొడ్నాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో 30 మంది బీసీ నాయకుల బృందం ఢిల్లీకి బయలుదేరింది. ఈ సందర్భంగా వొడ్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆమోదించబడిన 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లును కేంద్ర ప్రభుత్వం తక్షణమే రాష్ట్రపతికి పంపించి ఆమోదింపజేయాలని డిమాండ్ చేశారు. వారివెంట క్యాతనపల్లి కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు పల్లె రాజు, చెన్నూరు మండలాధ్యక్షుడు బాపు గౌడ్, జిల్లా కార్యదర్శి మొట్టె సుధాకర్, శివారం మాజీ సర్పంచ్ అవిడపు గణేశ్, వేలాల మాజీ ఉప సర్పంచ్ దేగ నగేష్, అస్నాద్ మాజీ సర్పంచ్ రాజన్న, యువజన నాయకులు కునారపు శివ, వెంకట్, కిరణ్ గౌడ్ తదితరులు ఉన్నారు.

# ములుగు అభివృద్ధికి గ్రీన్‌సిగ్నల్

- ఫలించిన సీతక్క పోరాటం
- దశాబ్దాల రహదారి సమస్యకు చరమ గీతం
- తెలంగాణ వైల్డ్ లైఫ్ బోర్డు 9వ సమావేశంలో కీలక నిర్ణయాలు



**హైదరాబాద్, ఆగస్టు 4 (జనంసాక్షి) :** ములుగు జిల్లాలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న రహదారి సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క దీర్ఘకాలంగా చేస్తున్న పోరాటానికి ఫలితంగా, తెలంగాణ రాష్ట్ర వైల్డ్ లైఫ్ బోర్డు 9వ సమావేశంలో ములుగు ఏజెన్సీ ప్రాంతానికి సంబంధించిన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ లభించింది. తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో అటవీ, పర్యావరణ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ అధ్యక్షతన, స్పెషల్ ఇన్వైటీగా మంత్రి సీతక్క నేతృత్వంలో బోర్డు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, మురళి నాయక్, వెడ్మ బొజ్జు పటేల్, రాందాస్ నాయక్‌లు పాల్గొన్నారు. అటవీశాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీం, పీసీసీఎఫ్ సువర్ణతోపాటు పలువురు అధికారులు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏజెన్సీ ప్రాంతాల్లో అభివృద్ధి, వైల్డ్ లైఫ్ ప్రాంతాల గుండా రోడ్లు, ఆప్టికల్ ఫైబర్ కేబుల్స్, సబ్‌స్టేషన్ల నిర్మాణం, స్టాండింగ్ కమిటీ ఏర్పాటు వంటి అనేక అంశాలపై చర్చ జరిగింది. అలాగే మహబూబాబాద్ జిల్లా పాకాల కొత్తగూడెం గ్రామంలో 30 పడకల ఆసుపత్రి నిర్మాణానికి అవసరమైన 0.80 హెక్టార్ల అటవీ భూమిని బదిలీ చేయడంపై నిర్ణయం తీసుకున్నారు. నివాస ప్రాంతాల్లో అటవి జంతుల కట్టడి కోసం నాలుగు క్విక్ రెస్పాన్స్ టీమ్‌లు ఏర్పాటు చేయాలని, ఎకో టూరిజాన్ని ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవాలని, అరణ్య భవనలో ప్రత్యేకంగా టైగర్ సెల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

మంత్రి సీతక్క దీర్ఘకాలంగా చేస్తున్న పోరాటం ఫలితంగా ములుగు ఏజెన్సీ లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు వైల్డ్ లైఫ్ బోర్డు అనుమతులిచ్చింది. మంత్రి సీతక్క ప్రతిపాదనలకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. సీతక్క చొరవతో ఏజెన్సీ గ్రామాల్లో 10 సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న రహదారుల సమస్యలకు ముగింపు లభించింది. ప్రధానంగా ములుగు జిల్లాలోని కంతనపల్లి, లవ్వాల్, కొండపర్తి, కొడిశెల, ఐలాపురం, పాకాల కొత్తగూడెం నుండి దుబ్బగూడెం వరకు రహదారుల నిర్మాణం కోసం చాలా కాలంగా సీతక్క ఫైట్ చేస్తున్నారు. కాని అటవి, పర్యవరణ చట్టాల కారణంగా రహదారుల నిర్మాణానికి అటవి శాఖ అడ్డుచెబుతోంది. అయితే సోమవారం నాడు జరిగిన తెలంగాణ వైల్డ్ లైఫ్ బోర్డు 9వ సమావేశం ఎట్టకెలకు ఆయా గ్రామాల రహదారుల నిర్మాణానికి అంగీకరించింది. మంత్రి సీతక్క ప్రతిపాదించిన ఆయా గ్రామాలకు రోడ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరయ్యాయి. అలాగే పాకాల కొత్తగూడెంలో 30 పడకల ఆసుపత్రి నిర్మాణానికి క్లియరెన్స్ లభించింది. తాడ్వాయి, ఏటూరు నాగారం ప్రాంతాల్లో ఎకో టూరిజం అభివృద్ధి కోసం ప్రత్యేక సఫారీ వాహనాలపై బోర్డు అనుమతులు మంజూరు చేసింది.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ 'అడవులతో ఆదివాసీల జీవితం అనుసంధానమై ఉంది. అటవి చట్టాలు రాక ముందే వారంతా అడవిలోనే నివసిస్తున్నారు. వారి అభివృద్ధికి చట్టాలు అడ్డుకాకూడదు. పోడు భూములకు సరైన సరిహద్దులు గుర్తించాలి. అటవీ భూమి పేరుతో ఆదివాసీలకు ఇబ్బందులు కలిగించకూడదు. వారి జీవితాన్ని కాపాడాలంటే వారి అవసరాలకు అనుగుణంగా చట్టాల అమలు అవసరం. మా ప్రాంతాల్లో రహదారులు లేకపోతే అభివృద్ధి సాధ్యం కాదు" అని స్పష్టం చేశారు. రిజర్వ్ ఫారెస్ట్ ఏరియాల్లో ఉన్న ఆవాసాలకు విద్యుత్, ఆసుపత్రి వంటి మౌళిక వసతులు కల్పించడానికి అభ్యంతరాలు ఎందుకని అటవి శాఖ అధికారులను ప్రశ్నించారు. పోడు భూముల సాగుకు అవసరమయ్యే విద్యుత్ కనెక్షన్ల మంజూరును అడ్డుకోవద్దని సూచించారు. పోడు రైతుల అభ్యంతరాలు తెలుసుకునేందుకు జిల్లా ఫారెస్ట్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. మంత్రి సీతక్క ప్రతిపాదనల పట్ల తెలంగాణ వైల్డ్ లైఫ్ బోర్డు సానుకూలంగా స్పందించింది. ములుగు ప్రాంత అభివృద్ధికి సహకరించిన అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖకు, వైల్డ్ లైఫ్ బోర్డు సభ్యులకు మంత్రి సీతక్క ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఢిల్లీలో 6న కాంగ్రెస్ భారీ ధర్నా

- టిపిసిసి లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి
- బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు చేయాలి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిఎం రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్ ల ఆధ్వర్యంలో ఈనెల 6న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాంగ్రెస్ పార్టీ భారీ ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు టిపిసిసి లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లును ఆమోదింప చేసిందన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కు సంబంధించిన ఆర్డినెన్స్ ను సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం గవర్నర్ కు పంపినట్లు ఆయన పేర్కొన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఎందుకు ఆమోదించడం లేదో స్పష్టతను ఇవ్వాలని డిమాండ్ చేశారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లును రాష్ట్రపతితో ఆమోదింపజేసి 9వ షెడ్యూల్లో చేర్పించి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 5,6,7తేదిల్లో ఢీల్లీలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి నిరసన కార్యక్రమాలను చేపట్టినట్లు, అందులో భాగంగా 5న పార్లమెంటులో వాయిదా తీర్మానం, 6న ఢీల్లీలోని జంతర్ మంతర్ వద్ద భారీ ధర్నా కార్యక్రమం,7న రాష్ట్రపతికి వినతిపత్రం సమర్పణ కార్యక్రమాలను కాంగ్రెస్ చేపట్టిందన్నారు. ఢిల్లీలో నిర్వహించనున్న ఇట్టి కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొననున్నట్లు టిపిసిసి లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి తెలిపారు.

## రఘురామపై కానిస్టేబుల్ కేసు కొనసాగించలేం

- సుప్రీంకు వివరణ
- అఫిడవిట్ సమర్పించాలని ఆదేశిస్తూ విచారణ వాయిదా



**న్యూఢిల్లీ, ఆగస్ట్4 (జనంసాక్షి) :** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, మాజీ ఎంపీ రఘురామ కృష్ణరాజుపై పెట్టిన కేసును ఇక కొనసాగించలేనని సుప్రీంకోర్టుకు ఫిర్యాదుదారు కానిస్టేబుల్ ఫరూక్‌భాష తెలిపారు. 2022 జూన్‌లో రఘురామ, ఆయన కొడుకు భరత్‌పై ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్ ఫరూక్‌భాష కేసు పెట్టారు. రఘురామ ఇంటి వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పట్టుకున్నారు. స్థానిక గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి రఘురామ, ఆయన భద్రతా సిబ్బంది ఫిర్యాదు చేశారు. డ్యూటీలో ఉన్న తనపై దాడికి పాల్పడ్డారని రఘురామ, ఆయన కొడుకు భరత్, సీఆర్‌పీఎఫ్ సిబ్బందిపై అదే పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్ ఫరూక్‌భాష ఫిర్యాదు చేశారు. కానిస్టేబుల్ ఫరూక్‌భాష ఫిర్యాదును పరిగణనలోకి తీసుకున్న గచ్చిబౌలి పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. గచ్చిబౌలి పోలీసులు తమ ఫిర్యాదును పట్టించుకోకుండా... తమపైనే ఎఫ్‌ఐఆర్ నమోదు చేయడాన్ని హైకోర్టులో సవాలు చేశారు రఘురామ. హైకోర్టు తిరస్కరించడంతో సుప్రీంకోర్టును రఘురామ ఆశ్రయించారు. రఘురామ పిటిషన్‌పై జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్ ధర్మాసనం విచారణ జరిపింది. ఎంపీగా వై క్యాటగిరిలో సీఆర్‌పీఎఫ్ భద్రత ఉన్న సమయంలో అనేక ఘటనలు జరిగాయని రఘురామ తరపు సీనియర్ న్యాయవాది ఆదినారాయణరావు ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని పట్టుకుని పోలీసు స్టేషన్‌లో అప్పజెప్పి... ఫిర్యాదు చేస్తే పోలీసులు తమపైనే ఎదురు కేసు పెట్టారని రఘురామ న్యాయవాది వివరించారు. వరుస ఘటనలకు సంబంధించిన వివరాలు కోర్టుకు అందించాలని రఘురామ న్యాయవాదిని ఆదేశించింది సుప్రీంకోర్టు ధర్మాసనం. అదే సమయంలో ఫిర్యాదు దారు కానిస్టేబుల్ ఫరూక్‌భాష తరపు న్యాయవాది జోక్యం చేసుకున్నారు. ఇకపై ఈ కేసును కొనసాగించేందుకు సిద్దంగా ఆయన లేరని తనకు సమాచారం పంపినట్లు- ఫరూక్‌భాష న్యాయవాది తెలిపారు. అందుకు అఫిడవిట్ దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశించింది. విచారణను రెండు వారాలు సుప్రీంకోర్టు ధర్మాసనం వాయిదా వేసింది.


## రూ.7.08 లక్షల కోట్ల జిఎస్టీ పన్ను ఎగవేత

- కేంద్రమంత్రి పంకజ్ చౌదరి వెల్లడి

**న్యూఢిల్లీ, ఆగస్ట్4 (జనంసాక్షి) :** 2024-25 ఆర్థిక సంవత్సరం వరకు ఐదు సంవత్సరాల్లో దాదాపు రూ.7.08లక్షల కోట్ల పన్ను ఎగవేతను కేంద్ర జీఎస్టీ ఫీల్డ్ అధికారులు గుర్తించారు. ఇందులో దాదాపు రూ.1.79లక్షల కోట్ల ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ మోసాలు ఉన్నాయని కేంద్రం తెలిపింది. ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభలో వివరాలను వెల్లడించారు. డేటా ప్రకారం.. 2024-25 ఆర్థిక సంవత్సరంలోనే రూ.2.23 లక్షలకోట్లకుపైగా జీఎస్టీ ఎగవేతను సీజీఎస్‌టీ ఫీల్డ్ అధికారులు గుర్తించారని, 2025 ఆర్థిక సంవత్సరంలో 30,056 జీఎస్టీ ఎగవేత కేసులను గుర్తించినట్లు- ప్రభుత్వం లోక్‌సభకు తెలిపింది. ఇందులో సగానికిపైగా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌కు సంబంధించినవే ఉన్నాయని పేర్కొంది.

## ఇండ్ల నిర్మాణంలో జాప్యం జరగకుండా లబ్ధిదారులను ప్రోత్సహించాలి

- ఇందిరమ్మ నమూనా ఇంటిని ప్రారంభించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**స్టేషన్ ఘన్పూర్, ఆగస్టు 04 (జనంసాక్షి) :** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో జాప్యం జరగకుండా లబ్ధిదారులను ప్రోత్సహించాలని మాజీ ఉపముఖ్య మంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. స్టేషన్ ఘనపూర్ పట్టణకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నిర్మంచిన ఇందిరమ్మ ఇళ్ల నమూనా ఇంటిని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నమూనా ఇంటిని పరిశీలించిన స్థానిక ఎమ్మెల్యే ఇంటి నిర్మాణానికి అయిన ఖర్చు వివరాలను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ గ్రామాలలో కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో జాప్యం జరగకుండా లబ్ధి దారులను ప్రోత్సహించాలని, అలాగే ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లింపులు జరిగే విధంగా చూసుకోవాలని గృహ నిర్మాణ శాఖ అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇండ్లు మంజులైన లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇండ్లు నిర్మించుకొని ఇంటి బిల్లు లు పొందాలని అన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వం అందించే ఐదు లక్షలతో ఇంటిని నిర్మించుకొని లబ్ధి పొందాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్ పర్సన్ జూలుకుంట్ల లావణ్య, ఆర్డీవో డిఎస్ వెంకన్న, తహసిల్దార్ వెంకటేశ్వర్లు,ఎంపీడీవో విజయశ్రీ, హౌసిం గ్ డిఈ చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ అఖిల, ఆర్ఐ లు శ్రీకాంత్, సతీష్, నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 50 శాతం రిజర్వేషన్ల పరిమిత ఎత్తివేయకుండా అడ్డంకి

- బిజెపి తీరుపై మండిపడ్డ పిసిసి ఛీఫ్ మహేశ్ గౌడ్

**యాదాద్రి భువనగిరి, ఆగస్ట్4 (జనంసాక్షి) :** రిజర్వేషన్లపై యాభై శాతం క్యాప్ ను ఎత్తేసేందుకు కేంద్ర ప్రభుత్వం అడ్డుపడుతోందని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో బీసీ రిజర్వేషన్ల అంశంపై మాట్లాడిన ఆయన.. బీజేపీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బీసీ రిజర్వేషన్ బిల్లు గవర్నర్ ద్వారా కేంద్రానికి పంపించామని.. కానీ కేంద్రం ప్రభుత్వం అడ్డుపడుతోందని అన్నారు. బీసీల పట్ల బీజేపీ పార్టీ కి ప్రేమ లేదన్నారు మహేష్ కుమార్ గౌడ్. మొదటి నుంచి బీసీ రిజర్వేషన్ల పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బాహాటంగానే వ్యతిరేకిస్తూన్నారని అన్నారు. ఎస్ సి, ఎస్ టి, బీసీ మైనార్టీల పట్ల ఎందుకు మీకు వివక్ష..? అని కిషన్ రెడ్డి ని సూటిగా ప్రశ్నిస్తున్నట్లు చెప్పారు. ముస్లింలను సాకుగా చూపించి బీసీ బిల్లును అడ్డుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఉత్తరప్రదేశ్ లో బీజేపీ ప్రభుత్వం ఉందని.. ఇక్కడ మెలిక పెడుతున్నవళ్లు అక్కడ ఎలా అమలు చేస్తున్నారని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కావాలని ఆరవతేదీన జంతర్ మంతర్ వద్ద ముఖ్యమంత్రితో సహా అందరూ ధర్నా చేస్తున్నట్లు- తెలిపారు. ఢిల్లీలో చేపట్టనున్న ధర్నా గురించి మాట్లాడిన పీసీసీ చీఫ్.. బీసీ రిజర్వేషన్ల బిల్లు సాధన-కై- పన్నెండు వందల మంది నాయకులు -ట్రైన్ ద్వారా ఢిల్లీ వెళుతున్నట్లు తెలిపారు. వాకిటి శ్రీవారి , పొన్నం ప్రభాకర్, ఇన్ ఛార్జ్ మీనాక్షి నటరాజన్ తో కలిసి చర్లపల్లి నుంచి నాయకుల తో ఆలేరు వరకు -ట్రైన్ లోజర్నీ చేసినట్లు- చెప్పారు.

## సూపర్ సిక్స్ హామీల్లో ఉచిత బస్సు ప్రయాణం

### ఆగస్ట్ 15నుంచి అమలుకు చర్యలు: మంత్రి

**అమరావతి, ఆగస్ట్4 (జనంసాక్షి) :** సూపర్ సిక్స్ హామిల్లో భాగంగా మహిళలకు ఇచ్చిన ఉచిత బస్సు ప్రయాణం హామిని ఈ నెల 15 న తేదీ నుండి రాష్ట్రంలో అమలుకు శ్రీకారం చుడుతున్నట్లు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. సోమవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ ఈ పథకం అమల్లో ఎటు వంటి లోటుపాట్లు, విమర్శలకు అవకాశం లేకుండా రాష్ట్రంలో అమలు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించామన్నారు. వారి ఆదేశాల మేరకు ఇటువంటి పథకాన్ని ఇప్పటికే అమలు చేస్తున్న కర్ణాటక, తమిళనాడు మరియు తెలంగాణా రాష్ట్రాలో అమలు తీరును పరిశీలించేందుకు ముగ్గురు మంత్రులతో కూడిన బృందం ఆయా రాష్ట్రాల్లో పర్యటించి సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందజేయడం జరిగిందన్నారు. ఈ నెల 6న జరిగే క్యాబినెట్ సమావేశంలో దీనికి ఆమోదముద్ర లబించనుందని మంత్రి తెలిపారు. ఈ పథకాన్ని రాష్ట్రంలో సమర్ధ వంతంగా అమలు పర్చేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవడం జరిగరిదన్నారు. ఈ పథకం క్రింద రాష్ట్రానికి చెందిన మహిళలు, ట్రాన్స్‌జెండర్లు ఎక్కడి నుండి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించే అవకశాన్ని కల్పించనున్నారు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ ప్రయాణించేందుకు అవకాశం కల్పించడం జరిగిందని, అయితే ఆధార్, ఓటర్, రేషన్ కార్డులను ఐ.డి. ప్రూఫులుగా చూపించాల్సి ఉంటుందన్నారు.

# ప్రజల ఆరోగ్యమూ ముఖ్యం

- గత ప్రభుత్వంలో నాణ్యతలేని మద్యంతో ప్రజల ప్రాణాలు హరించారు
- మద్యం పాలసీపై అధికారులతో సిఎం చంద్రబాబు సమీక్ష



**అమరావతి, ఆగస్ట్4 (జనంసాక్షి) :** మద్యం పాలసీ అనగానే దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వాలైనా ఆదాయం గురించి చూస్తాయని... కానీ మద్యం పాలసీ అంటే ఆదాయమే కాదని.. ప్రజల ఆరోగ్యమే ముఖ్యమనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఆల్కహాల్ కంటెంట్ తక్కువ ఉన్న మద్యం ద్వారా మద్యం వినియోగదారుల ఆరోగ్యాన్ని చాలా వరకు కాపాడవచ్చని సీఎం అన్నారు. మద్యం పాలసీ అంటే ఆదాయం మాత్రమే అని భావించొద్దని...ప్రజల ఆరోగ్యాలు ప్రధానమైన అంశమనే విషయాన్ని కూడా గుర్తుపెట్టుకోవాలని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో నాణ్యత లేని మద్యం కారణంగా కొన్ని లక్షల కుటుంబాలు నష్టపోయాయన్న విషయాన్ని సీఎం గుర్తుచేశారు. పేదల ఇల్లు, ఒల్లు గుల్ల కాకుండా చూడాల్సిన అవసరం ఉందని సీఎం స్పష్టం చేశారు. సోమవారం సీఎం చంద్రబాబు సచివాలయంలో ఆబ్కారీ శాఖపై రివ్యూ చేశారు. మంత్రులు కొల్లు రవీంద్ర, కొండపల్లి శ్రీనివాస్, అధికారులు ఈ సమీక్షకు హాజరయ్యారు. ప్రస్తుతం ఉన్న బార్ పాలసీ గడువు తీరడంతో.... సెప్టెంబర్ 1 నుంచి కొత్త పాలసీ రావాల్సి ఉంది. అధికారులు సీఎంకు కొత్త పాలసీపై ప్రతిపాదనలు వివరించారు. మంత్రివర్గ ఉపసంఘం ఇచ్చిన నివేదిక, ప్రతిపాదనల ఆధారంగా కొత్త పాలసీకి రూపకల్పన చేసినట్లు- సీఎం తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 840 బార్లు ఉన్నాయి. కొత్త పాలసీలో లాటరీ పద్దతి ద్వారా బార్లకు అనుమతులు ఇస్తారు. 50 వేల లోపు జనాభా ఉంటే రూ.35 లక్షలు, 5 లక్షల లోపు జనాభా ఉంటే రూ.55 లక్షలు, 5 లక్షల పైన జనాభా ఉంటే రూ.75 లక్షల చొప్పున లైసెన్స్ ఫీజు ఏడాదికి పెట్టాలనే సూచన మంత్రివర్గ ఉప సంఘం నుంచి వచ్చింది. కొత్త పాలసీలో అప్లికేషన్ ఫీజ్, లైసెన్స్ ఫీజు ద్వారా రూ.700 కోట్ల ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేశారు. ప్రతి బార్ కు కనీసం 4 అప్లికేషన్లు రావాలనే నిబంధనను పెట్టనున్నారు. బార్ పాలసీలో కూడా గీత కులాలకు 10 శాతం బార్లు దక్కేలా చూడాలని సీఎం స్పష్టం చేశారు. లిక్కర్ షాపుల్లో ఎలా అయితే 10 శాతం వారికి ఇచ్చారో...అదే విధంగా బార్లలో కూడా ఆ వర్గాలకు బార్లు కేటాయించనున్నారు. పొరుగు రాష్ట్రాల పరిధిలో సరిహద్దుల్లో లిక్కర్ సేల్స్ పెరగడానికి గల కారణాలు కూడా అధికారులు సీఎంకు వివరించారు. ఏపీలో రేట్లు తగ్గడం, అన్ని బ్రాండ్లు అందుబాటులో ఉండడం, నాణ్యమైన మద్యం దొరకడంతో మన రాష్ట్రానికి చెందిన మద్యం వినియోగదారులు ఇక్కడే మద్యం కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. దీంతో మన దగ్గర సరిహద్దు ప్రాంతాల్లోని లిక్కర్ షాపుల్లో సేల్స్ పెరగగా.... పొరుగు రాష్ట్రాల్లో సేల్స్ తగ్గాయని అధికారులు తెలిపారు. గతంలో మన రాష్ట్రంలో నాణ్యమైన మద్యం లేకపోవడం, అధిక ధరలు, మంచి బ్రాండ్లు దొరక్క పోవడం వల్ల పొరుగు రాష్ట్రాలకు వెళ్లి మద్యం తాగేవాళ్లని గుర్తు చేశారు. మరోవైపు దీన్ని సొమ్ము చేసుకోవడానికి అక్రమంగా ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తెచ్చే వాళ్లని... ఇప్పుడు ఆ సమస్య లేకుండా పోయిందని అధికారులు చెప్పారు. అయితే ఇప్పుడు 12 జిల్లాల్లో పూర్తి స్థాయిలో ఐడీ లిక్కర్ ఫ్రీ జిల్లాలుగా ప్రకటించామని... ఈ నెలలో మరో 8 జిల్లాలను ఇల్లిసిట్లీ- డిస్టిల్డ్ లిక్కర్ (ఐడి లిక్కర్) ఫ్రీ జిల్లాలుగా ప్రకటిస్తామని చెప్పారు. సెప్టెంబర్ నాటికి మిగిలిన 6 జిల్లాలను కూడా ఐడీ లిక్కర్ ఫ్రీ జిల్లాలుగా ప్రకటిస్తామని అధికారులు సీఎంకు తెలిపారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370